అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 02-02-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 35 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

బడ్జెట్‌లో ఓట్ల బేరం..!

ప్రజాకర్షణే ధ్యేయంగా మోడీ సర్కారు పద్దు

పార్లమెంట్ సాక్షిగా ఎన్నికల 'మ్యానిఫెస్టో'

- అన్నదాతలు, కార్మికులకు భారీ తాయిలాలు
- ఐటీ రూపంలో వేతన జీవులకు గాలం..



నవతెలంగాణ, వాణిజ్య విభాగం

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని మోడీ సర్కారు మధ్యంతర బడ్జెట్ పేరుతో దేశ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. ఆర్థిక మంత్రి హెూదాలో పీయూష్ గోయల్ ద్వారా శుక్రవారం పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ పలికించింది. మధ్యంతర బడ్జెట్ రూపంలో బీజేపీ తన మ్యాని ఫెస్టోలోని కీలక అంశాలను ప్రజలకు వెల్లడించే ప్రయత్నం చేసింది. వాస్తవానికి మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రభుత్వాలు రానున్న రోజుల్లో తాము ఎలాంటి కొత్త పథకాలను ప్రవేశపెట్టనున్నది ప్రకటించవు. కేవలం తమ పాలనలో సాధించిన గత ఏడాది వ్యయాలు, రానున్న ఏడాదికి అంచనాల పద్దులను, విజయాలను, కొత్త ప్రభుత్వం అమలులోకి వచ్చే వరకు కావాల్సిన నిధులతో పద్దులను వెల్లడిస్తూ వస్తాయి. ఇదే సమయంలో ప్రత్యక్ష పన్నుల విషయంలోనూ ఎలాంటి సవరణలను ప్రకటించవు. కానీ మోడీ సర్కారు ఈ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చింది. గత నాలుగు సంవత్సరాలలో మోడీ సర్కారు ఆర్థికంగా అన్ని అంశాలలోనూ విఫలం కావడంతో బడ్జెట్‌లో ఆ ప్రభుత్వానికి గొప్పలు చెప్పుకొనే అవకాశం లేకుండా పోయింది. దీంతో భవిష్యత్తులో తాము ఆకాశాన్ని అరచేతిలో పెడుతామన్నంతగా బడ్జెట్ వరాలను కురిపించింది. సంప్రదాయాన్ని పక్కన బెడుతూ మేము చేసిందే కరెక్ట్ అనే విధంగా అటు ప్రజాకర్షక పథకాలను, ఇటు ప్రత్యక్ష పన్నుల విధానంలో సవరణలను ప్రకటించింది. ముఖ్యంగా దేశంలో తమ పాలన పట్ల అసంతృప్తిగా ఉన్న అన్నదాతలు, మధ్యతరగతి ప్రజలతో పాటు తటస్థులుగా ఉన్న ఉద్యోగులు, విద్యావంతులను తమవైపు లాక్కొనే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ...9లో

బడ్జెట్‌లో ముఖ్యాంశాలు..

- రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనా పథకం
- గోవుల సంతతి పెంచేందుకు కామధేను యోజనా పథకం
- ప్రత్యేక మత్స్య శాఖను ఏర్పాటు
- ప్రధానమంత్రి శ్రమ జ్యోతి మాన్‌ధన్ పేరుతో కొత్తపింఛను పథకం.
- కిసాన్ క్రెడిట్ కార్డు కింద రుణాలు
- ఈఎస్ఐ పరిమితి రూ.15వేల నుంచి రూ.21వేలకు పెంపు
- రానున్న రెండేండ్లలో 24 గంటల్లో ఆదాయపన్ను రిఫండ్
- సినిమా థియేటర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గింపు
- రూ,5లక్షల వరకు సంపూర్ణంగా ఆదాయ పన్ను మినహాయింపు
- స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని 40వేల నుంచి 50వేలకు పెంపు
- జీఎస్టీ నమోదు చేసుకున్న చిన్న మధ్యతరహా పరిశ్రమలకు కోటివరకు రుణ సదుపాయం పెంపు.
- అద్దెలపై పన్ను మినహాయింపు పరిమితి రూ.2.40లక్షలకు పెంపు.
- బ్యాంకులు, పోస్టాఫీసు డిపాజిట్లపై టీడీఎస్ పరిధి రూ.40వేలకు పెంపు
- కనీస పింఛను రూ.1000కి పెంపు
- హర్యానాలో కొత్తగా ఎయిమ్స్ ఏర్పాటు

హామీలకు కాగితమంత విలువ లేదు : సీతారాం ఏచూరి



ఈబడ్జెట్‌లో పేర్కొన్న హామీలకు వారు వినియోగించిన చిన్న కాగితమంత విలువ లేదని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. 10కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని హామీలను గుప్పించి 2014లో బిజెపి అధికారంలోకి వచ్చింది. మరోసారి ప్రజలను మోసగించడానికి ఈబడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈసారి విజయం సాధించదు.




దేశం మరింత బలోపేతం : మోడీ



ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను పరిగణలోకి తీసుకుందని ప్రధానిమోడీ అన్నారు. దేశాన్ని మరింత బలోపేతం చేయను న్నది. స్వాతంత్ర్యం తర్వాత తీసుకొచ్చిన భారీ పథకం 'పీఎం కిసాన్ యోజన'. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఆదాయ పన్ను పరిమితి పెంపు డిమాండ్‌ను నెరవేర్చాం. లోక్‌సభ ఎన్నికల అనంతరం సంపద పరంగా భారత్ అభివృద్ధి దిశగా పయనిస్తుందనడానికి ఇది కేవలం ట్రైలర్ మాత్రమే. ప్రభుత్వం చేసిన కృషికి ఫలితంగా పేదరికం రికార్డు స్థాయిలో తగ్గుతుంది.

రైతుల్ని అవమానించారు : రాహుల్



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. 15మంది పారిశ్రామికవేత్తలకు రూ. 3.5లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన ప్రధాని మోడీ, రైతులకు రోజుకు రూ.17 మాత్రమే ఇస్తారా?...అని ప్రశ్నించారు. ఇది రైతులను అవమానించడం కాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగున్నరేండ్లుగా మోడీ సర్కార్ విధానాలు రైతుల జీవితాల్ని చిన్నాభిన్నం చేసిందన్నారు.

ఎన్నికల తాయిలాలు : సురవరం



ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్‌లో తాయిలాలు ప్రభుత్వం ప్రకటించిందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఐదు ఎకరాల్లోపు రైతులకు 6వేలు సరిపోవనీ, ఎకరాకు 12వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సంక్షోభం పరిష్కారం కావాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సూచించారు.

మా పథకాన్ని కాపీ కొట్టారు: కేటీఆర్



రైతుబంధు పథకం స్ఫూర్తితోనే కేంద్ర బడ్జెట్‌లో రైతుల కోసం ప్రత్యేకస్కీమును ప్రవేశపెట్టారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా దేశంలోని రైతులకు ఎంతోకొంత సహా యం లభిస్తుందంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. తమ పథకాన్ని కాపీ కొట్టినప్పటికీ రైతుల కోసం ఎన్డీయేసర్కారు మంచి నిర్ణయం తీసుకున్నదని వ్యాఖ్యానించారు.



నిరుత్సాహపర్చింది : కేజ్రీవాల్

మోడీ సర్కార్ విసిరిన చివరి 'జుమ్లా' ఇది. మధ్యంతర బడ్జెట్ పూర్తిగా నిరాశపర్చిందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్విట్టర్‌లో స్పందించారు.

అకౌంట్ ఫర్ ఓట్స్: పి.చిదంబరం

కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం పెదవి విరిచారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఓట్ల కోసం చేసిన జిమ్మిక్కుగా అభివర్ణించారు.

రైతు సాయం మాకొద్దు : మమతా బెనర్జీ

తమ రాష్ట్రంలో అమలుజేస్తున్న పథకాల్నే కేంద్రం కాపీ కొట్టిందని ప.బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. వాటి పేర్లను మార్చి కొత్తగా ప్రవేశపెట్టారని మండిపడ్డారు.

ఎన్నికల జిమ్మిక్కు

- కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో




న్యూఢిల్లీ : కేంద్ర ఇన్‌ఛార్జ్ ఆర్థిక మంత్రి పీయూష్‌గోయల్ శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ మోడీ సర్కారు ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగమేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది. సమాచారాన్ని తొక్కిపట్టి, వాస్తవాలను తారుమారుచేసి జిమ్మిక్కులతో ప్రజలను మోసగించటంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికే ఆరితేరిందనీ, అటువంటి జిమ్మిక్కుల్లో భాగమే శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అనీ పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. మోడీ సర్కారు ట్రాక్ రికార్డు గురించి గొప్పలు చెప్పుకుంటూ, అరచేతిలో స్వర్గం చూపే హామీలను ఇస్తూ తాత్కాలిక ఆర్థిక మంత్రి చేసిన బడ్జెట్ ప్రసంగం ఇప్పటికే అనేక భారాలతో కుంగిపోతున్న భారతీయుల పట్ల క్రూరమైన పరిహాసమే అవుతుందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది.

నోట్ల రద్దు, పన్ను సంస్కరణల వంటి వాటి పరిణామాలను ప్రత్యక్షంగా అనుభవించినప్పటికీ ప్రభుత్వం మాత్రం అబద్దాలతో బడ్జెట్‌లో తప్పుడు లెక్కలను చూపుతోంది. పేదల నుండి పన్నుల రూపంలో పిండిన సొమ్మును మినహాయింపుల రూపంలో ధనికులకు కట్టబెడుతున్న మోడీ సర్కారు క్రూరమైన లాజిక్‌ను అనుసరిస్తోంది.

ప్రభుత్వం పార్లమెంట్‌లో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రానున్న ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్ కాదు. ఇటు లోక్‌సభతో పాటు ప్రభుత్వ పదవీ కాలం కూడా రెండు నెలల్లో ముగుస్తోంది. 2019-20 సంవత్సరానికి బడ్జెట్‌లో రెవెన్యూ సమీకరణ, కేటాయింపులు, వ్యయం వంటి అంశాలు ప్రజల తీర్పు అనంతరం ఏర్పడే 17వ లోక్‌సభలో రూపుదిద్దుకుంటాయన్న అంశం గమనార్హం. రానున్న ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా వుంటుందోనన్న బీజేపీ భయాందోళనలకు దర్పణమే శుక్రవారం నాటి బడ్జెట్. గత ఏప్రిల్-నవంబర్ మధ్య కాలానికి సంబంధించిన లెక్కలను పరిశీలిస్తే కేంద్ర పన్ను రెవెన్యూ గత ఆర్థిక సంవత్సరం కన్నా కేవలం 7.1 శాతం మేర మాత్రమే పెరిగాయి. అయితే 2017-18 వాస్తవ రెవెన్యూ వసూళ్ల కన్నా 2018-19 బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం 17 శాతం పెరుగుదలను ప్రతిపాదించారు. అది మాత్రమే కాదు. తాజా బడ్జెట్ అంచనాలలో ప్రభుత్వం ఆదాయపు పన్ను, జీఎస్‌టీ ద్వారా సమకూరే రెవెన్యూ వసూళ్లను గోరంతలు కొండంతలు చేసి చూపుతోందని పొలిట్‌బ్యూరో ఆగ్రహం వ్యక్తం చేసింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీకి అరకొర నిధులు

- గతేడాది కన్నా తక్కువే విదిల్చిన వైనం



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.60వేల కోట్లు కేటాయించినట్టు తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. అవసరమైతే ఈ కార్యక్రమానికి నిధులు పెంచుతామని చెప్పారు. అయితే, ఇందుకు సంబంధించి గణాంకాలను పరిశీలించినట్టైతే 2018-19 ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేసిన నిధుల కన్నా 1.8శాతం తక్కువగా ప్రస్తుత కేటాయింపులు జరిగాయి. ఈ ఏడాది జనవరిలో ఆర్థిక డిమాండ్లను తట్టుకునేందుకు గానూ ఈ కార్యక్రమానికి అదనంగా రు.6,084కోట్లు కేటాయించాల్సి వచ్చింది. దాంతో 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా ఇచ్చిన నిధులు రు.61,084కోట్లు అయ్యాయి. గతేడాది బడ్జెట్‌లో కేంద్రం కేటాయించింది రు.55వేల కోట్లే. గత కొన్నేండ్లుగా ఈ కార్యక్రమానికి బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు, అదనపు నిధుల కేటాయింపు గమనంలోకి తీసుకున్నట్టైతే, డిమాండ్ నిలకడగా పెరుగుతూ వస్తున్నప్పటికీ దాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వం ఎదుర్కొనలేకపోవడంతో పెండింగ్‌కు దారి తీసింది. చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమం పూర్తి స్థాయిలో అమలు కావాలంటే ఏడాదికి రు.80వేల కోట్లు అవసరమని పేర్కొంటూ 2018 బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఎన్‌ఆర్‌ఈజీఏ సంఘర్ష్ మోర్చా మెమోరాండం అందచేసింది. ఆ బడ్జెట్‌ను సమర్పించిన తర్వాత అరొకర నిధులంటూ మోర్చా ఒక ప్రకటన జారీ చేసింది. దీనివల్ల వేతనాల చెల్లింపు సకాలంలో జరగదని, కనీస వేతనాలు ఇవ్వడం కుదరదని, పని తక్కువగా జరుగుతుందని ఇటువంటి సమస్యలు అనేకం తలెత్తుతాయని పేర్కొంది. వేతనాలు సకాలంలో చెల్లించకపోతే కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు పేర్కొంటోంది. గ్రామీణప్రాంత దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమానికి నిధులు ఏమాత్రమూ సరిపోవడం లేదని జనవరి ప్రారంభంలో పలువురు ఎంపీలు, సామాజిక కార్యకర్తలు, ప్రధాని మోడీకి బహిరంగం లేఖ రాశారు.

కార్మికుల కంటే.. గో సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

- ఆవుల సంక్షేమానికి రూ. 750 కోట్లు.. కార్మికుల పింఛన్‌కు రూ. 500 కోట్లు
- కార్మికులపై మోడీ సర్కారు చిన్నచూపు



న్యూఢిల్లీ: గడిచిన ఐదేండ్ల కాలంలో ఆవుల పేరిట రాజకీయాలకు పాల్పడిన మోడీ సర్కారు.. తన చివరి బడ్జెట్‌లోనూ అదే బాటలో పయనించింది. తమకు ఆవుల కంటే కార్మికుల సంక్షేమం ఎక్కువ కాదని మరోసారి రుజువు చేసింది. నిన్న ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో గోవుల సంక్షేమానికి రూ. 750 కోట్లను ప్రకటించిన బీజేపీ సర్కారు.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు అందించే పింఛనుకు కేవలం రూ. 500 కోట్లను మాత్రమే కేటాయించింది. వివరాల్లోకెళ్తే.. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్థానంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్.. గోవుల సంక్షేమం కోసం 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్'ను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. గోమాతను రక్షించుకోవడంలో తమ ప్రభుత్వం వెనకాడబోదని తెలిపారు. ఈ నిధిని దేశీయ ఆవులను సంతతని పెంపొందించడానికి ఉపయోగిస్తామని చెప్పారు. కానీ, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు లేక, వారికి ప్రభుత్వ సదుపాయాలేవీ వర్తించకపోవడంతో దేశవ్యాప్తంగా కోట్లాది కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, వీరిపై మోడీ సర్కారు మరోసారి చిన్నచూపే చూసింది. 'ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్' పేరిట ప్రకటించిన ఈ పథకం అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 10 కోట్ల మందికి వర్తింపజేస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ పథకంలో చేరేవారు (29 ఏండ్లలోపు) నెలకు రూ. 100లు ప్రీమియం చెల్లించాలి. 60 ఏండ్లు నిండిన తర్వాత వారికి రూ. 3వేలు చెల్లించనున్నారు. కాగా, కార్పొరేట్‌లకు తొత్తులుగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోడీసర్కారు.. సార్వత్రిక ఎన్నికల వేళ తాజాగా ప్రకటించిన కొత్త పథకంలోనూ కార్మికలోకానికి సరైన ప్రాధాన్యం కల్పించకపోవడం ప్రస్తావనారం.

రైతుకు కనీస మద్దతు ధర ఇవ్వాలి

అప్పుడే దేశంలో రైతు రాజ్యం

- అన్నదాతల సమస్యలపై ఉధృత పోరాటం
- జంతర్‌మంతర్ ధర్నాలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, హన్నన్ మొల్లా
- నేడు చిట్‌ఫండ్ స్కాం బాధితుల హర్తాళ్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో:

దేశ రైతాంగానికి రుణమాఫీలు, ఆర్థిక సాయాలు కాదని... ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని ఆలిండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన రైతుబంధు వంటి పథకాలు శాశ్వత పరిష్కారం కావని అన్నారు. ఇటువంటి నిర్ణయాలు కేవలం ఉపశమనం మాత్రమే ఇస్తాయన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తే వ్యవసాయం రంగం సంక్షోభం నుండి బయటపడుతుందన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ జంతర్‌మంతర్ వద ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. మోడీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అశోక్ దావలే, హన్నన్ మొల్లా ప్రసంగించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తాము దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. జై జవాన్... జై కిసాన్... జై సంవిధాన్ నినాదం పేరుతో తాము పోరాడుతున్నామని వివరించారు. వ్యవసాయ రంగ నిపుణుడు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో నరేంద్రమోడీ 40 సార్లు వాగ్దానంచేసినట్టు గుర్తు చేశారు. ఇప డు మాత్రం నిటి ఆయోగ్ బూచి చూపి తప్పించుకుంటున్నారని విమర్శించారు. రైతులకు కనీస మదతు ధర ఇచ్చేంత వరకు తాము పోరాడుతామన్నారు. ఈ ధర్నాలో గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీ, మహిళా సంఘం నాయకురాలు పుణ్యవతి, రిటైర్డ్ మేజర్ సాత్బీర్ సింగ్, రైతు సంఘం నాయకులు, ఎంపీ సంతోష్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ద్రోహం.. నిర్లక్ష్యం.. : ఏఐకేఎస్

న్యూఢిల్లీ : రైతులను బీజేపీ ప్రభుత్వం మరోసారి ద్రోహం చేసిందనీ, వారి నిజమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేసిందని ఏఐకేఎస్ ఆరోపించింది. రెండు హెక్టార్లు, లేదా ఐదు ఎకరాల భూమి వున్న రైతుకు కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో ఏడాదికి రూ. 6,000/- ప్రకటించిన విషయం తెలిసిందే. నెలకు రూ. 500/- లేదా రోజుకు రూ.15/-లు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి పరిష్కారం కాదని ఏఐకేఎస్ విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేసింది. స్వామి నాథన్ కమిషన్ సిఫారసు చేసిన నిజమైన డిమాండు సి2+50శాతాన్ని అన్ని పంటలకూ అమలుచేయాలని ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. ఉత్పత్తికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని, తద్వారా రైతులకు మెరుగైనా ఆదాయం లభిస్తుందనీ, సాగు లాభదాయకంగా ఉంటుందని తెలిపింది. రైతులకు ఆదాయ వనరులు సమ కూరిస్తే.. రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లించే సామర్థ్యం వారికి వస్తుంది. గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే పరిస్థితి ఉంటుంది. మౌలిక సమస్యలను పరిష్కరించడానికి బదులు మోడీ ప్రభుత్వం రైతులను బుజ్జగించే చర్యలు చేప ట్టిందనీ, ఇది ఆమోదయోగమైనది కాదని ఏఐకేఎస్ స్పష్టంచేసింది. రైతు రుణ మాఫీ గురించీ కూడా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఆరోపించింది. రైతులను రుణ విముక్తులను చేస్తామని గత ఐదేండ్లుగా ప్రభుత్వం వాగ్దానం చేస్తూ వచ్చిందనీ, చాలా ముఖ్యమైన ఈ డిమాండ్ విషయంలో మోడీ ప్రభుత్వం ద్రోహ పూరితంగా వ్యవహరిస్తున్నదని, నేరపూరితమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని ఏఐకేఎస్ విమర్శించింది. ఏడాదికి రు.6వేలు ఇవ్వడమంటే వివిధ పంటల మొత్తం ఉత్పత్తి వ్యయంలో ఇది కేవలం 3 నుంచి ఐదు శాతం వుంటుందని పేర్కొంది.

ఈవీఎంలపై ఈసీని కలుస్తాం

- ఢిల్లీలో బీజేపీయేతర పార్టీల భేటీ
- మోడీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలం
- రాజ్యాంగ సంస్థల నిర్వీర్యంపై ఆగ్రహం



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఈవీఎంలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని బీజేపీయేతర పార్టీల నేతలు నిర్ణయించారు. ప్రజలకు ఈవీఎంలపై అనుమానాలున్నాయనీ, వాటిపై శ్రద్ధపెట్టాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉందని సమావేశంలో పాల్గొన్న నేతలు వెల్లడించారు. శుక్రవారమిక్కడ స్థానిక కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో బీజేపీయేతర 21 పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతోపాటు ఎకె ఆంటోని, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, కెవిపి రామచంద్రరావు (కాంగ్రెస్), సుజనాచౌదరి, సీఎం రమేష్(టీడీపీ), శరద్ పవార్, మాజిద్ మొమన(ఎన్సీపీ), ఎండీ సలీం, టీకే రంగరాజన్(సీపీఐ(ఎం)), డెరిక్ ఒబ్రెయిన్(తృణముల్ కాంగ్రెస్), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), సతీష్ చంద్ర మిశ్రా (బిఎస్పీ), డి రాజా(సీపీఐ), సంజయ్ సింగ్(ఆప్), శరద్ యాదవ్(ఎల్‌జేడీ), ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), మనోజ్ ఝా(ఆర్జేడీ), కనిమొళి(డీఎంకే), జయంత్ చౌదరి(ఆర్‌ఎల్‌డీ), డానిష్ అలీ(జేడీఎస్), బద్రుదీన్ అజ్మల్(ఏఐయూడీఎఫ్), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్(ఆరెస్పీ), అశోక్ కుమార్ సింగ్(జేవీఎం), జితీన్‌రామ్‌మాంఝీ (హెచ్ఎఎం), కోదండరామ్(టీజేఎస్), కురమ్ ఓరమ్(ఐయుఎంఎల్) తదితరులు పాల్గొన్నారు. 'సేవ్ నేషన్, సేవ్ డెమొక్రసీ' నినాదంతో దాదాపు రెండు గంటల సేపు సాగిన ఈ సమావేశంలో ఈవీఎం, రైతు సమస్యలు, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడి వంటి అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. నాలుగున్నరేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. రూ.30 వేల కోట్లు అనిల్ అంబానీకి నేరుగా లబ్ది చేకూర్చారని విమర్శించారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు రూ.3.5 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిన మోడీ... రైతులకు రోజుకు రూ.17 రూపాయలు మాత్రమే ఇస్తారా? ఏమిటిది? అని ప్రశ్నించారు. రైతులు, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడులు, రాఫెల్ తదితర అంశాలు వంటివే ఎన్నికల పోరాటంలో ప్రధాన అంశాలన్నారు. ఈవీఎంలపై సందేహాలున్నాయని, ఈ మేరకు సోమవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ అభిప్రాయాలు చెబుతామని తెలిపారు. ఈవీఎంలకు సంబంధించిన డాక్యుమెంట్‌ను కూడా ఎన్నికల సంఘానికి అందజేస్తామన్నారు. ఈవీఎంలపై రాజకీయపక్షాలతో పాటు ప్రజలకు కూడా అనేక అనుమానాలున్నాయని వివరించారు.

రాహుల్ గాంధీతో చంద్రబాబు భేటీ

బీజేపీయేతర పార్టీల సమావేశం అనంతరం రాహుల్ గాంధీతో చంద్రబాబు ఆయన కారులోనే రాహుల్ నివాసానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు సమావేశమయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఈవీఎంలపై ఎన్నికల సంఘానికి ఇచ్చే రిపోర్టుపై చర్చించామని చెప్పారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో రైతుల సమస్యలు ఉన్నాయని, రైతులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. రాజ్యాంగ సంస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. ప్రత్యర్థులపైన ఎక్కడికక్కడ దాడులు చేయడం, నిర్వీర్యం చేయడం రాజకీయంగా మంచిది కాదని అన్నారు. మరో పదిరోజుల్లో మళ్లీ సమావేశం అవుతామని, దేశంలోని సమస్యలపై చర్చిస్తామని అన్నారు.

రూ.28వేల కోట్లు ఇవ్వండి..

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి కేంద్ర ప్రభుత్వం మధ్యంతర డివిడెండ్ కింద రూ.28వేల కోట్లు కోరుతోందని కేంద్ర ఆర్థిక సంబంధాల కార్యదర్శి ఎస్.సి.గార్గ్ తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఆర్‌బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌గా రూ.40వేల కోట్లు కేంద్రానికి వచ్చాయని ఆయన తెలిపారు. ఇప డు కోరుతున్న రూ.28వేల కోట్లకు సంబంధించి నిర్ణయం వచ్చే బోర్డు సమావేశంలో తీసుకుంటారని గార్గ్ మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

గిరిజనులను అడవుల నుంచి తరిమేసేందుకే ఈ చట్టం



మాట్లాడుతున్న మిడియం బాబూరావు

- పెట్టుబడిదారులకు కట్టబెట్టే కుట్ర: విలేకరుల సమావేశంలో మిడియం బాబూరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులను అడవులనుంచి తరిమేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పదునైన చట్టాలు తీసుకువస్తున్నదని ఆదివాసి అధికార్ రాష్ట్రీయమంచ్ జాతీయ చైర్మెన్ మిడియం బాబూరావు విమర్శించారు. అడవులను పెట్టుబడిదారు చేతుల్లో పెట్టేందుకే కుట్ర పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా పట్టాలు ఇవ్వకుండా గిరిజనులను మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఆరు జిల్లాల పరిధిలోఒ అడవులు విస్తరించి ఉన్నాయని, తరతరాలుగా గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టం తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాలలో గిరిజనులు అటవీ భూములను సాగు చేస్తున్నా అటవీ హక్కుల చట్టం ప్రకారం టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ఎకరం భూమిని కూడా గిరిజనులకు పంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలి

గిరిజనులకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం వెంటనే రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలని బాబూరావు డిమాండ్ చేశారు. అడవుల్లో 29 రకాల అటవీ ఉత్పత్తులు అమ్ముకునే హక్కు ఉన్నదని చెప్పారు. అటవీ ఉత్పత్తులను పెంచి వాటిద్వారా గిరిజనులు జీవనోపాధి పెంచాలన్నారు. గిరిజన సహకార సంస్థను నీరు గార్చే కుట్ర కూడా జరుగుతున్నదని, గిరిజనులు సాగు చేస్తున్న భూములను స్వాధీనం చేసుకునేందుకు వారిపై దాడులు, పోలీసు కేసులు, బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఎఫ్ఆర్‌సీ కమిటీలను పునరుద్ధరించి, గిరిజనులు అటవీ ఫలాలను అమ్ముకునేందుకు వెసులు బాటు కల్పించాలన్నారు. వ్యవసాయం చేస్తున్న వారికి ఎటువంటి నష్టం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అభివృద్ధి పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తొడసం భీంరావు, కిషన్, హరి పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలం



- ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశాయి. తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎంబీ భవన్ నుంచి క్రాస్ రోడ్ వరకు వందలాది మందితో ప్రదర్శన నిర్వహించారు. నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. . ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి. వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు వి. సంజీవరెడ్డి, పద్మ, నారి ఐలయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, నర్సింహా, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోలో పొందుపరుస్తాం

- ఆర్ కృష్ణయ్యకు శరద్‌పవార్ హామీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పొందుపరుస్తామని ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షులు సీనియర్ నేత శరద్‌పవార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య శరద్‌పవార్‌ను కలిసారు. ఈ సందర్భంగా శరద్‌పవార్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన బీసీ సంఘాల నేతలతో న్యూ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, బీసీ నేతలు నీల వెంకటేశ్, భూపేశ్‌సాగర్, గోపినాథ్, రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని, కానీ తరతరాలుగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇస్తే తప్ప ఈ కులాలకు న్యాయం జరగదన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా బీసీలకు అన్యాయం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. అలాగే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బీసీల రక్షణ కోసం బీసీ యాక్టును తీసుకువచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

చారిత్రక తప్పిదం.. శరద్‌పవార్

రాజకీయాల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించకపోవడం చారిత్రక తప్పిదమని శరద్‌పవార్ అన్నారు. తమ పార్టీ ఇక నుంచి బీసీల పక్షాన నిలబడుతుందని హామీ ఇచ్చారు,.

ప్రాణభయమున్నా.. పోరాడతాం

మీడియాతో ప్రణయ్ కుటుంబీకులు



కంటతడి పెడుతున్న ప్రణయ్ తండ్రి బాలస్వామి

- భయపడుతూ పోలీసుల రక్షణలో బతుకుతున్నాం...
- హైదరాబాద్‌లోనూ కులపిచ్చోళ్లు..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమృత కుటుంబ సభ్యుల నుంచి ప్రాణభయం ఉందని, అయినప్పటికీ కుల దురంహాకారంతో ప్రణయ్‌ని చంపిన వారికి శిక్ష పడే వరకూ పోరాటం చేస్తానని ప్రణయ్ తండ్రి బాలస్వామి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో గల ఎన్‌ఎస్‌ఎస్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ప్రణయ్ తల్లిదండ్రులు ప్రేమలత, బాలస్వామి మాట్లాడారు. తొలుత బాలస్వామి మాట్లాడుతూ...తమ కోడలు అమృతకు బాబు పుట్టాడని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలిపారు. పోలీసుల రక్షణ మధ్యలో నెల నుంచి హైదరాబాద్‌లో రహస్యంగా ఉంటున్నామన్నారు. మిర్యాలగూడ, నల్లగొండలో సరైన రక్షణ ఉండదనే ఉద్దేశ్యంతోనే ఇక్కడకు వచ్చామన్నారు. అమృతను హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చేర్పించేందుకు యత్నించగా వివిధ కారణాలు చూపి పలువురు తిరస్కరించారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రణయ్ హత్య కేసులో ఐఎస్ఐ తీవ్రవాదుల హస్తముందని ఆరోపించారు. ఒక మర్డర్ చేసినా..రెండు మర్డర్లు చేసినా ఒకే శిక్ష అని, కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. మీడియా, పోలీసులు, ప్రజాసంఘాల మద్దతుతోనే తాము పోరాటం చేయగలుగుతున్నామన్నారు. వ్యక్తి గుణం, స్తోమతను తప్ప కులాన్ని చూడొద్దని పలువురిని కోరారు. అంబేద్కర్ చెప్పినట్టు ఆర్థిక, సామాజిక అసమానతలు పోయినప్పుడే దేశం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కులాంతర వివాహాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.

ప్రణయ్ తల్లి ప్రేమలత మాట్లాడుతూ...ఓ వైపు మనువడు పుట్టాడన్న సంతోషం ఉన్నా...కొడుకు చనిపోయాడన్న బాధ వెన్నాడుతూనే ఉన్నదన్నారు. హైదరాబాద్‌లో ఉండేందుకు కిరాయి ఇల్లును వెతికితే...'మీది ఏ కులం' అని అడుగుతున్నారని, కులపిచ్చిగాళ్లు అన్ని చోట్లా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమృత తల్లి గిరిజారాణి మధ్యవర్తులను పంపి ఇంకా వేధిస్తోందన్నారు.

సామాజికవేత్త సజయ మాట్లాడుతూ... పోలీసుల సంరక్షణలో ఆస్పత్రిలో అమృత చూపించుకోవడం, ప్రసవం కోసం వెళ్తే పలు ఆస్పత్రుల యాజమాన్యాలు తిరస్కరించడం, ఆస్పత్రుల ఎదుట సెల్ఫీ దిగాలని ఆమెను పలువురు వేధించడం..లాంటి ఘటనలను చూస్తుంటే మనం ఏ సమాజంలో ఉన్నామో అర్థం కావట్లేదన్నారు. అమృత తనను తాను కాపాడుకుంటూ ప్రణయ్ కుటుంబ సభ్యులను కాపాడుకోవటం కోసం ఆమె చేస్తున్న పోరాటం అసాధారణమన్నారు.

ప్రణయ్ కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఓడబ్ల్యూ, మహిళా హక్కుల నేత సంధ్య మాట్లాడుతూ..హంతకులను పౌర సమాజం నుంచి వెలివేయాలన్నారు. కులనిర్మూలన కోసం పోరాడుతున్న ప్రణయ్ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

ఓట్ల కోసమే కేంద్ర బడ్జెట్ : టీపీసీసీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో లబ్దిపొందేందుకు కేంద్రం ఓట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్ విమర్శిం చారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం వ్యాపారస్తుల మన్ననలు పొందే ప్రయత్నం చేసిందని విమర్శించారు.ఐదేండ్లుగా రైతులను పట్టించుకోని మోడీసర్కారు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో వారిపై ప్రేమ కురిపిస్తున్నదని ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి చెప్పారు

మంత్రివర్గ విస్తరణ చేయరా? : బీఎల్ఎఫ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ఫలితాలొచ్చి 50 రోజులు గడిచినా మంత్రివర్గ విస్తరణ ఎందుకు చేయడంలేదని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ బహుదూర్ ప్రశ్నించారు. శుక్రవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఓట్లతో గెలిస్తే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేవారనీ, కేసీఆర్ కోట్ల రూపాయలతో గెలిచారని విమర్శించారు. అందుకే ప్రజల సమస్యలపై ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు ఆర్థిక మంత్రి లేరని, చలిగాలులతో ప్రజలు అనారోగ్యం పాలైతే మంత్రి లేడని, ఇలా అన్ని శాఖలకు మంత్రులు లేకుండా పరిపాలన ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.

సంస్కారం లేని చదువు వాసనలేని పూవులాంటిది.
- మహాత్మాగాంధీ

సంపాదకీయం

దిగజారుడు ప్రసంగం

పార్లమెంటరీ విలువల్ని మోడీ సర్కార్ తుంగలో తొక్కింది. ఓట్ల కోసం దేనికైనా తెగించడానికి సిద్ధపడింది. కేవలం రెండు లేదా మూడు మాసాల కోసం ఓట్ ఆన్ ఎకౌంట్ ప్రవేశపెట్టవల్సిన పాలకులు మధ్యంతర బడ్జెట్ పేరుతో కోట్లాది భారత ప్రజానీకాన్ని మోసం చేసారు. ఏప్రిల్‌లో ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు రెగ్యులర్ బడ్జెట్ పెడతారు. కానీ మధ్యంతర బడ్జెట్ పేరుతో ఎన్నికల మ్యానిఫెస్టో స్థాయికి దిగజార్చింది. ప్రభుత్వం డబ్బుతో ఓట్లు కొనుక్కునేందుకు నిస్సిగ్గుగా వలవేసింది. సంక్షేమం పేరుతో ఓట్లకు బేరం పెట్టింది. అందుకే ఇది అభివృద్ధి బడ్జెట్ కాదు. సంక్షేమ బడ్జెట్ అసలే కాదు. కేవలం ఓట్ల కొనుగోలు బడ్జెట్.

పెట్రోలు, డీజిల్, నిత్య జీవితావసర సరుకుల ధరలు పెంచిన పాలకులే ధరలను నియంత్రించామని నమ్మబలుకుతున్నారు. మొత్తం మీద బడ్జెట్ ప్రసంగం ఎన్నికల సభలాగా సాగింది. ప్రధాని సహా ఓట్ల పంట పండుతుందన్న ఆశతో చప్పట్లు చరిచారు. ఇక చైతన్యవంతంగా స్పందించవల్సింది ప్రజలే!

అధికార పార్టీ తన నాలుగున్నరేండ్ల పాలనలో పనితనం చూపించి ఓట్లు అడగాలి. రాబోయే కాలంలో చేసేవి మ్యానిఫెస్టోలో చెప్పవచ్చు. కానీ గత కాలమంతా వైఫల్యాల పరంపర కావటంతో... పనితనం చూపి ఓట్లడిగే ధైర్యం లేదు. అందుకే ప్రభుత్వ ఖజానా నుంచి ఏప్రిల్ మాసంలోనే రైతుల ఎకౌంట్‌లో డబ్బువేసి ఓట్లు అడిగేందుకు ఓట్ల కొనుగోలు పథకాన్ని చట్టబద్ధం చేసే ప్రయత్నమే ఇది.

మూడేండ్లుగా రైతుల ఆత్మహత్యల సంఖ్య చెప్పకుండా దాచిపెట్టింది మోడీ సర్కార్. అంకెలు దాచవచ్చు. రైతుల ఆందోళన దాగదు కదా! గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో రైతులమీద కాల్పులు జరిపింది. ఢిల్లీ పొలిమేరలో నీటి ఫిరంగులు, టియర్ గ్యాస్, లాఠీచార్జీలు ప్రయోగించింది. రైతుల ప్రాణాలు బలిగొన్నది. ఇప్పుడు ఎన్నికల తరుణంలో రైతుకు ఏడాదికి ఆరువేలు నగదు సాయం ప్రతిపాదించింది. నిత్యజీవితావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అతితక్కువ ధరలున్న సమయంలో మనదేశంలో పెట్రోలు, డీజిల్ ధరలు అత్యధికంగా పెంచింది. పేదల నుంచి మధ్యతరగతి వరకు అందరి జేబులకు చిల్లులు పెట్టింది. ఇప్పుడు మధ్యతరగతికి పన్ను రాయితీ, అసంఘటిత కార్మికుల పెన్షన్ పెంపు లాంటి పథకాలను ఎరగా వేసింది. ఘనంగా చెప్పుకున్న రైతు బీమావల్ల అన్నదాతలకు మేలు జరగలేదని పార్లమెంటరీ కమిటీ తేల్చింది. రైతులు రూ.42వేల కోట్లు ప్రీమియం చెల్లించగా కేవలం రూ.33వేల కోట్లు మాత్రమే పరిహారంగా చెల్లించారు. మిగిలిందంతా ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభంగా కట్టబెట్టారు. జన్‌ధన్ ఎకౌంట్లలో జనం జమచేసింది రూ.85వేల కోట్లు కాగా, వారికి ఓవర్‌డ్రాఫ్టు రూపంలో ఇచ్చింది కేవలం



రూ.340కోట్లు. స్టార్ట్ అప్స్ ఒక డొల్ల అని తేలిపోయింది. 82శాతం మంది లబ్దిదారులకు బెనిఫిట్ అందలేదని గణాంకాలు వెక్కిరిస్తున్నాయి.

ప్రసంగమంతా అబద్ధాల కూర్పుగా సాగింది. మోడీ పాలనలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఈ ప్రభుత్వ గణాంకశాఖ లెక్కల ప్రకారమే పారిశ్రామికాభివృద్ధి దిగజారింది. తయారీరంగం స్తంభించింది. పెద్దనోట్ల రద్దు తర్వాత భారతదేశం అభివృద్ధి వెనుకపట్టు పట్టిందని ప్రపంచబ్యాంకే తేల్చింది. విదేశీ పెట్టుబడులు బాగా పెరిగాయని చెప్పుకున్నారు. ఇందుకు భిన్నంగా ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడులన్నీ కలిపితే 14ఏండ్ల కనిష్టానికి పడిపోయాయని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే కొత్త ఉద్యోగాలు సృష్టించటం అన్నారు బడ్జెట్ ప్రసంగంలో. కానీ జరిగిందేమిటి? నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఇప్పుడే నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని నేషనల్ శాంపుల్ సర్వే తేల్చింది. కేంద్ర ప్రభుత్వ లేబర్ బ్యూరో సర్వేలో కూడా ఇదే బట్టబయలైంది. అజీంప్రేమ్‌జీ యూనివర్సిటీ బృందం అధ్యయనంలో అనేక కొత్త కోణాలు బయటపడ్డాయి. మోడీ పాలనలోనే నిరుద్యోగం గరిష్ఠస్థాయికి పెరగటంతోపాటు పురుషులకన్నా మహిళల్లోనూ, అగ్రవర్ణాల యువతకన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీలలోనూ నిరుద్యోగం ఎక్కువగా ఉన్నదని నిగ్గుదేలింది. ప్రయివేటీకరణ ఫలితంగా రిజర్వేషన్లు నిరుపయోగమైన ఫలితమిది. పెద్దనోట్ల రద్దు తర్వాత తొలి ఏడాదిలోనే నలభైలక్షల ఉద్యోగాలు ఊడిపోయాయని అఖిల భారత ఉత్పత్తిదారుల సంఘం నివేదిక చెబుతోంది. గతేడాది ఒక్క సంవత్సరంలోనే కోటీ పదిలక్షల మంది ఉద్యోగాలు ఊడిపోయాయని సీఎంఐఈ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ముందుంచిన నివేదికల ప్రకారమే దేశంలో 60లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇక కొత్త ఉద్యోగాలు ఎక్కడిస్తున్నట్టు?

అవినీతి నిర్మూలించామని చెప్పుకున్నారు. రాఫెల్ కుంభకోణం, విజయ్‌మాల్యా, లలిత్‌మోడీ, నీరవ్‌మోడీ లాంటి మోసగాళ్ళు పారిపోయిన తీరుచూస్తే నవ్విపోదురు గాక... అన్నట్టున్నది. బ్యాంకులను మోసగించిన కేసులు ఈ నాలుగేండ్లలో నాలుగురెట్లు పెరిగాయని రిజర్వు బ్యాంకు చెప్పింది. చందా కొచ్చర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి లాభం పొందారని జస్టిస్ శ్రీకృష్ణ కమిటి నిర్ధారించింది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాత్రం "ఆమె గౌరవప్రదమైన వ్యక్తి... ఆమె మీద కేసునమోదు చేయటమేమిటి?" అంటున్నారు. పెట్రోలు, డీజిల్, నిత్య జీవితావసర సరుకుల ధరలు పెంచిన పాలకులే ధరలను నియంత్రించామని నమ్మబలుకుతున్నారు. మొత్తం మీద బడ్జెట్ ప్రసంగం ఎన్నికల సభలాగా సాగింది. ప్రధాని సహా ఓట్ల పంట పండుతుందన్న ఆశతో చప్పట్లు చరిచారు. ఇక చైతన్యవంతంగా స్పందించవల్సింది ప్రజలే!

మోడీ మోసాలకు పరాకాష్ట 2019 తాత్కాలిక బడ్జెట్

ధీర

రెండువేల పందొమ్మిది వోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వివరాలు పరిశీలిస్తే 2014లో మొదలైన మోడీ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలు పరాకాష్టకు చేరాయని స్పష్టమవుతోంది. బడ్జెట్ ప్రవేశపెట్టినంతసేపూ జాతీయ టెలివిజన్ ఛానెళ్లు అన్నీ ఆదాయ పన్ను రాయితీ, రైతు సహాయ పథకం, పెన్షన్ పథకం సరళీకర వంటి ఆకర్షణీయమైన హామీలను పదే పదే ప్రసారం చేశాయి. సమీప భవిష్యత్తులో మోడీ ప్రభుత్వం అందించినంత సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదని గొప్పలు చెప్పుకోవటం అప్పుడే మొదలైంది. తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయెల్ తన ఉపన్యాసంలో బీజేపీ ప్రభుత్వం పన్నుల విధానంలో అమలు చేసిన సంస్కరణల ఫలితంగా పన్ను చెల్లింపుదార్ల సంఖ్య విపరీతంగా పెరిగిందనీ, లక్షల కోట్ల ఆదాయం వచ్చిందనీ చెప్పుకొంది. కాని వాస్తవాలు ఏమిటి? నిజంగా ప్రభుత్వం అంత గొప్ప సంక్షేమ బడ్జెట్‌ను ప్రతిపాదించిందా? వివిధ పథకాలకు కేటాయించిన నిధులు పెంచిందా? ప్రభుత్వ ఆదాయం పెరిగిందా అన్న మూడు ప్రశ్నలు వేసుకుంటే ఈ బడ్జెట్ ఉత్తిత్తిదే... అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

మొత్తంమీద గమనిస్తే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో మెరుగుదల సాధించటానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని గాలికొదిలి కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం అప్పులు చేసి మరీ ఖర్చు పెట్టడానికి సిద్ధమైందని స్పష్టమవుతూనే ఉంది. యూపీఏ 1 హయాంలో ఉపాధి హామీ చట్టం, రైతు రుణ మాఫీ వాగ్దానాలు చేస్తే దిగాలుపడిన స్టాక్ మార్కెట్ అదే తరహా పథకాన్ని బీజేపీ ప్రకటిస్తే ఆకాశమంత ఎత్తుకు ఎదిగి సంబరాలు చేసుకోవటం వ్యాపార వర్గానికీ బీజేపీకీ ఉన్న అనుబంధాన్ని నిర్ధారించే సందర్భంగా నిలిచిపోతుంది.

ముందుగా రాబడి గురించి చూద్దాం. ప్రభుత్వం చెప్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుదల వల్ల దేశానికి ఒనగూడింది ఏమీ లేదని రాబడి లెక్కలు పరిశీలిస్తే తెలుతుంది. జీఎస్టీ వల్ల పన్నుల ఆదాయం గొప్పగా పెరుగుతుందనీ ఆ విధంగా వచ్చిన ఆదాయంతో సంక్షేమ పథకాలకు ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు పెట్టవచ్చన్నది బీజేపీ వాదన. కానీ పార్లమెంట్‌కు సమర్పించిన రాబడి లెక్కలు గమనిస్తే జీఎస్టీ వల్ల అదనంగా వచ్చిన ఆదాయం ఏమీ లేదని స్పష్టమవుతున్నది. జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని చెప్పటానికి ఓ ప్రమాణం దిగుమతి సుంకాలు. ఆర్థిక వ్యవస్థ ఘనంగా ఉంటే ఆర్థిక వ్యవస్థ అవసరాలు తీర్చుకోవటానికి, వినిమయ అవసరాలు తీర్చుకోవటానికి దిగుమతులు పెరుగుతాయి. దిగుమతులు పెరగటం అంటే దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలి. కానీ దిగుమతి సుంకాల ద్వారా వచ్చిన ఆదాయం 2017-18 ఆర్థిక సంవత్సరంలో లక్ష 28వేల కోట్లు అయితే 2018-19 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం లక్షా 26వేల కోట్లు. మరో సూచన కేంద్ర ఎక్సైజు సుంకాలు. 2017-18లో ఈ పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం రెండు లక్షల 58 వేల కోట్లు కాగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం రెండు లక్షల 59వేల కోట్లు మాత్రమే. వచ్చే సంవత్సరం కూడా ఇంతకన్నా ఈ పద్దు కింద వచ్చే ఆదాయం పెరగదు అని అంచనా వేశారు. ఈ రెండు పద్దులు గమనిస్తే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ గొప్పతనం గురించి చెప్తున్న విషయాలు అన్నీ కాకమ్మ కబుర్లే అని తేటతెల్లమవుతుంది.

కేంద్ర ప్రభుత్వ ఆదాయం పెరగటానికి మరో మార్గం ప్రత్యక్ష పన్నులు. అంటే వేతన జీవుల మీద విధించే ఆదాయపు పన్ను. కంపెనీల మీద విధించే కార్పొరేట్ పన్ను. సంపన్నుల మీద విధించే సంపద పన్ను. ప్రభుత్వం వాగ్దానం ప్రకారమే ఇప్పటిరకు 2.5లక్షలుగా ఉన్న ఆదాయపన్ను పరిమితిని ఐదు లక్షలకు పెంచారు. అంటే ఇప్పటి వరకు ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తున్న వారిలో సగం మంది ఇక మీదట పన్ను కట్టాల్సిన అవసరం లేదు. అయినా ఆదాయపు పన్ను పద్దు కింద కేంద్రానికి జమయ్యే ఆదాయంలో ఎటువంటి మార్పు లేదు... ఆదాయపు పన్ను పరిధి పెంచిన తర్వాత ఆదాయపు పన్ను చెల్లింపుదార్ల సంఖ్య తగ్గిన తర్వాత కూడా అంతే మొత్తంలో ఆదాయపు పన్ను ఎలా వసూలు చేయాలో చార్టెడ్ అక్కౌంటెంట్, బీజేపీ రాజకీయ విరాళాలు వసూలుచేయటంలో దిట్ట అయిన పియూష్ గోయెల్‌కు మాత్రమే తెలిసిన విద్య. ఆర్థిక వ్యవస్థ ఆగమేఘాల మీద పురోగమిస్తున్నప్పుడు కార్పొరేట్ పన్ను పద్దు కింద వచ్చే ఆదాయం పెరగాలి. గత మూడేండ్లల్లో ఈ పద్దు కింద కేంద్రానికి వచ్చే ఆదాయంలో చెప్పుకోదగ్గ మార్పులు లేకపోవటాన్ని గమనిస్తే కార్పొరేట్ కంపెనీల మన్ననలు పొందేందుకు బీజేపీ ప్రభుత్వం ఎంతగా ఆరాటపడుతుందో అర్థమవుతుంది. ఏటా ప్రపంచ కుబేరుల జాబితాలో పెరుగుతున్న భారతీయుల సంఖ్యచూసి సంస్కరణల గొప్పదనం గురించి జబ్బలు చరిచే ప్రభుత్వాలు సంపదపన్ను ద్వారా సేకరించే ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నం చేయకపోవటం ప్రభుత్వం యొక్క పక్షపాత వైఖరిని తెలియచేస్తోంది. ప్రధాన ఆదాయ వనరుల నుండి వచ్చే ఆదాయంలో పెద్దగా మార్పు లేకపోయినా బడ్జెట్ మోతాదును మాత్రం పెంచేసింది బీజేపీ ప్రభుత్వం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 21,41,975 కోట్లు. 2018-19 సంవత్సరానికి ఆశిస్తున్న ఆదాయం 24,57,235 కోట్లు. కానీ 2019-20 సంవత్సరంలో 27,84,200 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేండ్లల్లో కేంద్రానికి వచ్చే స్థూల రాబడిలో ఎటువంటి మార్పు లేదు అంటేనే ఆర్థికాభివృద్ధి గురించి కేంద్ర ప్రభుత్వం చెప్తున్న మాటలకు దేశం ముందుంచుతున్న బడ్జెట్ గణాంకాలకు మధ్య పొంతన లేదని స్పష్టమవుతున్నది. అయినా ఈ సంవత్సరానికి అంటే 2019-20 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ రాబడి గతేడాది కంటే దాదాపు రెండున్నర లక్షల కోట్లు ఎక్కువ ఉంటుందని అంచనా వేసింది. అయితే ఈ మొత్తాన్ని అప్పుల రూపంలో సేకరించాలని ప్రతిపాదించింది. అప్పు చేయటం కూడా మోడీ ప్రభుత్వం సాధించిన ఘనతగా చెప్పుకుని దేశాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాలని ప్రయత్నం చేయటం ఆర్థిక వ్యవస్థ గురించిన వాస్తవాలను మరుగున పెట్టే ప్రయత్నం తప్ప మరోటి కాదు.



ఇది ఎన్నికల బడ్జెట్ అన్నది అందరికీ తెలిసిందే. ఏకంగా రైతాంగానికి 60వేల కోట్ల రూపాయల రొక్కం అక్కౌంట్లలోకి జమ చేయబోతున్నట్టు ప్రకటించారు ఆర్థిక మంత్రి. 2008లో పంట రుణాల మాఫీ పథకం అమలుకు ఖర్చు చేసిన మొత్తం సుమారు 80 వేల కోట్లు. ఫలితంగా తర్వాతి మూడు నాలుగేండ్లు వ్యవసాయ రంగంలో ఎంతో కొంత కదలిక రావటానికి నాటి యూపీఏ అమలు చేసిన రుణమాఫీ పథకం పని చేసింది. కానీ ఇప్పుడు మోడీ ప్రతిపాదిస్తున్న తెలంగాణ మోడల్ రైతు సహాయ పథకం వ్యవసాయ రంగానికి ఎంత మేలు చేస్తుంది అన్నది ప్రశ్నార్థకమే.

రక్షణ రంగానికి కేవలం 15వేల కోట్లు మాత్రమే (2.85 లక్షల కోట్లు నుంచి 3.05 లక్షల కోట్లు) పెంచి దేశ రక్షణకు ఎంతో సేవ చేస్తున్నట్టు చెప్పుకోవటం బీజేపీకి మాత్రమే చెల్లింది. ఈ సంవత్సరం రక్షణ రంగానికి పెంచిన ప్రతిపాదిత కేటాయింపులు రాఫెల్ ఒప్పందంలో అనిల్ అంబానికి ఇచ్చే సబ్ కాంట్రాక్టు విలువ కంటే తక్కువ అన్న విషయాన్ని గమనించాలి. ఈ పేరు మీద జాతీయ భావాలు రెచ్చగొట్టే ప్రయత్నమే కనపడుతున్నది. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవటంలో ప్రధాన పాత్ర ఎరువుల సబ్సిడీది. కానీ ఈ పద్దు కింద తాత్కాలిక బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ కోసం అదనంగా కేటాయించినది కేవలం ఐదువేల కోట్లు మాత్రమే. గత సంవత్సరం 70వేల కోట్లు ఖర్చు పెడితే ఈ సంవత్సరం 74,986కోట్లు ఖర్చు పెట్టాలని ప్రతిపాదించింది. ప్రభుత్వమే వాగ్దానం చేస్తున్నట్టు రైతుకి సహాయం పథకం ద్వారా వ్యవసాయరంగంలో భారీ కదలిక వచ్చి పెద్దఎత్తున సాగుభూమి విస్తరించే మాట నిజమే అయితే తదనుగుణంగా ఎరువుల సబ్సిడీ ఉండాలి. కానీ అత్తెసరు సబ్సిడీ పెరుగుదల గమనిస్తే ప్రభుత్వ వాగ్దానం మీద ప్రభుత్వానికే నమ్మకం లేదన్న విషయం స్పష్టమవుతోంది. ఆహార సబ్సిడీ కోసం అదనంగా కేటాయించింది 13వేల కోట్లు. మొత్తం ఆహారపు సబ్సిడీ కింద గత సంవత్సరం లక్షా 71 వేల కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం లక్షా 84 కోట్లు కేటాయించింది.

పేద ప్రజల ప్రయోజనాలకు పెద్ద పీట వేశామని చెప్పుకుంటున్నా విశ్లేషణల్లో వాస్తవం ఏమీ లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య శాఖల పద్దుల్లో గుర్తించదగిన పెరుగుదల ఏమీ లేదు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు గత మూడేండ్లల్లో ఎటువంటి పెరుగుదలకు నోచుకోలేదు. ప్రపంచ వ్యాప్తంగా గొప్పదని చెప్పుకున్న ఆయుష్మాన్ భవ పథకానికి (ఆరోగ్యసేవలు) కేటాయింపులు పెంచకపోవటాన్ని గమనిస్తే ఈ పథకం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదన్న సందేహం తలెత్తుతున్నది. పేద మహిళల కన్నీళ్లు చూడలేక దీపం పథకం దేశవ్యాప్తం చేశామని చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చే గ్యాస్ సబ్సిడీ కేటాయింపులు గత సంవత్సరం కంటే వచ్చే సంవత్సరం మరింత తక్కువగా కేటాయించటం గమనార్హం.

మొత్తంమీద గమనిస్తే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో మెరుగుదల సాధించటానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని గాలికొదిలి కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం అప్పులు చేసి మరీ ఖర్చు పెట్టడానికి సిద్ధమైందని స్పష్టమవుతూనే ఉంది. యూపీఏ 1 హయాంలో ఉపాధి హామీ చట్టం, రైతు రుణ మాఫీ వాగ్దానాలు చేస్తే దిగాలుపడిన స్టాక్ మార్కెట్ అదే తరహా పథకాన్ని బీజేపీ ప్రకటిస్తే ఆకాశమంత ఎత్తుకు ఎదిగి సంబరాలు చేసుకోవటం వ్యాపార వర్గానికీ బీజేపీకీ ఉన్న అనుబంధాన్ని నిర్ధారించే సందర్భంగా నిలిచిపోతుంది. ■

మెయిల్ @ నవతెలంగాణ



జి. తిరుపతయ్య

రాజ్యం భరోసాతో బరితెగింపు! తప్పు తప్పు..

భారత్ మాతాకి జై అంటూ ఆ భారతమాత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు తన జీవితాన్ని ధారపోసిన జాతిపిత మహాత్మా గాంధీ బొమ్మను దహనం చేయడం అపచారం కాదా? 30 జనవరి 1948న నాథూరాం గాడ్సే మహాత్మా గాంధీని ఎంత కిరాతకంగా కాల్చిచంపాడో మనకు తెలియదు కానీ, నిన్న ఉత్తరప్రదేశ్‌లోని అలీగడ్ ప్రాంతంలో తమకు తాము హిందూ మతానికి ప్రతినిధులుగా భావించే హిందూ మహాసభ నాయకులు మహాత్మా గాంధీ బొమ్మను తగులబెట్టడం, ఆ బొమ్మలో రక్తపు సంచులను ఉంచి తుపాకీ ద్వారా కాల్పులు జరుపుతూ బొమ్మలోంచి కారుతున్న రక్తాన్ని చూసి పైశాచిక ఆనందంతో గాడ్సేను కీర్తిస్తూ నినాదాలు చేసిన కిరాతక దృశ్యం మాత్రం గుండెల్ని పిండేసింది.

పశ్చిమబెంగాల్లో ముఖ్యమంత్రిని కాస్త విమర్శిస్తూ చేస్తూ ఒక కార్టూన్ గీసినందుకు విలేకరిని జైల్లో పెట్టారు. మొన్నటికి మొన్న చెన్నైలో ప్రధానమంత్రి నరేంద్రమోడీపై కార్టూన్ గీసినందుకు సత్యరాజ్ అనే చిత్రకారున్ని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కానీ గాంధీని అవమానిస్తే ఎవ్వరూ మాట్లాడటం లేదు. ఈ నాయకులంతా మహాత్మాగాంధీ కన్నా గొప్పవారా? ఎవరికి వారు సమాధానం చెప్పుకోవాల్సిన ప్రశ్నలు ఇవి. గాంధీ ఒక మనిషి మాత్రమే కాదు. ఒక ఆలోచన, ఒక ఆచరణ. భారత స్వాతంత్రోద్యమానికి ప్రతీక. అలాంటి మహానేత బొమ్మను ఇంత కిరాతకంగా అవమానిస్తూ కాల్చివేయడం, బొమ్మలోంచి కారుతున్న రక్తాన్ని చూసి మరిన్ని బుల్లెట్లు పేల్చి రాక్షసానందాన్ని పొందడం చాలా చాలా విచారకరం, బాధాకరం. దిష్టి బొమ్మలు గడ్డితో తయారు చేయడం చూశాం, కానీ రక్తంతో చేసినవి ఇప్పుడే చూస్తున్నాం. నా దేశంలో ఇలాంటి ప్రవర్తనలు ఉన్నాయా అంటూ ప్రతి ఒక్కరు గుండెలు బాదుకోవాల్సిన సందర్భం ఇది.

అమరవీరుల దినంగా 30 జనవరిన గాంధీని హత్యచేసిన నాథూరామ్ గాడ్సేను పొగుడుతూ గతంలో కొన్ని కార్యక్రమాలు అక్కడక్కడా హిందూ మహాసభ వారు నిర్వహించే వారు. కానీ కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాథూరామ్ గాడ్సేకి ఏకంగా గుడి నిర్మించి వారోత్సవాలను చేయడం జరిగింది. అప్పుడే గనుక ప్రభుత్వం నుంచి అభ్యంతరం తెలిపి ఉంటే ఈనాడు మహాత్మా గాంధీ పట్ల ఇంతటి అవమానానికి తెగబడే వారు కారు. అసాంఘిక శక్తులపై ఉదాసీన వైఖరి ఎంతటి ప్రమాదమో ఈ ఘటన ద్వారా మనకు అర్థమవుతుంది. తమ తమ రచనల ద్వారా భావ ప్రకటన చేసినందుకే రచయితలను, కవులు, కళాకారులను దేశానికి ప్రమాదకారులుగా చిత్రీకరించి అరెస్టు చేస్తున్నారు. కానీ జాతిపితను ఇలా అవమానించడం, ఇలా పిశాచాల్లా ప్రవర్తించడం దేశ ద్రోహం కిందకు రాదా? ఈ ప్రశ్న పాలకులు వేసుకోవాల్సిన అవసరం ఉన్నది. హిందూ మహాసభ ఇంత బరితెగించడం వెనుక ధైర్యం ఎవరో అందరూ ఊహించగలరు. అయితే ఇక్కడ ప్రశ్నించవలసింది హిందుత్వానికి లేదా హిందువులకు మేమే ప్రతినిధులము అని చెప్పుకుంటూ ఇలా దుశ్చర్యలకు పాల్పడుతున్న సదరు సంఘాలను, సంస్థలనే కాదు, ఇంత జరిగినా స్పందించని ప్రభుత్వాన్ని కూడా! తన రాజకీయ అవసరాలకు గాంధీజీని నెత్తికెత్తుకుంటూ, ఆయనను నెత్తురుతో అవమానించినా చడీ చప్పుడులేని ప్రధాని మౌనాన్ని కూడా! ఒక రాజకీయ నాయకుని దిష్టి బొమ్మను తగలబెడితేనే అరెస్టు చేసే పాలకులు మహాత్ముడిని అవమానించిన ఈ చర్యను ఎలా ఉపేక్షిస్తారు. ఇప్పుడున్న ఏలికల మౌనానికి అర్థం భవిష్యత్తులో తాము కూడా ఇలాంటి చర్యలకు దిగబోతున్నారనే సంకేతమేనా?

చరిత్రలో తమ పాత్ర లేదు కాబట్టే చరిత్ర మొత్తాన్నీ నామరూపాలు లేకుండా చేయాలనే దుష్ట సంకల్పంతో ఇలాంటి పనులకు పూనుకుంటు న్నారన్నది స్పష్టం. "నీ తండ్రికి నువ్వు గొయ్యి తవ్వితే నా తండ్రికి(నీకు) నేను గొయ్యి తవ్వుతా" అనే నీతిని తెలిపిన తాతా-మనవడు తెలుగు సినిమా కథను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ఇలాంటి మితిమీరిన ప్రవర్తనలను రాజ్యం ప్రస్తుతం సమర్థిస్తూ వస్తే ఈ ప్రవర్తనలు రాజ్యానికి వ్యతిరేకంగా కూడా జరిగే ప్రమాదం ఉన్నది. ఈరోజు పాకిస్తాన్లో చట్టాలపై చరిత్రపై భయం భక్తీ లేక పోవడం, ఒకరంటే ఒకరికి గౌరవాభిమానం లేకపోవడం వల్లనే ఎప్పుడు మిలిటరీ తమ చేతుల్లోకి అధికారాన్ని తీసుకుంటుందో చెప్పడం కష్టమైన పరిస్థితి. అలాంటి దుస్థితి భారతదేశానికి పట్టకూడదు అంటే ప్రతి ఒక్కరూ విలువలకు లోబడే ప్రవర్తించాలి. అలా ప్రవర్తించేలా చేయడం రాజ్యం యొక్క బాధ్యత.

సెల్: 9951300016

వెనిజులా.. 21వ శతాబ్ది సామ్రాజ్యవాద ప్రయోగశాల



సురేంద్ర సింగ్ నెగి

వెనిజులాలో ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగ బద్ధంగా కారకాస్‌లో ఏర్పడిన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు అక్కడ కొద్దిమంది పెద్దమనుషులతో డోనాల్డ్ ట్రంప్ ఎన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాడో ప్రపంచం మొత్తం గమనిస్తోంది. తన లక్ష్యం నెరవేర్చుకోవటం కోసం అమెరికా వెనిజులాకు వ్యతిరేకంగా అమానవీయ చర్యలకు పూనుకుంటోంది. వెనిజులాతో దౌత్య, రాజకీయ సంబంధాలు నెరపకూడదని అంతర్జాతీయంగా తన మిత్రపక్షాలపై వత్తిడి తెస్తోంది. అంతేకాకుండా వెనెజులలో తనకు సహాయపడుతున్న మితవాద శక్తులను వీధుల్లో కొచ్చి నిరసనలు తెలపాల్సిందిగా ప్రోత్సహిస్తున్నది. పెద్ద కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకపక్షంగా అసత్య వార్తలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే కారకాస్‌లో రాజకీయ చిత్రాన్ని మార్చి కొత్త పాలన తీసుకురావాలని జనవరి 23న కుట్ర చేయబోయి విఫలమైంది. ఆ తర్వాత లాటిన్ అమెరికా రాజకీయాలలో మునుపెన్నడూ చూడని అనేక కొత్త పరిణామాలు వెనిజులాలో చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ విషయంలో ఎడతెగని చర్చలూ ఊహాగానాలూ చక్కర్లు కొడుతున్నాయి.


2013, ఏప్రిల్19 నుంచి అధ్యక్షునిగా ఉన్న నికోలస్ మదురోను ఇప్పుడు వికీపీడియా తన వెబ్సైట్‌లో వెనిజులా 46వ తాత్కాలిక అధ్యక్షుని గాను, 2019 జనవరి23న అధ్యక్షునిగా తనకు తానుగా ప్రకటించుకున్న జువాన్ గువాయిడో ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షునిగా చూపిస్తోంది. జాతీయ అసెంబ్లీలో పరిస్థితి అనుకూలంగా లేకపోవడం వల్లను, ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వ్యక్తి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేసే వెసులుబాటు వెనిజులా రాజ్యాంగంలో ఉండటం వల్ల నికోలస్ మదురో జనవరి 10, 2019న సుప్రీంకోర్టులో పదవీ ప్రమాణం చేశారు. మరోవైపు జనవరి 23, 2019న కారకాస్‌లోని బొలివేర్ స్క్వేర్‌లో జువాన్ గువాయిడో తాత్కాలిక అధ్యక్షునిగా ప్రమాణం చేయటం ప్రపంచ దేశాలను, ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలైన దేశాధ్యక్షుడు జీవించి ఉండగా, తన విధులను నిర్వర్తిస్తూ ఉండగా ఏ దేశంలో నైనా మరో వ్యక్తి అధ్యక్షపదవి స్వీకరించడం ఏ విధంగా సాధ్యం? అయితే ఈ సంఘటన ఇప్పటికిప్పుడు హఠాత్తుగా జరిగినట్టు కనిపిస్తున్నా దీనికి బీజం రెండేండ్ల క్రితమే పడిందని వెనిజులాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించిన వారెవరైనా అర్థం చేసుకోగలరు.

2018 మే నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో మదురో తన సమీప అభ్యర్థి హెన్రీ ఫాల్కన్‌ను అత్యధిక మెజార్టీతో ఓడించి రాబోయే ఆరేండ్లకు అధ్యక్ష పదవి చేజిక్కించుకున్నాడు. సర్వత్రా ఆసక్తి కలిగించిన ఈ ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా చూడాలని విచ్చేసిన దేశ, విదేశీ పరిశీలకులు ఎన్నికలు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ ప్రపంచ కార్పొరేట్ మీడియా సంస్థలు మాత్రం తీవ్రంగా విమర్శించాయి.

లాటిన్ అమెరికా, కరేబియన్, కెనడా దేశాలలోని మితవాద ప్రభుత్వాలు ఆగస్టు 2017లో పెరులో సమావేశమై 'లిమా గ్రూప్'గా అవిర్భవించాయి. ఈ గ్రూప్ ప్రధాన ధ్యేయం మదురో ప్రభుత్వాన్ని కూలదోయటమే. జనవరి23 పరిణామాల అనంతరం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా జువాన్ గువాయిడో అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని చట్టబద్ధంగా భావించటమేకాక మద్దతు కూడా పలికింది. అదే సమయంలో వెనిజులాలో ఎటువంటి సైనిక జోక్యానికి తాము అనుకూలంగా లేమని లిమా గ్రూప్ ప్రకటించింది. దీనికి కారణం చాలా స్పష్టం. మిలిటరీ జోక్యం ద్వారా ఆయుధాలు ప్రయోగిస్తే అది మరిన్ని సమస్యలకు దారి తీస్తుందని వారికి తెలుసు. అదే జరిగితే వెనిజులా ప్రజలు దేశాన్ని విడిచిపెట్టి పొరుగు లాటిన్ అమెరికా దేశాలలో తలదాచుకునేందుకు మొగ్గు చూపుతారు. ఇప్పటికే మూడు మిలియన్ల వెనిజులా పౌరులు కాందిశీకులుగా బతుకుతున్నారు. కొలంబియాలో అత్యధికంగా ఒక మిలియన్ ఉండగా అతి తక్కువగా బ్రెజిల్‌లో 85వేల మంది తలదాచుకుంటున్నారు. ప్రస్తుతానికి శరణార్థులకు తాము తాత్కాలికంగా ఆశ్రయం కల్పించినప్పటికి రాబోయే రోజుల్లో ఈ సహకారాన్ని కొనసాగించటానికి ఆర్థిక సహాయం అవసరమని అన్ని లాటిన్ అమెరికా దేశాలు అంతర్జాతీయ సమాజానికి తెలియచేసాయి. రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక పరిస్థితి సాకుతో మదురో ప్రభుత్వంపై నిరంతరం దాడికి దిగుతున్న లిమా గ్రూప్ అమెరికా మిలిటరీ జోక్యాన్ని అంగీకరించడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఈ అంశం ట్రంప్ ప్రభుత్వాన్ని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

ప్రభుత్వ పునాదులైన లక్షలాది చాలిస్టాలు (విప్లవకారులు) మదురోకి అండగా ఉన్నారు. వారి మద్దతు ఉన్నంత కాలం అక్కడ అమెరికా పప్పులు ఉడకవు. రాబోయే రోజుల్లో అధికార మార్పిడి జరిగినా జరక్కపోయినా అమెరికా దాని కారకాస్ మితవాద మిత్రులు తెలుసుకోవలసింది ఒక్కటే - వెనిజులాలో పరిస్థితులను చక్కదిద్దటానికి చర్చలు తప్ప మరో మార్గం లేదు. ఈ విషయం వారు ఎంత త్వరగా తెలుసుకుంటే అందరికీ అంత మంచిది.

వెనిజులా, ఇతర లాటిన్ అమెరికా దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అస్థిరత సష్టించటం ద్వారా తమ సొంతగడ్డపై తోసుకొస్తున్న తీవ్ర సమస్యలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. వెనిజులాలో ఏర్పడిన రాజకీయ ఆర్థిక సంక్షోభాన్ని భూతద్దంలో చూపించి లాటిన్ అమెరికా దేశాలపై తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు.



వాతావరణ మార్పులు, వలసలు, చైనా, రష్యా మొదలైన దేశాలలో దౌత్య చొరబాటు తదితర అంశాలలో ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే వైఫల్యం చెందింది. ఇప్పుడు వెనిజులా అంశంలో పొరుగు దేశాల చేతులు కట్టెయ్యాలని చూస్తోంది. గువాయిడోను తాత్కాలిక అధ్యక్షునిగా గుర్తించడానికి భారత్ నిరాకరించింది. "తమ దేశంలో నెలకొన్న పరిణామాలకు వెనిజులా ప్రజలే హింసలేకుండా చర్చల ద్వారా ఒక రాజకీయ పరిష్కారం కనుక్కోవాలి" అని ప్రకటించింది.

అటు వెనిజులా స్వయం ప్రకటిత తాత్కాలిక అధ్యక్షుడు జువాన్ గువాయిడో నాయకత్వంలోని ప్రతిపక్ష పార్టీలు కానీ, అమెరికా పాలకులతో చేతులు కలిపిన లిమా గ్రూప్ కానీ లేదా మదురో పరిపాలనపై దాడి చేస్తున్న ఇతర పశ్చిమ దేశాలు కానీ అక్కడ చోటుచేసుకున్న ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ఎటువంటి ప్రణాళికా ఇప్పటివరకూ చర్చించక పోవడం ఆశ్చర్య పరుస్తోంది. దీన్నిబట్టి వారి ముఖ్య ఉద్దేశ్యం వెనిజులాలో చమురు గనులను అమెరికా కైవసం చేసి తద్వారా తమ వ్యాపారాలకు మార్గం సుగమం చేసుకోవటమే తప్ప అక్కడ ఆర్థిక సంక్షోభం నివారించడం కాదనేది స్పష్టమవుతోంది.

వెనిజులా భవిష్యత్ కార్యాచరణను రెండు ముఖ్య అంశాలు ప్రభావితం చేయటానికి అవకాశం ఉంది. ఒకటి, జనవరి23న గువాయిడో తాత్కాలిక అధ్యక్షునిగా ప్రమాణం చేసిన తర్వాత రక్షణ మంత్రి వ్లాదిమిర్ పోద్రిన్ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి మదురో ప్రభుత్వానికి దేశ సాయుధ దళాలన్నీ సంపూర్ణ మద్దతును, విశ్వసనీయతను ప్రకటిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంలో త్రివిధ దళాల నాయకులు అతని వెంటే ఉన్నారు.

మదురో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని గద్దె దించటానికి సైన్యం సహకారం కోసం పదే పదే ప్రయత్నాలు చేస్తున్న దేశీయ మితవాద శక్తులు, విదేశీ అమెరికా పాలకులకు ఈ ప్రకటన చెంపపెట్టు లాంటిది. వారి ప్రయత్నాలు బెడిసికొట్టటంతో ఇప్పుడు మరో మార్గం ఎంచుకున్నారు. రాబోయే రోజుల్లో సైనిక దళాలు మదురో ప్రభుత్వంపై తమ విశ్వాసాన్ని విడనాడి అతనికి వ్యతిరేకంగా ఉద్యమించే విధంగా వారికి శాంతియుతంగా నచ్చచెప్పాలని గువాయిడో పౌరులను వేడుకుంటున్నాడు. ఈ లక్ష్యాన్ని అందుకోవడానికి తమ నుంచి అన్ని రకాల సహాయసహకారాలు ఉంటాయని అమెరికా తన ఆసక్తి వెల్లడించింది. సైనిక శక్తులు తమ మద్దతు ఉపసంహరించుకుంటే కనుక మదురో ప్రభుత్వం ఎంతోకాలం మనుగడ సాగించలేదన్న సంగతి వీరికి బాగా తెలుసు. కానీ 21వ శతాబ్ద ప్రారంభంలో హ్యూగో చావేజ్ తన దేశ సాయుధ దళాల సామాజిక రాజకీయ అభివృద్ధికి తీసుకున్న చర్యలు వారిని దేశ రక్షణ పట్ల దృఢచిత్తులుగా ఉండేట్టు చేశాయి. అందువల్లనే వెనిజులాలో సైనిక కుట్రను ఊహించటం కూడా కష్టమే. లాటిన్ అమెరికా దేశాలపై తన దాష్టీకం చెలాయించటానికి తరచూ సైనిక కుట్రకు ఉసిగొల్పటం అమెరికాకు ఒక అలవాటుగా మారింది.


మరోపక్క అమెరికా ప్రభుత్వంతో తాము అన్ని దౌత్య, రాజకీయ సంబంధాలను తెగదెంపులు చేసుకున్నట్టు, వాషింగ్టన్‌లోని వెనిజులా విదేశీ దౌత్య కార్యాలయాన్ని మూసివేస్తున్నట్టు మదురో ప్రకటించాడు. అంతేకాకుండా కారకాస్‌లోని అమెరికా దౌత్యవేత్త, అతని ఉద్యోగులు దేశం 72గంటల్లో విడిచివెళ్లాలని ఆదేశించాడు.

అయితే అమెరికా తాము మదురోను వెనిజులా అధ్యక్షునిగా ఇంకెంతమాత్రం గుర్తించట్లేదని అందువల్ల కారకాస్‌లో తమ దౌత్య కార్యాలయాన్ని మూసివేసేది లేదని బుకాయించింది. మదురోను రెచ్చగొట్టి అతను తొందరపాటు చర్యలకు దిగేలా చెయ్యాలని తద్వారా తాము లాభపడవచ్చునేది ట్రంప్ మరో కుట్ర. ఈ పరిస్థితుల్లో మదురో ఎలా స్పందిస్తారనే దాన్నిబట్టి ఇరుపక్షాల భవిష్యత్ కార్యచరణ ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదొయ్యటానికి అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న వివిధ రకాల ప్రయోగాలకు వెనిజులా ఒక ప్రయోగశాలగా చేసుకుంది. కానీ ప్రభుత్వ పునాదులైన లక్షలాది చాలిస్టాలు (విప్లవకారులు) మదురోకి అండగా ఉన్నారు. వారి మద్దతు ఉన్నంత కాలం అక్కడ అమెరికా పప్పులు ఉడకవు. రాబోయే రోజుల్లో అధికార మార్పిడి జరిగినా జరక్కపోయినా అమెరికా దాని కారకాస్ మితవాద మిత్రులు తెలుసుకోవలసింది ఒక్కటే - వెనిజులాలో పరిస్థితులను చక్కదిద్దటానికి చర్చలు తప్ప మరో మార్గం లేదు. ఈ విషయం వారు ఎంత త్వరగా తెలుసుకుంటే అందరికీ అంత మంచిది.

అనువాదం: పద్మశ్రీ

సెల్: 9490098687

మానవి
నవతెలంగాణ



సౌమ్య, సంపత్ జీవితం ఇప్పుడు సమస్యల్లో పడింది. ఏడేండ్లు కాపురం తర్వాత వారి జీవితాలు ఎటు పోతున్నాయో తెలియని అయోమయం పరిస్థితి. ఊరిలో ఉండే పెద్దవాళ్ల గురించి ఆలోచించాలా? పట్టణంలో చదువుకుంటున్న పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలా? అన్న సందిగ్ధ పరిస్థితి. ఇలాంటి సమయంలో సౌమ్య తన తల్లిదండ్రులను తీసుకుని ఐద్వా అదాలత్‌కు వచ్చింది..

పాచిక పారలేదు..

సౌమ్య డిగ్రీవరకు చదువుకుంది. ఆమె చిన్నప్పుడే తల్లిదండ్రులు పట్టణానికి రావడంతో పట్టణవాతావరణంలోనే పెరిగింది. డిగ్రీ తర్వాత బంధువుల్లో సంబంధాలు వెతకడం ప్రారంభించారు. తమ బంధువుల్లోనే సౌమ్యకు సరిపోయే వ్యక్తిని వెతికారు. సంపత్ డిగ్రీవరకు చదివాడు. ప్రైవేటు ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు. ఊర్లో సొంత ఇల్లు, ఐదెకరాల పొలం ఉంది. ఒక్కడే కొడుకు. ముగ్గురు ఆడపిల్లలు. సంపత్ కుటుంబం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడింది. అతను మాత్రం పట్టణంలోనే ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. అతని జీతం నుంచి నెలనెల కొంతమొత్తం ఇంటికి పంపించేవాడు. బాధ్యతలు తెలిసిన వాడు..ఇంతో అంతో ఆస్తులు ఉన్నాయి. సంబంధం కుదిరింది. ఇద్దరు పిల్లలు పుట్టేవరకు వారి సంసారం సాఫీగానే సాగింది. సంపత్ సంపాదనతో ఇంటి అవసరాలు తీరకపోవడంతో సౌమ్య కూడా ఉద్యోగంలో చేరింది. టీచర్‌గా మంచి పేరు తెచ్చుకున్న ఆమెకు మంచి జీతమే వస్తుంది. ఆర్థిక సమస్యలు తీరాయి అనుకుంటున్న సమయంలో మరో పెద్ద సమస్య వచ్చింది. సంపత్ ఉద్యోగం మానేసాడు. నెలలో రెండుసార్లు ఊరికి వెళ్లేడం ... అక్కడే వారం పదిరోజుల వరకు ఉండేవాడు. పిల్లలతో, ఉద్యోగంతో సౌమ్య ఇబ్బంది పడుతున్నా పట్టించుకునేవాడు కాదు. నాలుగైదుసార్లు ఫోన్ చేస్తే వచ్చేవాడు. రెండు మూడు రోజులుండి మళ్లీ వెళ్లేవాడు. ఒక్కోసారి నెలలతరబడి అక్కడే ఉండేవాడు. ఈ సారి మూడునెలలైనా రాలేదు. సౌమ్య ఫోన్ చేస్తే.. నీవు పిల్లలను తీసుకుని ఇక్కడికే రా అంటున్నాడు. ఉద్యోగం, పిల్లల చదువు వదిలేసి ఆ ఊరికి వెళ్ళి ఎలా బతకాలి అన్నది సౌమ్య ప్రశ్న. ఎటూ తెల్చుకోలేక తన తల్లిదండ్రులను తీసుకుని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

తన సమస్యనంతా కాగితంపై రాసిచ్చిన తర్వాత బాధ్యులతో ఆమె తన బాధ వివరిస్తూ..'మేడమ్ చిన్నప్పటి నుంచి నేను ఇక్కడే పెరిగాను. ఇప్పుడు ఉద్యోగం, పిల్లల చదువు అన్నీ ఇక్కడే. ఆయనకు సరైన ఉద్యోగం లేదు. పెండ్లి సమయంలో మంచి జాబ్ చేస్తున్నాడు అని చెప్పాడు. ఇంట్లోకి సరిగ్గా జీతం ఇచ్చేవాడు కాదు. పిల్లలను పస్తులు పెట్టలేక నేను ఉద్యోగంలో చేరాను. నేను జాబ్ చేస్తే తన జీతానికి సపోర్ట్‌గా ఉంటుంది అనుకు న్నాను. కానీ, ఆయన నేను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకే జాబ్ మానేసాడు. ఏమైనా అంటే మా అమ్మనాన్నను చూసుకోవద్దా? అంటాడు. వాళ్లను చూడవద్దు అని నేను చెప్పడం లేదు. ఇప్పుడు మా అత్తమామ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. మా మామ పొలం పనులు కూడా చేస్తున్నాడు. అక్కడ ఉన్నది ఐదుఎకరాల పొలం. దానిపై వచ్చే ఆదాయం అంతంతమాత్రమే. పిల్లలకు సరైన బడులు లేవు. ఇప్పుడు మేం వెళ్ళి అక్కడ ఎలా ఉండాలి? ఆయనను పిలిపించి ఎలాగైనా ఇక్కడే ఉండేలా కౌన్సెలింగ్ ఇవ్వండి ' అంది.

> **సంపత్‌కు ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి తల్లిదండ్రుల మీద ప్రేమ ఉన్నట్లు భార్య దగ్గర, భార్యబిడ్డలపై ప్రేమ ఉన్నట్టు తల్లిదండ్రుల వద్ద నటిస్తున్నాడు. కష్టపడకుండా జీవితం గడిచిపోతే చాలు అనుకుంటున్నాడన్న విషయం స్పష్టమైంది.**

సౌమ్య ఇచ్చిన అడ్రసుకు ఐద్వా ఆఫీస్ నుంచి లెటర్ పంపారు. రెండు వారాల తర్వాత ఆ లేఖను తీసుకుని సంపత్ వచ్చాడు. సౌమ్య చెప్పిన విషయాలు అతనికి చెప్పారు బాధ్యులు. అంతా విన్న తర్వాత అతను..' మేడమ్ నేను మా అమ్మనాన్నలకు ఒకడినే. ముగ్గురు ఆడపిల్లల పెండ్లిల్లు చేశాం. ఇప్పుడు మా అమ్మనాన్న పెద్దవాళ్ళు అయ్యారు. వారిని చూసుకోవల్సిన బాధ్యత నాదే కదా! నేను ఊరికి వెళ్ళి వారికి సహాయంగా ఉంటున్నాను. ఇది తప్పు అన్నట్టు సౌమ్య నా మీద కోపం పెంచుకుంది. పిల్లలను నా దగ్గరకు రానివ్వడం లేదు. ఊరిలో సొంతిల్లు, పొలం ఉంది పిల్లలను తీసుకుని రమ్మంటే రానంటుంది. ఇది ఎంత వరకు కరెక్ట్ మీరే చెప్పండి' అన్నాడు.

ఐద్వా అదాలత్

'మీ ఊరిలో బడి లేదు. మరి పిల్లల చదువులు ఎలా? అన్న ప్రశ్నకు.. 'ఆమె వస్తే మా ఊరికి దగ్గరలోనే ఉన్న టౌన్‌లో ఇల్లు తీసుకుంటాను. పిల్లలను అక్కడ స్కూల్‌లో చేర్చుతాను. సౌమ్యకూడా ఉద్యోగం చేసుకోవచ్చు' అన్నాడు. టౌన్‌లో కాపురం పెడితే ఇంటి కిరాయి, ఇతర ఖర్చులు ఎలా? నీవు ఏదైనా ఉద్యోగం చేస్తున్నావా? అని అడిగారు బాధ్యులు. నాకు ఉద్యోగం ఎందుకు మేడమ్. మాకు పొలం ఉంది. సౌమ్యకు వచ్చే జీతం కిరాయి, ఇంటిఖర్చులకు సరి పోతుంది. అన్నాడు. సరే వచ్చేవారం సౌమ్య కూడా వస్తుంది. మీరు కూడా మీ తల్లిదండ్రు లతో రండి అని చెప్పారు బాధ్యులు.

మరో రెండు వారాల తర్వాత సంపత్ తల్లిదండ్రులు కూడా వచ్చారు. ముందుగా వారితో మాట్లా డారు బాధ్యులు. 'మేడమ్. మాకు ఎలాంటి సమస్యలు లేవు. ఉన్న రెండు గదుల ఇంట్లో సర్దుకుని బతుకుతున్నాం. మా పొలంలో పండే కూరగాయలు అమ్మితే వచ్చే డబ్బులు మా జీవనానికి సరిపోతున్నాయి. కొన్ని రోజులు డబ్బులు పంపాడు మా కొడుకు. ఆతర్వాత నాకే సరిపోతలేవు అంటూ మమ్మల్ని అడిగేవాడు. గత ఏడాది నుంచి ప్రతినెల వచ్చి డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నాడు. ఇప్పుడు పెళ్లాం పిల్లలను వదిలేసి ఇక్కడే వచ్చి ఉంటున్నాడు. ఏమైనా అడిగితే పొలం అమ్మి నా వాటా ఇవ్వండి అంటూ గొడవ చేస్తున్నాడు. మా కోడలు మంచిది. ఎంతో కష్టపడి ఉద్యోగం చేస్తూ పిల్లలను చూసు కుంటుంది. దయచేసి వాడిని పట్టణం లోనే ఏదైనా ఉద్యోగం చేసుకుంటూ పెండ్లాం పిల్లలను చూసుకునేలా చేయండి. మేం చెప్పితే వినడం లేదు. మాపైనే గొడవకు వస్తున్నాడు' అంటూ కనీళ్లు పెట్టుకున్నారు. దాంతో అసలు సమస్య బాధ్యులకు ఏంటో విషయం అర్థమైంది.

సౌమ్య చెప్పిన విషయాలను, సంపత్ తల్లిదండ్రులు చెప్పిన విషయాలను పరిశీలిస్తే.. సంపత్‌కు ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. బాధ్యతల నుంచి తప్పించు కోవడానికి తల్లిదండ్రుల మీద ప్రేమ ఉన్నట్లు భార్య దగ్గర, భార్యబిడ్డలపై ప్రేమ ఉన్నట్టు తల్లిదండ్రుల వద్ద నటిస్తున్నాడు. కష్టపడకుండా జీవితం గడిచిపోతే చాలు అనుకుంటున్నాడన్న విషయం స్పష్టమైంది.

'సంపత్.. నీవు చాలా బాధ్యత గల వ్యక్తిగా తల్లిదండ్రులను చూసుకుంటు న్నాని చెబుతున్నావు. చాలా మంచిది. మరి భర్తగా, తండ్రిగా కూడా నీభార్యపిల్లల గురించి పట్టించుకోవాలి కదా! మీ తల్లిదండ్రులిద్దరు చాలా ఆరోగ్యంగా ఉన్నారు. వారికి మీ అవసరం ఇప్పుడే లేదు. నీవు ముందుగా ఉద్యోగంలో చేరు. రెండుమూడు నెలలకు ఒకసారి అందరూ కలిసి మీ అమ్మనాన్న దగ్గరకు వెళ్ళిరండి. వారికి చేతకాని రోజు మీ దగ్గరకు తెచ్చుకోండి. బాధ్యతగా వారిని చూసు కోండి'. అని చెప్పారు. సంపత్‌కు విషయం అర్థమైంది. తల్లిదండ్రులు వాస్తవాలు చెప్పారని.. ఇన్ని రోజులు తాను బాధ్యతల నుంచి తప్పించుకున్నా.. ఇకపై తప్పించు కోవడం సాధ్యం కాదని తెలుసు కున్నాడు. సరే మేడమ్ మీరు చెప్పినట్లే ఇక్కడే ఉండి ఉద్యోగం చూసుకుంటా అన్నాడు. నీ మాట మీద మాకు నమ్మకం లేదు. కాగితం పై రాసి సంతకం పెట్టివ్వు. నెలకు ఒకసారి వచ్చి ఏం ఉద్యోగం చేస్తున్నావు? సౌమ్యపిల్లలు, మీ అమ్మనాన్న ఎలా ఉన్నారు అన్న విషయాలు మాకు వచ్చి చెప్పాలి అన్నారు. ఇక తన ఆటలు సాగవని తెలుసుకున్న సంపత్ భార్యబిడ్డలను తీసుకుని ఇంటిదారి పట్టాడు. ఒకే సమయంలో అటు భార్యపిల్లల సమస్య, తల్లిదండ్రుల సమస్య తీరడంతో వారంతా సంతోషంగా బాధ్యులకు కృతజ్ఞతలు చెప్పి అక్కడి నుంచి వెనుదిరిగారు. .

యశోద

సిగ సింగారం



రకరకాల అకేషన్స్, అన్నింటికీ ఒకే హెయిర్‌స్టయిల్ అంటే ఎవ్వరికైనా బోర్ వస్తుంది. మరి బోర్ కొట్టకుండా ఏం చేయాలి? కొత్త రకాలు ప్రయత్నించాలి. అది కూడా సులభంగా వేసుకోగలగాలి. అలాంటి సింపుల్ ట్విస్ట్ ఇది. చిన్న రబ్బర్ బ్యాండ్‌తో పోనీ వేసి... లోపలకు ట్విస్ట్ చేస్తే చాలు..!

నొప్పి నివారిణిగా వెల్లుల్లి



మన వంటింట్లో ఉండే వెల్లుల్లి చక్కని ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఒకే వ్యాధికి కాకుండా రకరకాల సమస్యలకు చెక్ పెడుతుంది. అందుకే వెల్లుల్లిని పెద్దలు వంటల్లో చేర్చారు.

- జలుబు ఎక్కువగా ఉన్నపుడు ఇది మంచి ఔషధంగా ఉపయోగపడుతుంది. దీంతో పాటు ముక్కు, గొంతు సంబంధ సమస్యలకి వెల్లుల్లి చెక్ పెడుతుంది.
- బ్రిటీష్ శాస్త్రవేత్తలు వెల్లుల్లిపై అధ్యయనం చేశారు. 146 మంది ఆరోగ్యవంతుల్ని 12 నెలల పాటు పరీక్షించారు. ప్రతీ రోజూ వెల్లుల్లిని తీసుకునే వారికి జలుబు తొందరగా రాదని గుర్తించారు.
- వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్స్, విటమిన్-సి, మిటమిన్ బి6, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. ఇది సైనస్‌తో కూడా పోరాటం చేస్తుంది.
- బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లని, వైరల్ సమస్యలను ఎదుర్కోవటంలో వెల్లుల్లి ముందుంటుంది.
- వెల్లుల్లి క్యాన్సర్ రాకుండా చేస్తుంది.
- ప్రతి రోజూ రాత్రి పూట రోస్ట్ చేసిన రెండు లేదా మూడు వెల్లుల్లి రెబ్బలను తినాలి. దీని వల్ల ఆస్తమా దరికి రాదు. వెల్లుల్లితో కాచిన పాలను ఉదయం, రాత్రిపూట తీసుకుంటే జలుబు, దగ్గు, వాతం వంటి వ్యాధులన్నీ నయమవుతాయి. డయేరియాకు చక్కటి మందు వెల్లుల్లి రసం. దీంతో పాటు వెల్లుల్లి కంటిసంబంధ వ్యాధులు రాకుండా కూడా కాపాడుతుంది.
- గార్లిక్ నొప్పి నివారిణి కూడా. గాయాలు మాన్పించే యాంటీ సెప్టిక్‌గా కూడా పని చేస్తుంది.
- అలాగే వెల్లుల్లిని మనం తీసుకునే ఆహారంతో కలిపి తీసుకుంటే శరీరంలో ఉండే వ్యర్థ పదార్థాలు తొలగిపోతాయి. ఇంకా రక్తకణాలను వెల్లుల్లి శుభ్రపరచి, అనవసరమైన కొవ్వును కరిగిస్తుంది. తద్వారా శరీరంలో రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో మన శరీరానికి తగిన ఆక్సిజన్ లభించడంతో ఒత్తిడి మాయమవడంతో పాటు నరాల పనితీరు, శ్వాసక్రియ క్రమమవుతుంది. ❄

ఇట్లచేద్దాం

బట్టలు ఉతుకుతున్నప్పుడు బట్టలసబ్బులో ఉండే రసాయన పదార్థాలు మీ చేతులకు హాని చేసే ప్రమాదం ఉంది. కాబట్టి బట్టలుతికిన వేంటనే నిమ్మరసాన్ని చేతికి రాసుకుని కాసేపాగాక కడుక్కోవాలి.



రుచికే కాదు.. ఆరోగ్యానికీ..

మామూలు వంటకాలను సైతం తన ఘుమఘుమలతో మరింత రుచిగా మార్చే పుదీనాను రోమన్లు, గ్రీకులు మొదటిసారిగా గుర్తించి, దాని వాడకాన్ని వెలుగులోకి తెచ్చారు. దీని ఆకులు తింటే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని వారి నమ్మకం. ఏథెన్స్ నగరానికి చెందిన ప్రజలు తమ శరీరం నుంచి వస్తున్న చెమట వాసనను తొలగించుకునేందుకు పుదీనా రసాన్ని స్ప్రేగా ఉపయోగించేవారట. పుదీనా ఆకులు శరీరంలోని వివిధ రోగకారక క్రిములను నాశనం చేసే యాంటీ బయాటిక్స్‌లా పనిచేస్తాయని పలు పరిశోధనలు తేల్చాయి. దీని నుండి తీసే మెంథాల్‌ను తల, గొంతు, నొప్పి నివారణకు వాడుతున్నారు. పుదీనా ఆకులు కలిపిన నీటిని పుక్కిలించి ఉమ్మితే నోటి దుర్వాసన దూరమవుతుంది. వీటి ఆకులు నమిలితే చిగుళ్ల గట్టిపడడమే కాకుండా, చిగుళ్లకు సంబందించిన వ్యాధులూ తగ్గుముఖం పడతాయి కూడా. ఎండాకాలంలో మజ్జిగలో పుదీనా ఆకులు వేసుకుని తాగితే ఎండదెబ్బ తగలకుండా ఉంటుంది. బిర్యానీలో పుదీనా ఆకులను వేసేది రుచికి, సువాసనకే కాదు.. అజీర్తిని, విషాలను తొలగించడానికికూడా! ❄



సహజమైన చిట్కాలు

రెండు స్ట్రాబెర్రీ పండ్లను వేసి మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. అందులో ఒక టీ స్పూన్ కార్న్ ఫ్లోర్ వేసి బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమంతో ముఖంపై ప్యాక్‌వేసుకుని 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. స్ట్రాబెర్రీలు స్కిన్ ఇన్‌ఫెక్షన్స్‌ను నివారిస్తాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండు సార్లు వేసుకుంటే ముఖం ఎప్పుడూ నిగనిగలాడుతుంది.

- డార్క్‌లిప్స్‌తో బాధపడేవారికి ఇది సులువైన చిట్కా. మార్కెట్‌లో దొరికే లిప్ బామ్స్ కంటే ఇంట్లోనే దాన్ని తయారుచేసుకోండి. తయారీకి గ్లిజరిన్, బీట్‌రూట్ పౌడర్, పెట్రోలియం జెల్లీ చాలు. ఒక చిన్న గిన్నెలో పెట్రోలియం జెల్లీని వేసి వేడి చేయాలి. అది ద్రవంగా మారగానే, అందులో టీస్పూన్ గ్లిజరిన్, అర టీ స్పూన్ డ్రై బీట్‌రూట్ పౌడర్ వేసి కలపాలి. చల్లారాక దాన్ని ఒక చిన్న బాటిల్‌లో తీసుకొని రోజూ అప్లై చేసుకుంటే పింక్ లిప్స్ మీ సొంతం.
- కొందరి జుట్టు నల్లగా కాకుండా రాగి రంగులో కనిపిస్తుంది. అలాంటి వారు పావుకప్పు కొబ్బరి నూనెలో మూడు స్పూన్ల మ ందార రేకుల పొడిని వేసి మరిగించాలి. ఆ వేడి చల్లారకముందే అందులో ఒక టేబుల్ స్పూన్ ఆముదం కలపాలి. గోరువెచ్చని ఆ నూనెను రాత్రి నిద్రపోయేముందు తలకు పట్టించాలి. ఉదయం లేచిన వెంటనే హెర్బల్ షాంపూతో తలస్నానం చేయాలి. వారానికి మూడు సార్లైనా ఇలా చేస్తే జుట్టు నల్లగా మారుతుంది. ❄



మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ nava-maanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా

**మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1,
1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి.**

ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.

ప్యూమిస్ స్టోన్‌తో కాంతి..

సాధారణంగా ప్యూమిస్ స్టోన్‌ను పాదాల స్క్రబింగ్‌కు మాత్రమే ఉపయోగిస్తూ ఉంటాం. ఇది చర్మపు మృత కణాల్ని తొలగించటంతోపాటు అవాం అవాంఛిత రోమాల్ని కూడా తొలగించగలదు.

- స్కిన్ టోన్ పెరగాలంటే ప్రతిరోజూ ప్యూమిస్ స్టోన్‌తో శరీరానికి సున్నితంగా మసాజ్ చేయాలి. ఇలా చేస్తే రక్త ప్రసరణ బాగా జరిగి చర్మం మెరుస్తూ ఉంటుంది. ఇందుకోసం స్నానం చేసేటప్పుడు సబ్బు రుద్దుకున్న తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో శరీరమంతా వృత్తాకారంలో మసాజ్ చేయాలి.



- పొడి చర్మం కలిగినవారు సబ్బు నీళ్లలో నానబెట్టిన ప్యూమిస్ స్టోన్‌తో ఒళ్లు రుద్దుకుంటూ ఉండాలి. ముందుగా ఆయిల్ మసాజ్ చేసుకుని ఆ తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో రుద్దుకుంటూ ఉంటే మృత కణాలు తొలిగి పొడి చర్మం తేమగా తయారవుతుంది.
- ముఖంపైన అవాంఛిత రోమాలను తొలగించటం కోసం కూడా ప్యూమిస్ స్టోన్‌ను ఉపయోగించొచ్చు. ఇందుకోసం ఫేస్ ప్యాక్ వేసుకున్న తర్వాత దాన్ని తొలగించటం కోసం ప్యూమిస్ స్టోన్ వాడాలి. అయితే ఆరిపోయిన ఫేస్‌ప్యాక్‌ను కొద్ది నీళ్లతో తడిపి మెత్తబడిన తర్వాతే ప్యూమిస్ స్టోన్‌తో రుద్దాలి. ❄

ఆదివాసీ జీవనశైలి ప్రతిబింబించేలా ఫోటో ప్రదర్శన

- వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బీఎస్ రాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా విభిన్న కళారూపాల సమాహారంగా నిర్వహించబోయే జాతీయ ఫోటో(గ్రఫీ ప్రదర్శన ఉండాలని బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు అన్నారు. శుక్రవారం బీసీ కమిషన్ కార్యాలయంలో ఆయన ఫోటో ప్రదర్శన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్ రాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని కళలు, సంప్రదాయాలు, సంస్కృతి, శిల్పకళానైపుణ్యం, ప్రకృతి సన్నాహాలు చేయడం హర్షణీయమన్నారు. జాతీయ ఫోటో ప్రదర్శనను ఏప్రిల్ 5నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శి సిద్దార్థ తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనడానికి ఆరువేలకు పై ఫోటో(గ్రఫీ నిపుణుల నుంచి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

కేసీఆర్ కిట్లను వెంటనే అందజేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ప్రసూతి అయిన మహిళలకు వెంటనే కేసీఆర్ కిట్లను అందజేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మూడు, నాలుగు నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఆస్పత్రుల్లో ఇవ్వకపోవడంతో లబ్దిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల రేటు 52 శాతం నుంచి 42 శాతానికి పడిపోయిందని తెలిపారు. కేసీఆర్ కిట్ల కోసం చంటి పిల్లలను తీసుకుని తల్లులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. కేసీఆర్ కిట్లను వెంటనే పంపిణీ చేయకపోతే లబ్దిదారులను సమీకరించి ఆందోళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎక్స్‌ప్లోరేషన్ కాంట్రాక్టు కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనం

- ఎస్‌సికెయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణిలోని ఎక్స్‌ప్లోరేషన్ విభాగం(అన్వేషణ)లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం ఒప్పుకున్నదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(ఎస్‌సికెయస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తెలిపారు. హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పి.లక్ష్మణ్ సమక్షంలో శుక్రవారం దీనిపై ఒప్పందం జరిగినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఒప్పందం ఫలితంగా కాంట్రాక్టు కార్మికునికి రోజుకు రూ.64 చొప్పున నెలకు రూ.1664 వేతనం పెరుగుతుందని తెలిపారు. ఈ చర్చల్లో సింగరేణి యాజమాన్యం తరపున జనరల్ మేనేజర్ పర్సనల్ ఎ.ఆనందరావు, ఎక్స్‌ప్లోరేషన్ జిఎం శర్మ, కార్మికుల తరపున ఎస్‌సికెయస్ నుంచి బి.మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రగాని కృష్ణయ్య, కమిటీ సభ్యులు కిషోర్ పాల్గొన్నారని పేర్కొన్నారు.

ప్రాథమిక విద్యను పటిష్టం చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి

నవతెలంగాణ- లింగాలఘనపురం

ప్రాథమిక విద్య పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల, లింగాలఘనపురం ఉన్నతపాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగం సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక అవసరం ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్య ధోరణితో విద్యారంగం నీరుగారిపోతోందనీ, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపార పరంగా భావిస్తున్నాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసారావు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, లింగాలఘనపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర్‌రావు, గణేస్, బి ప్రవీణ్, ఇంద్రసేనారెడ్డి, ఉప్పలయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను తొలగించే బడ్జెట్ : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజల ఆర్థిక అసమానతలను తొలగించేలా ఉన్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. లక్ష్మణ్ అన్నారు. దేశాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం పది సూత్రాలను అమలు చేస్తూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదాయపన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం గొప్ప నిర్ణయమన్నారు. ఐదెకరాలలోపు రైతులకు రూ.6 వేల సహాయం అందించడం అభినందనీయమన్నారు. 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యంలో రైతులకు అనేక పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టారని తెలిపారు. అసంఘటిత కార్మికులకు ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ కింద నెలకు రూ.3 వేల ఫించన్ ఇవ్వడాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు గోలి మధుసూదన్ రెడ్డి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఇదే చివరి బడ్జెట్

- టీటీడీపీ నేత రావుల విసుర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విసుర్లు విసిరారు. రాష్ట్రాల హక్కులు హరించేలా కేంద్ర బడ్జెట్ ఉందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. దిగిపోయే ముందు కూడా తెలుగు రాష్ట్రాలను కరుణించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ బడ్జెట్ ఉందన్నారు. నోట్ల రద్దు వల్ల ఏం జరిగిందో ఆర్థిక మంత్రి చెప్పలేదన్నారు. నోట్ల రద్దుతో దేశ ప్రజల మనసులను గాయపరిచారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణ చేయలేకపోయారని వ్యాఖ్యానించారు నదుల అనుసంధానం, పెరిగిన ఎరువుల ధరలపై ప్రస్తావన లేదని చెప్పారు. నదుల అనుసంధానం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు లేవన్నారు. జగన్, కేసీఆర్‌ల వెనుక బీజేపీ ఉందని రావుల చెప్పుకొచ్చారు.

ఆరోగ్య కిట్లకు బాలారిష్టాలు!

రెండో త్రైమాసికంలో 51 శాతం పంపిణీ

- అమ్మాయి గోస పట్టని టీఆర్‌ఎస్ సర్కారు
- ధనిక రాష్ట్రంలోనూ నిధుల కొరత
- సకాలంలో విడుదల చేయకుండా తాత్సారం
- రూ.85 కోట్లలో రూ.15 కోట్లే విడుదల





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గులాబీ సర్కారు చేపట్టిన ఆడపిల్లల ఆరోగ్య కిట్ల పంపిణీ పథకం కాస్త బాలారిష్టాలను ఎదుర్కొంటున్నది. ఆర్భాటంగా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఆర్థిక వనరులను సమకూర్చడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఏరు దాటే వరకు ఓడ మల్లయ్య, ఏరు దాటిన తర్వాత బోడ మల్లయ్య అన్నట్టుగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఎన్నికల వరకు ఒకమాట, ఎన్నికలు పూర్తయ్యాక మరోమాట అన్న చందంగా తయారైంది. ధనిక రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే అమ్మాయిల సమస్యలు తీర్చేందుకు నిధుల్లేని పరిస్థితి దాపురించింది. దీంతో వారికి ఇచ్చే ఆరోగ్య కిట్ల (హెల్త్ అండ్ హైజీన్ కిట్లు) పంపిణీపై తీవ్ర ప్రభావం పడింది. నిధుల కొరత కారణంగా రెండో త్రైమాసికం ఆరోగ్య కిట్ల పంపిణీ నత్తనడకన సాగుతున్నది. దాదాపు 5,90,980 మంది విద్యార్థినిలకు ఆరోగ్య కిట్లు పంపిణీ చేయాలి. ఇప్పటి వరకు 3,06525 (51.87 శాతం) మంది విద్యార్థినిలకు మాత్రమే పంపిణీ పూర్తయింది. ఇంకా 2,84,455 (48.13 శాతం) మంది విద్యార్థినిలకు ఆరోగ్య కిట్లు అందాల్సి ఉంది. ఇందులో ఉమ్మడి పది జిల్లాలకుగాను ఐదు జిల్లాల్లోనే ఆరోగ్య కిట్ల పంపిణీ పూర్తయ్యింది. ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని అమ్మాయిలకు ఆరోగ్య కిట్లు అందాయి. హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో ఒక్కరికీ ఇవ్వలేదు. అంటే అమ్మాయిల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తు పట్ల టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉన్నదో ఈ గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. ఎన్నికలకు ముందు ఎంతో ఆర్భాటంగా ఈ పథకం గురించి పాలకులు ప్రచారం చేశారు. దేశంలోనే ఎక్కడా ఇలాంటి పథకం అమ్మాయిల కోసం లేదని ప్రకటించారు. కానీ ముందస్తు అసెంబ్లీ ఎన్నికల పేరుతో నవంబర్, డిసెంబర్‌లో నిధుల విడుదలను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆరోగ్య కిట్ల పంపిణీకి నిధుల కొరత ఏర్పడింది. రెండో సారి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడినా నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నది. ప్రభుత్వ అలసత్వం కారణంగా విద్యార్థినిలు మనోవేదన చెందుతున్నారు.

అమ్మాయికి ఏటా రూ.1,600 వ్యయం

రాష్ట్రంలో జెడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని అమ్మాయిలకు ఆరోగ్య కిట్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో 5.90 లక్షల మంది చదువుతున్నా డ్రాపౌట్లు, గైర్హాజరీలు కలిపి వాస్తవంగా 5,00,330 మంది చదువుతున్నారు. ఈ లెక్కన ఆరోగ్య కిట్ల పంపిణీకి రూ.84.22 కోట్లు అవసరం మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. అమ్మాయికి ఒక త్రైమాసికానికి రూ.421 చొప్పున వ్యయం అవుతుంది. అంటే ఓ అమ్మాయికి ఏటా రూ.1,600 ఖర్చవుతుంది. మూడు నెలలకోసారి ఏడాదికి నాలుగుసార్లు ఆరోగ్య కిట్లు పంపిణీ చేస్తారు. ఒక్కో ఆరోగ్య కిట్‌లో 14 రకాల వస్తువులుంటాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు అవుతున్నా, ఈ పథకం అమలుకు రూ.15 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఒక త్రైమాసికానికి రూ.21.05 కోట్లు అవసరమవుతాయి. మొదటి త్రైమాసికం ఆరోగ్య కిట్ల పంపిణీ పూర్తయినా ఆ నిధులూ పూర్తిగా చెల్లించలేదు. వాస్తవానికి మూడో త్రైమాసికం ఆరోగ్య కిట్లు పంపిణీ కావాలి. అంటే అమ్మాయిలకు ఆరోగ్య కిట్లు సకాలంలో అందించకపోవడంతో మానసికంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

నిధుల కోసం ప్రభుత్వానికి విద్యాశాఖ విజ్ఞప్తులు

రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్య కిట్ల పంపిణీకి నిధులు విడుదల చేయాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి పాఠశాల విద్యాశాఖ విజ్ఞప్తి చేసింది. ఆర్థిక శాఖ అధికారులకు లేఖ రాసింది. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. 2018లో నవంబర్ 17, 28, డిసెంబర్ 19న మూడుసార్లు ఆరోగ్య కిట్లకు నిధులు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. పెండింగ్‌లో ఉన్న రూ.69.22 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు. నిధుల కొరత కారణంగానే ఆరోగ్య కిట్ల పంపిణీ మెల్లగా సాగుతున్నదని వివరిస్తున్నారు. అమ్మాయిల ఆరోగ్యం, చదువును దృష్టిలో ఉంచుకొని నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

రెండో త్రైమాసికం ఆరోగ్య కిట్ల వివరాలు

ఉమ్మడి జిల్లా	మొత్తం కిట్లు	పంపిణీ	పెండింగ్
ఆదిలాబాద్	52,215	52,215	0
హైదరాబాద్	33,716	0	33,716
కరీంనగర్	56,506	0	56,506
ఖమ్మం	37,546	37,546	0
మహబూబ్ నగర్	78,129	0	78,129
మెదక్	73,963	73,963	0
నల్లగొండ	63,946	63,946	0
నిజామాబాద్	53,044	0	53,044
రంగారెడ్డి	78,855	78,855	0
వరంగల్	63,060	0	63,060
మొత్తం	5,90,980	3,06,525	2,84,455

సీబీఐ డైరెక్టర్ నియామకపు ఆలస్యంపై సుప్రీం ఆగ్రహం

- ఈ నెల 4కు విచారణ వాయిదా



న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ నియామకం ఆలస్యం కావడం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సున్నితమైన, ప్రాముఖ్యతగల దర్యాప్తు సంస్థ డైరెక్టర్ పదవిలో తాత్కాలిక డైరెక్టర్‌ను ఎక్కువ కాలం కొనసాగించడం తగదని సుప్రీంకోర్టు హితవు పలికింది. సీబీఐ డైరెక్టర్‌ను వెంటనే నియమించాలని,ఇంచార్జ్‌తో వ్యవహారాలు నడపడం ఇక ఎంతమాత్రం తగదని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావును నియమించడాన్ని సవాల్ చేస్తూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం దీనిపై జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ నవీన్‌సిన్హాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ అంశంపై విచారణ నుంచి చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్, జస్టిస్ ఎకె సిక్రీ, జస్టిస్ ఎన్‌వి రమణ స్వచ్ఛందంగా తప్పుకున్న విషయం తెలిసిందే. దాంతో, నూతన ధర్మాసనం విచారణ జరుపుతోంది.

దీనిపై శుక్రవారం కేంద్రం తరపున కోర్టుకు హాజరైన అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వివరణ ఇచ్చారు. ఇప్పటికే సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం ప్రధానితో కూడిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన జరుపుతోందని, శుక్రవారం మరోసారి సమావేశం అవుతోందని వేణుగోపాల్ తెలిపారు. తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకంలోనూ కమిటీ ఆమోదం ఉన్నదని ఆయన అన్నారు. కమిటీ మరోసారి సమావేశం కానున్నదన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు విచారణను ఈ నెల నాలుగో తేదీకి వాయిదా వేసింది. కామన్‌కాజ్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్.. కొత్త డైరెక్టర్ నియామకంలో కమిటీ పారదర్శకత పాటించేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ముందు నియామకం జరగనీయండి, పారదర్శకత లోపించినట్టు అనిపిస్తే అప్పుడు కోర్టులో సవాల్ చేయొచ్చని సూచించింది.

డైరెక్టర్ ఎంపికలో నిర్ణయానికి రాలేకపోయిన ఉన్నత కమిటీ

సీబీఐ డైరెక్టర్ ఎంపిక కోసం శుక్రవారం సమావేశమైన ప్రధాని మోడీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ఏ నిర్ణయమూ తీసుకోకుండానే మరోసారి వాయిదా వేసింది. కమిటీ భేటీకి ప్రధానితోపాటు లోక్‌సభలో కాంగ్రెస్ పక్షం నేత మల్లికార్జునఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ హాజరయ్యారు. ఇదే అంశంపై కమిటీ సమావేశం కావడం ఇది రెండోసారి. గత నెల 24న సమావేశమైన కమిటీ 80మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను పరిశీలించింది. వారికి సంబంధించిన పూర్తి వివరాలు కావాలని ఆ సందర్భంగా ఖర్గే కోరిన విషయం తెలిసిందే.

రేషన్‌షాపుల ద్వారా అంగన్‌వాడీలకు బియ్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం వేలిముద్రల ఆధారంగా రాష్ట్రంలో ఉన్న 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్న రేషన్‌షాపుల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారా బియ్యాన్ని పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఇందుకోసం 72 వేల మంది అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల, సూపర్‌వైజర్ల ఆధార్‌తోపాటు వేలిముద్రలను ఈ-పాస్ మెషన్లకు నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సహకారంతో అనుసంధానం చేయడం జరిగింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో శుక్రవారం నాడు పంపిణీకి శ్రీకారం చుట్టారు. మేడ్చల్ జిల్లాలోని కొన్ని రేషన్ షాపుల్లో బియ్యం సరఫరా ప్రక్రియను, అంగన్‌వాడీల కేంద్రాల్లో బియ్యం నాణ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. జగదీశ్వర్, డైరెక్టర్ విజయేందిర బోయి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్‌ఏ సి. మల్లారెడ్డి పాల్గొన్నారు. బియ్యం పంపిణీలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బియ్యం నాణ్యతలో ఏమాత్రం రాజీపడవద్దని అన్నారు. ఈ కొత్త విధానం ద్వారా అంగన్‌వాడీ నిర్వాహకులు ఏ రోజు, ఎంతమంది, ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్లారు, ఇంక ఎంత తీసుకోవాల్సి ఉంది, ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్ వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలుగా ఉంటుంది. మొత్తం సరఫరా ప్రక్రియను పర్యవేక్షించడానికి కూడా సులువుగా ఉంటుంది.

నిరాశపరిచిన విద్యారంగ కేటాయింపులు

- కేంద్ర బడ్జెట్‌పై టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులే కేటాయించిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి శుక్రవారం ఓ ప్రకటన విడుదలచేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం కేటాయింపులు జరపాలన్న డిమాండ్‌ను విస్మరించిందని తెలిపారు. గత కేటాయింపుల్లోనూ కుదించిందని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 3.4 శాతం నిధులు కేటాయించిందని తెలిపారు. తాజా బడ్జెట్‌లో 3.37 శాతానికి కుదించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి విద్యారంగం అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని తెలిపారు. గత బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల ప్రకారం రూ.83,626 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏ, ఉపాధ్యాయ విద్యా పథకాన్ని సమీకృతం చేసి సమగ్ర శిక్ష పథకం ద్వారా విద్యారంగంలో మౌలిక మార్పులు చేపడతామని ప్రకటించిందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకా నికి గత బడ్జెట్‌లో 0.46 శాతం నిధులు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో 0.39 శాతం కుదించిందని తెలిపారు. నవోదయ పాఠశాలలకు కేటాయింపులు రూ.3,213 కోట్ల నుంచి రూ.3,068 కోట్లకు, కేంద్రీయ విద్యాలయాల కేటాయింపులు రూ.5,006 కోట్ల నుంచి రూ.4,868 కోట్లకు కుదించిందని పేర్కొన్నారు.

అయినా ఊరట లేదు

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం వల్ల ఆలోపు ఆదాయం ఉన్న వారు కొత్త నిబంధనల ప్రకారం పన్ను చెల్లించనవసరం లేదని రాములు, చావ రవి పేర్కొన్నారు. రూ.5,00,001 నుంచి ఆదాయం ఉన్న వారందరూ పాత రేట్లలోనే పన్ను చెల్లించాలని తెలిపారు. కనుక ఇదేమీ ఊరట కాదని పేర్కొన్నారు. 80-సి నిబంధన కింద కలిగే పొదుపు పరిమితిని రూ.3లక్షలకు పెంచాలని డిమాండ్ చేసినా పరిగణించలేదని తెలిపారు.

2119 మంది పిల్లల్ని రక్షించిన ఆపరేషన్ స్మైల్

- బాలల చట్టాలు ఉల్లంఘించిన వారిపై 58 కేసులు నమోదు
- జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌కు సిద్ధం: షీ టీమ్స్ ఐజీ స్వాతి లక్రా వెల్లడి

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

ఈ ఏడాదిలో తీసుకున్న నిర్ణయం మేరకు జనవరి మాసంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 2119 మంది బాలబాలికలను రక్షించడం జరిగిందని రాష్ట్ర షీటీమ్స్, శాంతి భద్రతల విభాగం ఐజీ స్వాతిలక్రా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆపరేషన్‌ను ప్రతి సబ్ డివిజన్‌లో నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, చౌరస్తాలు, వెట్టిచాకిరి చేయించే చిన్న చిన్న పరిశ్రమలు, ఇటుకల బట్టీలలో తమ టీంల సోదాలు జరిగాయని ఆమె వివరించారు. ఈ ఆపరేషన్‌లో రక్షించిన వారిలో కొందరి వివరాలను ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్, దర్పణ్ యాప్‌ల ద్వారా గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ విధంగా దీర్ఘకాలంగా తమ తలిదండ్రులకు దూరమైన 18 మంది పిల్లల్ని వారి సొంతగూటికి చేర్చగలిగామని ఆమె తెలిపారు. ఈ విషయంలో రామగుండం పోలీసు కమిషనరేట్ అధికారుల పని తీరు ప్రశంసలు అందుకుందని అన్నారు. కాగా, రక్షించిన వారిలో బాలలు 1653 మంది, బాలికలు 563 మంది ఉన్నారని ఆమె తెలిపారు.

అలాగే ఇందులో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదం డ్రులకు 1303 మందిని అప్పగించినట్టు తెలిపారు. ఇందులో 1029 బాలలు, 273 బాలికలు ఉన్నారని, 816 మంది పిల్లలను రెస్క్యూ హోంలకు తరలించా మని స్వాతి లక్రా వివరించారు. రక్షించబడ్డ వారిలో 763 మంది బాలబాలికలు బయటి రాష్ట్రాలకు చెందిన వారున్నారని పేర్కొన్నారు. అలాగే 532 మంది వీధి బాలలను, బాలకార్మికులుగా పని చేస్తున్న మరో 340 మంది బాలబాలికలను కూడా తమ ఆపరేషన్ టీమ్ సభ్యులు రక్షించారని ఆమె తెలిపారు. వీరితో పాటు ఇటుకబట్టీలలో పని చేస్తున 119 మంది పిల్లలతో పాటు బాలబాలికలతో వెట్టిచాకరి చేయిస్తున్న వారిపై కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా బాలల పై హింస, అత్యాచారాలు, అక్రమరవాణా మొదలైన సెక్షన్‌ల క్రింద మొత్తం 58 కేసులను కూడా నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో ప్రతి సబ్ డివిజ న్‌కు ఒక ఎస్‌ఐ నలుగురు కానిస్టే బుళ్లతో పాటు స్త్రీ శిశుసంక్షేమం, జీహెచ్‌ఎంసీ, ఇతర ఎన్జీవో సంఘాలకు చెందిన ప్రతినిధులు కూడా ఆపరేషన్ స్మైల్‌లో పాల్గొన్నారని అన్నారు.

సివిల్ డ్రస్‌లో వెళ్లడం ఎందుకు?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


పోలీసులు సివిల్ దుస్తుల్లో వెళ్లి ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే ఎలాగని హైకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. రమ్మీ చట్ట వ్యతిరేకం కాదని హైకోర్టు పలుసార్లు తేల్చినా కరీంనగర్‌లో ఒక రిసార్ట్‌పై మఫ్టీలోని పోలీసులు దాడులు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రిసార్ట్‌పై అన్యాయంగా దాడి చేశారని కరీంనగర్‌లోని పుష్పాంజలి కంట్రీ రిసార్ట్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. సీఆర్‌పీసీ కంటే పోలీసుల ఆదేశాలేమీ ఉన్నతం కాదని హైకోర్టు న్యాయమూర్తి పీవీ సంజయ్‌కుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ వచ్చి వాదించాలని ఆదేశించారు. దాడులు చేయరాదని హైకోర్టు ఆదేశాల్ని పోలీసులు బేఖాతరు చేస్తూ సివిల్ డ్రస్‌ల్లో వచ్చి దాడులు చేస్తూ కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్నారని రిసార్ట్ యాజమాన్యం తరపు లాయర్ చెప్పారు.

రీపోలింగ్ పెట్టాల్సిందే..

- యాదాద్రి భువనగిరిలో సెల్ టవర్ ఎక్కిన యువకులు

నవతెలంగాణ- సిరిసిల్ల/ యాద్రాద్రి/ సిద్దిపేట/పూడూర్

గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి మూడు రోజులు గడుస్తున్నా ఆ వేడి ఇంకా తగ్గలేదు. ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందని ఓడిన సర్పంచ్ అభ్యర్థులు, వారి అనుచరులు చేస్తున్న ఆందోళనలు శుక్రవారమూ ఉధృతంగా కొనసాగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామపంచాయతీ ఓట్ల లెక్కింపులో అధికారుల పక్షపాతాన్ని నిరసిస్తూ, రీకౌంటింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇద్దరు యువకులు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సెల్ టవర్ ఎక్కారు. న్యాయం జరిగేవరకు కిందకు దిగబోమని భీష్మించారు. ఎస్‌ఐ మల్లీశ్వరీ అక్కడి చేరుకుని యువకులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వారు దిగిరాలేదు.



దీంతో కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడంతో దిగివచ్చి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

సర్పంచ్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ సర్పంచ్ అభ్యర్థుల చేస్తున్న నిరాహార దీక్ష ఆరో రోజుకు చేరుకుంది. ఇన్‌చార్జి కలెక్టర్ యాస్మిన్‌బాషా వచ్చి న్యాయం చేస్తామని గురువారం హామీ ఇచ్చినప్పటికీ అభ్యర్థులు దీక్షలు కొనసాగించారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో రీకౌంటింగ్ నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొంతమంది గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.

తిరుమలాపూర్‌లో రీపోలింగ్

ఒకరి ఓటు మరొకరు ఉపయోగించుకున్నారని ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిరుమలాపూర్‌లో వాయిదా పడిన ఎన్నికలను శుక్రవారం మళ్లీ నిర్వహించారు. ఎన్నికలు జరిగిన అనంతరం పోలింగ్ బాక్స్‌లను భారీ బందోబస్తు మధ్య మండల కార్యాలయానికి తీసుకెళ్లారు. గ్రామంలో 8 వార్డులు ఉండగా నాలుగు వార్డులు కాంగ్రెస్ 4 వార్డులు టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఉప సర్పంచ్ ఎవరిని చేయాలన్న విషయంలో సర్పంచి ఓట్లు లెక్కించే అంత వరకు ఉత్కంఠ భరితమైన వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు టీఆర్‌ఎస్ అభ్యర్థిపై విస్లావత్ కమిలి బాయ్ 170 ఓట్లతో విజయం సాధించారు.కౌంటింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరిగి మొగులయ్య, ఎస్సై అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆపద మొక్కుల ఎన్నికల బడ్జెట్ : జేపీ

హైదరాబాద్: ఐదేండ్ల పాలనను చూసి బీజేపీకి ఓటు వేయమనే సాహసం చేయలేక ఎన్నికల్లో గెలవడానికి చేసిన ఆపద మొక్కుల్లా యూనియన్ బడ్జెట్ ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ వ్యాఖ్యానించారు. రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు అనే మూడు వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఉపశమనం హామీల్ని ప్రకటించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి కావాల్సింది మౌలిక మార్పులని, ఆ దిశగా ప్రయత్నాలు జరగనంత వరకూ ఇలాంటి బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉందని తెలిపారు.

అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

అప్పుల బాధతో ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన నేత కార్మికుడు కొండ్ల శ్రీనివాస్(35)కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం తెలిసిన వారి దగ్గరి నుంచి రూ.8లక్షల వరకు అప్పు చేశాడు. శ్రీనివాస్ ఐదు నెలలుగా టెక్స్‌టైల్‌పార్క్‌లో పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తున్నాడు. వేతనాలు పెంచాలంటూ పవర్‌లూం కార్మికులు 20 రోజులుగా ధర్నా చేస్తుండటంతో పనిలేక కుటుంబ పోషణ భారంగా మారింది. బాకీ తీర్చాలంటూ అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూతురు అక్షిత, కొడుకు రోహిత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాయకత్వాన్ని ఎన్నుకునే బాధ్యత వెనిజులా ప్రజలదే

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ స్పష్టీకరణ

ఏథెన్స్: తమ ప్రయోజనాలను పరిరక్షించుకుంటూ దేశ నాయకత్వాన్ని ఎన్నుకునే బాధ్యత వెనిజులా ప్రజలదేనని గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు అమెరికా, నాటో, ఈయూ చేస్తున్న ప్రయత్నాలను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) తీవ్రంగా ఖండించింది. ప్రజలు ఎన్నుకున్న దేశాధ్యక్షుడిని కుట్రతో తొలగించి కీలుబొమ్మ అధ్యక్షుడిని నియమించే యత్నాలను, అదే విధంగా అత్యంత ప్రమాదకరమైన తమ సామ్రాజ్యవాద కుట్రలను అమలు చేసేందుకు వీలుగా సైనిక చర్య బెదిరింపులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేకేఈ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

అలాగే వెనిజులా విషయంలో జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్ తదితర దేశాలు చేస్తున్న ప్రకటనలను, అనుసరిస్తున్న వైఖరిని తాము నిరసిస్తున్నామని తెలిపింది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా, ఇయు జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న గ్రీస్ ప్రభుత్వం సైతం తాము వెనిజులా అధ్యక్షుడు మదురోను గుర్తించటం లేదంటూ కవ్వింపు ప్రకటనలు జారీ చేయటం శోచనీయమని విమర్శించింది. తమ ప్రయోజనాలను పరి రక్షించే సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేసుకునే బాధ్యత పూర్తిగా వెనిజులా ప్రజలదేనని కేకేఈ తన ప్రకటనలో పునరుద్ఘాటించింది. ప్రస్తుతం పెట్టుబడిదారీ దోపిడీని, సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వెనిజులా ప్రజలకు తాము పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని, వెనిజులా ప్రజలు దోపిడీ, సామ్రాజ్యవాద కుట్రలకు బలికాకుండా, శ్రామిక వర్గ హక్కుల కోసం పోరాడుతున్న వెనిజులా కమ్యూనిస్టు పార్టీని తాము గట్టిగా సమర్ధిస్తున్నామని కెకెఇ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

కిమ్‌తో మలిభేటీ వివరాలు వచ్చే వారం చెబుతా: ట్రంప్


(ఫైల్)

వాషింగ్టన్: ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్‌ఉన్‌తో జరుగనున్న మలి భేటీ వివరాలను తాను వచ్చే వారం వెల్లడిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. గురువారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ కిమ్‌తో మలి భేటీ జరిగే ప్రదేశం, తేదీ ఇప్పటికే నిర్ణయించామని వాటిని త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. ఫిబ్రవరి చివరి వారంలో ఈ భేటీ వుండే అవకాశాలున్నాయన్నారు. వచ్చే వారం భేటీ ప్రదేశం, తేదీ వివరాలను అధికారులు వెల్లడిస్తారని ఆయన చెప్పారు. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో తొలిసారిగా భేటీ అయిన ఇరువురు నేతలు మలి భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ మలి భేటీ ఆసియాలోని ఒకప్రదేశంలో జరుగుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో బుధవారం చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇదిలా వుండగా అమెరికా ఉ.కొరియా వ్యవహారాల ప్రత్యేక దూత స్టీఫెన్ బీగన్ ఆదివారం సియోల్ వెళ్లి ద.కొరియా ప్రత్యేక దూత లీ దోహున్‌తో చర్చిస్తారని అమెరికా విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. ఆ తరువాత ఆయన ఉ.కొరియా ప్రతినిధులతో కూడా భేటీ అవుతారని విదేశాంగశాఖ తన ప్రకటనలో వివరించింది.

గుయాడో గుర్తింపునకు ఇటలీ నో!

- వెనిజులా సార్వభౌమత్వ దేశమని స్పష్టీకరణ



రోమ్: వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా తనను తాను ప్రకటించుకున్న జువాన్ గుయాడోను గుర్తించేందుకు ఇటలీ ప్రభుత్వం నిరాకరించింది. గుయాడోను గుర్తిస్తూ యూరోపియన్ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఇటలీ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. వెనిజులా స్వయంప్రకటిత అధ్యక్షుడు జువాన్ గుయాడోను ఇటలీ గుర్తించటం లేదని ఆ దేశ విదేశాంగశాఖ సహాయ మంత్రి మనిలో డి స్టెఫానో స్పష్టం చేశారు. ఒక సార్వభౌమత్వ దేశ అంతర్గత వ్యవహారాలను మరో దేశం లేదా దేశాల బృందం నిర్దేశించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆయన చెప్పారు. ఐరాస ప్రకటించిన నాన్ ఇంటర్వెన్షన్ మార్గదర్శకాల పరమార్ధం కూడా ఇదేనని ఆయన గుర్తు చేశారు. వెనిజులాలో యుద్ధం లాంటి పరిస్థితిని సృష్టించేందుకు కొన్ని దేశాలు చేస్తున్న ప్రయత్నాలపై ఇటలీ ప్రభుత్వం ఆందోళన చెందుతోందన్నారు.

లిబియాలో చేసిన తప్పునే మళ్లీ ఇక్కడ కూడా చేస్తున్నారన్న విషయాన్ని ఇప్పుడు ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని ఆయన చెప్పారు. వెనిజులాలో ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై వుందన్నారు.

చికాగోలో ఎముకలు కొరికే చలి

రికార్డ్‌స్థాయిలో శీతల గాలులు

- ఇల్లినాయిస్, మిచిగాన్, విస్కిన్‌సన్‌లలో ఎమర్జెన్సీ


రోడ్డుపై మంచును తొలగిస్తున్న దృశ్యం

చికాగో: అమెరికాలోని చికాగో నగరం చలితో వణికిపోతోంది. ఈ ప్రాంతంలోకి ఆర్కిటిక్ ప్రాంతం నుంచి విపరీతంగా చలిగాలులు వీస్తున్నాయి. ఈ శీతల గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు భారీస్థాయిలో పడిపోయాయి. దీంతో అమెరికా మధ్య పశ్చిమ ప్రాంతం గడ్డకట్టుకుపోతోంది. ఈ నేపథ్యంలోనే మధ్య పశ్చిమ రాష్ట్రాలు ఎమర్జెన్సీని విధించాయి. మిచిగాన్, విస్కిన్‌సన్, ఇల్లినాయిస్ రాష్ట్రాలలో అత్యయిక పరిస్థితి కొనసాగుతోంది.

బయటకు వెళ్లేవాళ్లు దీర్ఘమైన శ్వాస తీసుకోవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పోలార్ వర్టెక్స్ ప్రభావంతో ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ నుంచి వస్తున్న తీవ్ర చలిగాలులతో అమెరికా పశ్చిమ మధ్య (మిడ్ వెస్ట్) ప్రాంతం హిమఖండంలా మారింది. దీంతో లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తానికి ఈ ప్రభావం కోట్లాది మందిపై చూపుతోంది. డకోటా నుంచి ఓహియో వరకు పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా చలి గజగజ వణికిస్తోంది. చికాగోతో పాటు పలు ప్రాంతాల్లో మైనస్ 27 డిగ్రీల సెల్సియస్, అంతకంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదయింది. శీతల గాలులు మరింత విస్తరించే అవకాశముందనే అంచనాతో అధికారులు పాఠశాలలతో పాటు కార్యాలయాలను, వాణిజ్య సముదాయాలను మూసివేశారు. పోస్టల్ సర్వీసులతో పాటు వందల విమాన సర్వీసులను రద్దు చేశారు.

పలు కంపెనీలు తమ ఉద్యోగులను ఇండ్లలోనే ఉండాలని సూచించాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో మైనస్ పది డిగ్రీల నుంచి మైనస్ 40 సెల్సియస్ డిగ్రీలకు పడిపోయింది.

చెట్టులో మినీ లైబ్రరీ...!



న్యూయార్క్: మనసుంటే మార్గం ఉంటుంది. అమెరికా లోని ఓ మహిళ కూడా తన మనసు పెట్టి ఆలోచించింది. దాదాపు చనిపోయే దశలో ఉన్న 110 ఏండ్ల చెట్టును ఓ లైబ్రరీగా మార్చేసింది. సాధారణంగా ఇలాంటి చెట్టు మన దగ్గర ఉంటే కుళ్లపోతుందంటూ నరికేస్తాం. కానీ ఓ ఆర్టిస్ట్ కమ్ లైబ్రేరియన్ అయిన షరాలీ ఆర్మిటేజ్ అనే మహిళ మాత్రం అలా చేయలేదు. వయసు మీద పడుతున్న ఈ చెట్టు పూర్తిగా ఎండిపోయి కొమ్మలు విరిగి పడుతున్నాయి. గత ఏడాది అలాగే కొమ్మ విరిగి పడి ఓ కారు ధ్వంసమైంది. దీంతో లాభం లేదు అనుకొని నవంబర్‌లో ఈ చెట్టును సగానికిపైగా నరికేసింది. ఆ తర్వాత మిగిలి ఉన్న కాండాన్ని ఓ అందమైన లైబ్రరీగా మార్చింది. ఆ చెట్టుకి 'లిటిల్ ఫ్రీ లైబ్రరీ'గా పేరు పెట్టింది. చెట్టు కాండానికి ఓ డోర్ అమర్చి..లోపల చిన్న అరల్లో ఆమె కొన్ని పుస్తకాలు కూడా ఉంచింది. పుస్తక ప్రియులు ఎవరైనా.. ఈ 'ట్రీ లైబ్రరీ' కి వచ్చి అక్కడున్న పుస్తకాలు చదువుకుని తిరిగి వాటిని అక్కడే ఉంచి వెళ్లిపోవచ్చు. అన్నట్టు అమెరికాలోని బోయిస్‌లో ఉందీ స్పెషల్ ట్రీ లైబ్రరీ..

పెమెక్స్ చీఫ్ రాజీనామా కోరిన మెక్సికో అధ్యక్షుడు అమ్లో



మెక్సికో: మెక్సికో ప్రభుత్వ ఆధ్వర్యంలోని చమురు కంపెనీ పెమెక్స్ సీనియర్ అధికారి మిగుయెల్ ఏంజెల్ లొజాడాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరుగనున్నందున ఆయనను పదవికి రాజీనామా చేయాలని దేశాధ్యక్షుడు మాన్యుయెల్ లోపెజ్ ఓబ్రడార్ (ఆమ్లో) కోరారు. పెమెక్స్ చీఫ్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు హెక్టార్ సాల్వడార్, లూయిస్ గల్వాన్ ఆర్కోస్‌లపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమ్లో చెప్పారు. గత అధ్యక్షుడు ఎన్రిక్ పెనా నీటో నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో వీరు ముగ్గురూ కోట్లాది డాలర్ల ప్రజా ధనాన్ని అక్రమంగా దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మెక్సికన్ మీడియా ఇటీవల వార్తా కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తెలిసినా, కనీసం అనుమానం వచ్చినా తాము ఏ మాత్రం సహించబోమని ఆమ్లో స్పష్టం చేశారు. కాగా తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను లొజాడా తోసిపుచ్చారు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గనందునే తనపై అవినీతి ముద్ర వేసి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని లొజాడా మీడియా సమావేశంలో చెప్పారు.

భావితరాలకు ఆరోగ్యనిధి భగీరథ

- స్మితా సబర్వాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ వెలకట్టలేని "ఆరోగ్యనిధి" తెలంగాణ భావితరాలకు ప్రభుత్వం అందిస్తున్నదని మిషన్ భగీరథ ప్రభుత్వ కార్యదర్శి స్మీతా సభర్వాల్ అన్నారు. మిషన్ భగీరథ అపరేషన్, నిర్వహణ విధానం, మార్గదర్శకాలపై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ రెండో రోజు హాజరైన స్మితా సభర్వాల్ తాగునీటి ప్రాముఖ్యతను గుర్తించి పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, ఇంజినీర్లు, సిబ్బంది అంకితభావంతో ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి భగీరథతో శుద్ధిచేసిన తాగునీరు సరఫరా అవుతున్నదన్నారు. ప్రస్తుతం ప్రతీ మనిషికి గ్రామాల్లో రోజుకు వంద లీటర్లు, పట్టణాల్లో రోజుకు 135 లీటర్లు, నగరాల్లో 150 లీటర్లు సరఫరా అవుతున్నాయన్నారు. అంతకుముందు మిషన్ భగీరథ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్స్, స్థిరమైన తాగునీటి సరఫరా అంశాలపై చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ భగీరథతో ఎలాంటి ఆటంకాలు లేని తాగునీటి సరఫరా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ క్రమంలో తలెత్తే సమస్యలను విజయ్ ప్రకాష్ వివరించారు. ఆ తరువాత స్కాడా పనితీరు, సమస్యలపై డి. రఘునందన్ మాట్లాడారు. ఇక మిషన్ భగీరథతో 24 గంటలు తాగునీటిని అందించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలు, ఆటంకాలపై "అస్కీ" డైరెక్టర్ శ్రీనివాసచారీ ప్రజేంటేషన్ ఇచ్చారు. ఇక "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" ఉపయోగించి లోపాలు లేకుండా తాగునీటిని ఎలా అందివ్వాలో "స్మార్ట్ టెర్రా" స్టార్టప్ ప్రతినిధి గోకుల్ కృష్ణ వివరించారు. రోజువారీ నీటి వినియోగం, లీకేజీలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సమర్ధవంతంగా లెక్కగట్టచ్చన్నారు. ఆ తర్వాత యునిసెఫ్ ప్రతినిధులు తమ బేస్‌లైన్ సర్వేపై ప్రజెంటేషన్ ఇచ్చారు.ప్రస్తుతం తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రమైన మంచినీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నీటి సంబంధిత వ్యాధులపై తాము సర్వే చేశామని చెప్పారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

మరణించిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్, ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యంతో మరణించిన ఐదుగురు కార్మికుల మృతికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. మరణించిన ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేసింది. గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని కోరింది. మరణించిన, గాయపడిన కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాంపల్లిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దాస్ ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రయివేటు నిర్మాణ సంస్థ డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మిస్తోందని తెలిపారు. పని చేస్తుండగా పశ్చిమబెంగాల్, బీహార్‌కు చెందిన ఆరుగురు కూలీలు 10వ అంతస్తు నుండి కింద పడడంతో ఐదుగురు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం, నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విమర్శించారు. 2 వేల మంది పని చేసే ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు, రక్షణ చర్యలు లేవని తెలిపారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఓ కూలి బహిర్భూమికి వెళ్లి రాత్రి వేళ ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని ఈ మధ్యే మరణించారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రథమ చికిత్స కేంద్రం, అంబులెన్స్ సదుపాయం లేకపోవడంతో గురువారం ప్రమాదం జరిగిన వారిని ఆటోట్రాలీలో తరలించే దుస్థితి నెలకొందని తెలిపారు. వేలాది మంది పనిచేస్తున్న ఇలాంటి ప్రదేశాల్లో కాంట్రాక్టర్లు, ప్రభుత్వం కనీస జాగ్రత్తలూ తీసుకోకపో వడం కూలీల ప్రాణాలతో చెలగాటమాడడమేనని విమర్శించారు. మరణించిన ఒక్కో కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి 5 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు, నాణ్యమైన వైద్యం అందించాలని, ఆ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ ప్రమాదానికి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించే ప్రాంతంలో మరుగుదొడ్లు, మంచినీరు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కూలీలకు హెల్మెట్‌లు, సేఫ్టీ బెల్ట్‌లతో పాటు ప్రమాదవశాత్తు కింద పడినా హాని కలగకుండా నెట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదం జరగకుండా పర్యవేక్షించేందుకు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

లైంగిక వేధింపులపై స్పందించండి : హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమలో మహిళా కళాకారులపై లైంగిక వేధింపులు, దోపిడీలపై విచారణ, నివారణ, వారి సంక్షేమం కోసం తీసుకునే చర్యల నిమిత్తం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు అంశంపై స్పందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి క్యాస్టింగ్‌కౌచ్‌పై విచారణకు చర్యలు తీసుకునే అంశంపై ప్రభుత్వం ఒక నిర్దష్టమైన వైఖరిని తెలియజేయాలని నోటీసులు ఇచ్చింది.

ఈమేరకు శుక్రవారం హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

స్వాతంత్ర్య సమరయోధుడికి తుది వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో కెవి.కేశవులు అంత్యక్రియలు
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు

నవతెలంగాణ-ధర్మపురి


నివాళ్లర్పిస్తున్న ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి ధర్మపురికి చెందిన కెవి. కేశవులు అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో శుక్రవారం జరిగాయి. జగిత్యాల జిల్లా ధర్మపురిలో 1924 జనవరి 14న జన్మించిన కేశవులు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. రజాకార్లను ఎదిరించారు. 1947 ఆగస్టు 15వ తేదీన ధర్మపురిలో మొట్టమొదటి సారిగా త్రివర్ణ పతాకాన్ని ఆయన ఇంటిపై ఎగరేసి సంబురాలు జరిపారు. అనంతరం సిర్పూర్ నుంచి శాసనసభ్యునిగా గెలుపొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత శాఖ మంత్రిగా పనిచేశారు. 95 ఏండ్ల వయసులో జనవరి 30న బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. శుక్రవారం ఆయన స్వస్థలానికి తీసుకొచ్చిన భౌతిక కాయాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొంతసేపు ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం ప్రత్యేక వాహనంపై ఆయన ఇంటి వరకు అంతిమయాత్రగా తీసుకెళ్లారు. కేశవులు నివాసం వద్ద ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, మాజీ శాసన సభ్యుడు జీవన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ వెంకటరమణ, జేసీ రాజేషం, ఆర్డీవో నరేందర్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటిక వద్ద అధికార లాంఛనాలు నిర్వహించారు. భౌతికకాయంపై త్రివర్ణ పతాకం ఉంచి పోలీసులు గాలిలో కాల్పులు జరిపి దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మీ బాబు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బాదినేని రాజేందర్, అయ్యోరి రాజేష్, ఎస్ఐలు శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో టీఆర్ఎస్ లాలూచీ కుస్తీ

- రైతులకు ఎకరాకు రూ.12 వేలివ్వాలి
- ఐదు దశాబ్ధాల్లో ఎప్పుడూ లేనంత నిరుద్యోగం
- మోడీ దేశానికి క్షమాపణ చెప్పాలి : సురవరం



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో టీఆర్ఎస్ లాలూచీ కుస్తీ పడుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పార్లమెంటులో బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళన చేయడం వల్ల అధికార పార్టీకి, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు సమానదూరం పాటిస్తున్నామని టీఆర్ఎస్ భావిస్తోందని చెప్పారు. కానీ బీజేపీ ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలకూ టీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. అవిశ్వాస తీర్మానం, జీఎస్టీ, నోట్లరద్దు ఇలా అన్నింటినీ టీఆర్ఎస్ బలపరిచిందని విమర్శించారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామనే సంకేతాలు ఇచ్చేందుకు కావేరీ జలాల కోసం తమిళనాడులో అన్నాడీఎంకే తరహాలో టీఆర్ఎస్ వ్యవహరిస్తోందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం నిరాశాజనకంగా ఉందన్నారు. కీలకమైన అంశాలను ప్రస్తావించలేదని చెప్పారు. రూపాయి విలువ పతనం, ధరల పెరుగుదల వంటి అంశాలను విస్మరించారని అన్నారు. నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం నిరుద్యోగం పెరిగితే రాష్ట్రపతి తగ్గించి చూపారని చెప్పారు. వాస్తవాలను కప్పిపుచ్చే విధంగా ప్రసంగించడం గర్హనీయమని అన్నారు. వృద్ధిరేటును పెంచేందుకు ఈ ప్రభుత్వం వినూత్న పద్ధతిని అవలంబిస్తోందని విమర్శించారు. అంకెలగారడీ చేస్తోందన్నారు. దేశంలో ఎన్ఎస్ఎస్‌వో నివేదిక ప్రకారం నిరుద్యోగం 6.1 శాతం ఉందని చెప్పారు.

నిరుద్యోగంపై వాస్తవాలను దాచిపెట్టడం తగదన్నారు. బీజేపీ అనుసరించిన ఆర్థిక విధానాల వల్లే నిరుద్యోగం పెరిగిందని అన్నారు. ప్రభుత్వరంగాన్ని పెంచాల్సిందిపోయి ప్రయివేటురంగాన్ని ప్రోత్సహించారని చెప్పారు. మేకిన్ ఇండియా బోగస్ నినాదమని ఎద్దేవా చేశారు. విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చినా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయారని అన్నారు. ఐదు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనంతస్థాయిలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదు ఎకరాల్లోపు రైతులకు రూ.6 వేలు సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

రూ.6 వేలు సరిపోవనీ, ఎకరాకు రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సంక్షోభం పరిష్కారం కావాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సూచించారు.

మంత్రివర్గం లేకుండా సీఎం ఒంటెద్దుపోకడలు చాడ

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చి 50 రోజులు గడిచినా పూర్తిస్థాయి క్యాబినెట్‌ను ఏర్పాటు చేయకపోవడం ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటెద్దు పోకడలకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మంత్రివర్గంలో ఎవరుంటారో, ఎవరుండరో తెలియక అందరూ అంతర్మథనం చెందుతున్నారని అన్నారు. ఇది టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని, ప్రజాస్వామ్య విలువలకు పాతర వేయడమేనని విమర్శించారు. నుమాయిష్‌లో 300 స్టాల్స్ కాలిపోయాయని, ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. ఎవరిని అడిగినా అంతా సీఎం చూసుకుంటారని అంటున్నారని చెప్పారు. అధికారం కేంద్రీకృతం అయ్యిందనడానికి ఇది నిదర్శనమని అన్నారు. డబ్బు, మద్యం, అధికార దుర్వినియోగం చుట్టూ పంచాయతీ ఎన్నికలు జరగాయని చెప్పారు. ప్రజాసేవకులు పోటీచేసేందుకే జంకుతున్నారని అన్నారు. అయినా ఈ పరిస్థితుల్లో సీపీఐకి చెందిన 73 మంది సర్పంచ్‌లుగా గెలిచారని వివరించారు. సీపీఐ బలపరిచిన, కాంగ్రెస్, సీపీఐ(ఎం)కు మద్దతిచ్చిన అభ్యర్థులు చాలా మంది విజయం సాధించారని అన్నారు. స్థానిక సంస్థలకు 29 రకాల అధికారాలు బదలాయించాలని, నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో నిధులు, విధులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భువనగిరిలో క్రికెట్ టోర్నమెంట్

- ఫిబ్రవరి 10 నుంచి 22 వరకు : గూడూరు నారాయణరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భువనగిరి పార్లమెంట్ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి చెప్పారు. ఫిబ్రవరి 10 నుండి 22 వరకు క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని మునుగోడు సూపర్ కింగ్స్, జనగామ ఛాలెంజర్స్, ఆలేరు సన్‌రైజర్స్, భువనగిరి లయన్స్, యాదగిరిగుట్ట రాయల్స్, నకిరేకల్ వారియర్స్, ఇబ్రహీంపట్నం రైడర్స్‌తో కలిపి 8 టీంలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్సహించడానికి ఈ టోర్నమెంట్ ఉపయోగపడుతుందన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ 25000, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ రూ 20000 నగదు బహుమతి అందిస్తామన్నారు. మొదటి స్థానంలో నిలిచిన టీమ్‌కు లక్ష యాభైవేలు, రెండవ స్థానంలో నిలిచిన టీమ్‌కు లక్ష రూపాయలు, మూడవ, నాలుగవ స్థానంలో నిలిచిన టీమ్‌కు యాభైవేల బహుమతి ఇస్తామన్నారు. స్టార్ క్రికెటర్స్‌ను చేతుల మీదుగా బహుమతులు అందిస్తామన్నారు.

నవచిత్రం

సినీ కవిగా ఉండటమే గొప్ప


సిరివెన్నెల సీతారామశాస్త్రి

'కళల కంటే సాహిత్యం గొప్పది. సాహిత్యం కంటే నాటకం గొప్పది. నాటకం కంటే సినిమా గొప్పది. ఏ సినిమా కూడా సొసైటీని మిస్‌గైడ్ చేయదు' అని ప్రముఖ పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నారు. సినీ సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలకిగానూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో ముచ్చటించారు. 'నాకు పురస్కారం రావడంలో కారణమైన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు. నాకు సినిమా అంటే ఇష్టం. చిత్ర రంగాన్ని దేవాలయం కంటే ఎక్కువగా ప్రేమిస్తాను. సినిమా గొప్ప వ్యాపారం. సినిమాలు తీస్తున్నందుకు నిర్మాతలు గర్వపడాలి. ఏ లాభం ఆశించకుండా పెట్టుబడి పెట్టేది నిర్మాత ఒక్కరే. అలా ప్రతి ఒక్కరు అనుకుని తీస్తే మరిన్ని మంచి సినిమాలొస్తాయి. సినిమా సమాజాన్ని తప్పుదోవ పట్టించదు. ఏ హత్య సీనైనా, అత్యాచారానికి సంబంధించిన సన్నివేశమైనా కారణం లేకుండా ఉండదు. సినిమా వల్ల సమాజం చెడిపోతుందనే మాటని నేనొప్పుకోను. అలాగే పాట దాని స్థాయిని మించి ప్రేక్షకుడిని ఆలోచింపచేసేదిగా ఉండాలి. అప్పుడే ఆ పాటకి సార్థకత. స్త్రీ పాత్రని కించపరిచేదిగా, యువతరాన్ని ఉద్రూతలూగించే పాటలు నేను రాయలేను. పాట భావోద్వేగ భరితంగా ఉండాలి. పిల్లల్ని నిద్రపుచ్చేది జోల పాట. ఒక వయసు వచ్చాకా యువతని చైతన్య పరచడానికి జ్వాల పాట అవసరం. అదే సమయంలో పాట వినోదం కోసం, టైమ్‌పాస్ కోసం కాదు. మాటల్లో వ్యక్తం చేయలేని భావాలు చాలా ఉంటాయి. వాటిని వ్యక్తపరిచేందుకే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. గతంలో కవులు, సినీ కవులు అని రెండు రకాలుగా చూసేవారు. సినీ కవులకి కవిత్వం రాదనుకొనేవారు. కానీ నా దృష్టిలో సినీ కవిగా ఉండటమే గొప్ప. ఎందుకంటే కవి తన అనుభవాల్ని రాస్తాడు. కానీ సినీ కవి మాత్రం తనది కాని అనుభవాల్నీ రాస్తుంటాడు. అందుకే నేను సినీ కవి అయినందుకు గర్వపడుతున్నా' అని సిరివెన్నెల చెప్పారు.

అందుకే నా స్టయిల్లో నటించా


మమ్ముట్టి

'నాకంటూ ప్రత్యేకంగా డ్రీమ్ రోల్ అంటూ ఏదీ లేదు. కానీ ప్రతి పాత్రని డ్రీమ్ రోల్‌గానే భావిస్తాను. ప్రతి సినిమాకి ఒకేలా హార్డ్ వర్క్ చేస్తాను. ప్రతిభ ఉన్నా కష్టపడనిదే ఏదీ రాదు' అని అంటున్నారు మమ్ముట్టి. మలయాళ మెగాస్టార్‌గా పేరొందిన ఆయన చాలా గ్యాప్ (సూర్య పుత్రులు, స్వాతికిరణం) తర్వాత 'యాత్ర' చిత్రంతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో వైఎస్ పాత్రలో మమ్ముట్టి నటించారు. మహి.వి.రాఘవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం మమ్ముట్టితో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు 'నవచిత్రం' పాఠకుల కోసం..

చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నటించడాన్ని ఎలా ఫీలవుతున్నారు?

– తెలుగులో నటించి దాదాపు రెండు దశాబ్దాలకు పైనే అవుతుంది. ఈ గ్యాప్‌లో వచ్చిన తెలుగు అవకాశాల్లో ఏ పాత్ర నాకు సరైనదిగా అనిపించలేదు. ఏదీ నన్ను ఎగ్జైట్ చేయలేదు. ఇది నచ్చింది, చేశాను. 'యాత్ర' చిత్రంతో మళ్ళీ తెలుగులో నటించడం చాలా చాలా సంతోషంగా ఉంది.

ఈ సినిమా చేయడానికి ప్రత్యేక కారణాలేంటి?

– నాకు రాజశేఖర్‌రెడ్డి తెలియదు. కానీ కథ, పాత్ర బాగా నచ్చాయి. దర్శక, నిర్మాతలు ఫుల్ స్క్రిప్ట్‌తో వచ్చారు. ఫుల్ కాన్ఫిడెంట్‌తో కథ చెప్పారు. సినిమా తీయగలమనే నమ్మకం వాళ్ళల్లో ఉంది. దీనికితోడు స్ట్రాంగ్ నిర్మాత ఉన్నారు. నో చెప్పడానికి నాకేమీ కారణాలు కనిపించలేదు. అందుకే ఒప్పుకున్నా. అయితే ఇది బయోపిక్ కాదు. ఈవెంట్ బేస్డ్ బయోపిక్. గతంలో నేను చేసిన 'బాబా సాహెబ్ అంబేద్కర్', బషీర్ బయోపిక్‌లు ఈ తరహాలోనే ఉంటాయి.

దర్శకుడు మహి.వి.రాఘవ్ మీకు చెప్పినట్టే తీశాడా?

– నా కెరీర్‌లో ఇప్పటి వరకు సుమారు 380 సినిమాల్లో నటించా. 70 మంది కొత్త దర్శకులను పరిచయం చేశా. వారిలో 90 శాతం దర్శకులు మలయాళంలో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. తమిళంలోనూ ఇద్దరు దర్శకులున్నారు. కొత్తవాళ్ళతో చేయడం నాకు అలవాటే. వారితో పోల్చితే మహికి రెండు సినిమాలు చేసిన అనుభవం ఉంది. ఇది బెటరే కదా!. చెప్పినట్టే సినిమా తీశాడు.

వైఎస్ పాత్ర కోసం మీరేమైనా రీసెర్చ్ చేశారా?

– లేదు. దర్శకుడు మహి మంచి స్క్రిప్ట్ రాశారు. పాత్ర గురించి బాగా చెప్పారు. నేను చేసింది కేవలం పాత్ర సోల్ పట్టుకోవడమే. దాని ప్రకారం నటించేశా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లెజెండరీ పర్సన్. ఆయన్ని అనుకరించడం కష్టం. నేను మిమిక్రీ చేయదలుచుకోలేదు. ఆయనలా చేస్తే సక్సెస్ కాలేం. అందుకే నా స్టయిల్‌లోనే నటించాను.

పాదయాత్ర సన్నివేశాల్లో నటించేటప్పుడు మీలో కలిగిన ఫీలింగ్ ఏంటీ?. మీ రాష్ట్ర సమస్యలు గుర్తుచ్చాయా?

– ప్రజా సమస్యలు ఎక్కడైనా ఒక్కటే. భాషలు వేరు కావచ్చు, కానీ పేదరికం ఒకేలా ఉంటుంది. పాద యాత్ర షూటింగ్ టైమ్‌లో సమస్యలు విన్నప్పుడు కొన్నిసార్లు చాలా ఎమోషనల్ అయినప్పటికీ నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ ముందుకు సాగాను. పాదయాత్ర సాగిన విధానం ఒక్కటే చెబితే జనం చూడరు. అందులో జరిగిన సంఘటనలు, భావోద్వేగాలు సినిమాలో ఉంటాయి.

తెలుగులో డబ్బింగ్ చెప్పడం కష్టంగా అనిపించిందా?

– ప్రయత్న లోపం లేకుండా 100 శాతం ఎఫర్ట్స్ పెట్టి డబ్బింగ్ చెప్పాను. ఎలా ఉందనేది ప్రేక్షకులు చెప్పాలి. మనం భారతీయులం. భావ ఉచ్చారణలో తేడా ఉన్నా. భావాలు, భావోద్వేగాలు ఒక్కటే. భాష పరంగా తెలుగు, మలయాళంలో చాలా పదాలు ఒకేలా ఉంటాయి. దీంతో పెద్దగా కష్టమేమీ అనిపించలేదు. సాధ్యమైనంత వరకు ఎక్కువ భాషలు మాట్లాడాలనుకుంటాను. తమిళంలో ఓ సినిమా చేశా. దానికి కూడా నేనే డబ్బింగ్ చెప్పాను.

తెలుగు ఇండస్ట్రీలో ఎలాంటి మార్పుని గమనించారు?

– తెలుగు పరిశ్రమే కాదు, కాలానుగుణంగా అన్ని పరిశ్రమలు మారుతున్నాయి. తెలుగులో ఇటీవల కమర్షియల్ సినిమాలతోపాటు ఇన్నోవేటివ్ కథలొస్తున్నాయి. ప్రయోగాలు చేస్తున్నారు. గొప్ప సినిమాలు చేస్తున్నారు. బాగా విస్తరించింది. ఇక్కడ కూడా మంచి స్నేహితులున్నారు. ఇటీవల 'రంగస్థలం', 'భరత్ అనే నేను' సినిమాలు చూశా. బాగా నచ్చాయి.

నటుడిగా ఎలా అప్‌డేట్ అవుతుంటారు?

– సినిమాల్లోనే కాదు, నటనలోనూ అప్‌డేట్ అవ్వాలి. మనల్ని మనం రీ ఎవాల్వ్ చేసుకోవాలి. మనల్ని మనం కనుక్కోవాలి. మన తప్పుల్ని సరిదిద్దుకోవాలి. ఇంకా బెటర్‌గా ఎలా చేయొచ్చో నిత్యం శ్రమించాలి. ప్రతిభ ఒక్కటే సరిపోదు, హార్డ్ వర్క్ కూడా చేయాలి. నన్ను నేనెప్పుడూ రీ ఇన్వెంట్ చేసుకుంటాను. మీరు 1980కి చెందిన హీరో కదా అని ఎవరైనా అడిగితే, నో.. నేను 2018కి చెందిన హీరోనని చెబుతాను (నవ్వుతూ).

మీకంటూ ఏమైనా డ్రీమ్ రోల్స్ ఉన్నాయా?

– కథ, పాత్ర, దర్శకుడు, నిర్మాత, పారితోషికం ఇలా అన్నీ నచ్చాలి (నవ్వుతూ). ప్రత్యేకంగా డ్రీమ్ రోల్స్ అంటూ ఏం లేవు. ప్రతి పాత్ర డ్రీమ్ రోలే. ప్రతి సినిమాకి ఒకేలా కష్టపడతాం. అయితే ఏదీ ప్లాన్ చేసుకోం. నేనే కాదు, ఏ నటుడైనా సెలక్టీవ్‌గానే వెళ్తాడు. మంచి పాత్రలు, కథలు వస్తే తెలుగులోనూ సినిమాలు చేసేందుకు నేను సిద్ధమే.

ఇంజనీరింగ్ విద్యార్థులకు అంకితం


దొమ్మరాజు ఉదయ్‌కుమార్, రఘురాజ్

'రొమాంటిక్ లవ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా '4 లెటర్స్' చిత్రాన్ని రూపొందించాం. వినోదంతోపాటు సందేశాన్ని అందిస్తుంది. ఈ చిత్రాన్ని ఇంజనీరింగ్ విద్యార్థులకు అంకితమిస్తున్నాం' అని అంటున్నారు దర్శక, నిర్మాతలు రఘురాజ్, ఉదయ్ కుమార్. ఈశ్వర్, అంకిత, టువ హీరోహీరోయిన్లుగా ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మించిన చిత్రం '4 లెటర్స్'. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయబోతున్నారు.


ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు రఘురాజ్ మాట్లాడుతూ, 'బేసిక్‌గా మాది మ్యూజికల్ ఫ్యామిలీ. దర్శకత్వంతోపాటు రైటింగ్, ఎడిటింగ్, ఫొటోగ్రఫీలో పట్టు సాధించాను. 13వ ఏట నుంచే రాయడం ప్రారంభించా. 320కిపైగా షార్ట్ స్టోరీస్ రాశా. మాది విజయవాడే అయినా నేను పుట్టి పెరిగింది చెన్నైలో. విదేశాల్లో స్టడీ చేశా. తమిళనాడులో ఏడేండ్లు సీనియర్ జర్నలిస్ట్‌గా పనిచేశాను. పలు ప్రముఖుల ఇంటర్వ్యూలు చేశా. నా ఇన్వెస్టిగేటివ్ కథనాలు తమిళనాడులో షేక్ చేశాయి. దీంతోపాటు బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫీ చేశా. అందులో 4 అంతర్జాతీయ అవార్డులని కూడా అందుకున్నా. రజనీకాంత్, కమల్ హాసన్‌తోపాటు అనేక మంది మోడల్స్ ఫొటోషూట్ చేశా. తొలిసారి 'కలుసుకోవాలని' సినిమాకి దర్శకత్వం వహించాను. ఆ తర్వాత స్టడీస్ కోసం లండన్ వెళ్ళా. తిరిగొచ్చి తమిళం, కన్నడలో 10 సినిమాలను రూపొందించాను. ఎడిటింగ్‌లోనూ మంచి నైపుణ్యం ఉంది. చాలా రోజుల తర్వాత కమ్‌బ్యాక్ ఫిల్మ్‌గా '4 లెటర్స్'ని తెరకెక్కించా. నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా, కొత్త పాయింట్‌తో సినిమా ఉంటుంది. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ప్రేమలో ఎక్కువగా బ్రేకప్స్ ఉంటాయి. ఇది లవ్ ఎట్ సెకండ్ సైట్‌ని తెలిపే చిత్రం. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రారంభమై, ఫ్యామిలీ అనుబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరుగుతుంటుంది. మంచి రొమాంటిక్ లవ్ కామెడీ అని చెప్పొచ్చు. స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ఇందులో చాలా కొత్తరకమైన అచీవ్‌మెంట్స్ ఉంటాయి. 'టైటిల్'కి, తొమ్మిది పాత్రలకి మధ్య సంబంధం ఉంటుంది. హీరో ఫాదర్‌కి 'పూర్' అనే నాలుగు అక్షరాలు నచ్చవు, హీరోయిన్ మదర్‌కి 'రిచ్' అనే నాలుగు అక్షరాలు నచ్చవు, హీరోయిన్‌కి 'లవ్' అనే నాలుగు అక్షరాలు, హీరోయిన్ తండ్రి ఫెయిల్ తప్ప మరేది అనుభవించడు. ఇలా నాలుగు అక్షరాలు 9 పాత్రలకీ సంబంధం ఉంటుంది. వాటి ఆధారంగా టైటిల్ పెట్టాం. మరో ఆసక్తికర అంశం ఉంటుంది. అదేంటనేది తెరపై చూడాల్సిందే' అని అన్నారు.

నిర్మాత ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, 'మేం సినిమా తీయాలని ప్లాన్ చేస్తున్న సమయంలో రఘురాజ్ ఈ కథ చెప్పారు. నచ్చి నిర్మించాం. మా అబ్బాయి ఈశ్వర్‌కి హీరో కావాలని ఉంది. వైజాగ్ సత్యానంద్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. డాన్సులు, ఫైట్స్‌తో పాటు సంగీతం పరంగా పలు విభాగాల్లో నైపుణ్యం సాధించాడు. థియేటర్ కూడా చేశాడు. పలు కార్యక్రమాలు ఇచ్చాడు. ఈ సినిమాకి దర్శకుడు కొత్త నటీనటులని తీసుకోవాలనుకుంటున్నప్పుడు మా అబ్బాయి గురించి చెప్పడంతో మరో మాట లేకుండా ఓకే చేశారు. నటీనటులు కొత్తవాళ్ళైనా అనుభవం ఉన్న యాక్టర్స్‌లా బాగా నటించారు. దర్శకుడు చెప్పినదాని కంటే చాలా బాగా తెరకెక్కించారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ అయినప్పటికీ అన్ని వర్గాలకి నచ్చుతుంది. ఇప్పుడు ఇంజనీరింగ్స్ ఎక్కువైపోతున్నారు. వారిని చిన్నచూపు చూస్తున్నారనే విషయాలను ఇందులో చర్చించాం. అంతేకాదు ఈ చిత్రాన్ని వారికి అంకితం ఇస్తున్నాం. కచ్చితంగా ఆడియెన్స్‌కి బాగా నచ్చుతుందని భావిస్తున్నాం. ఈ నెల రెండో వారంలో విడుదలకి ప్లాన్ చేస్తున్నాం. ఆదరించాలని కోరుతున్నాం' అని అన్నారు.

దత్తత తీసుకుంటా..


అదితి రావు హైదరీ

'నాకు చిన్న పిల్లలంటే చాలా ఇష్టం. ఎప్పట్నుంచో ఏడెనిమిది మంది పిల్లల్ని దత్తత తీసుకోవాలనుకుంటున్నా' అని అంటోంది అదితి రావు హైదరీ. 'చెలియా', 'సమ్మోహనం', 'నవాబ్', 'అంతరిక్షం' వంటి చిత్రాల్లో నటించి నటిగా అదితి మంచి గుర్తింపు పొందింది. దక్షిణాదిలో పలు ఆసక్తికర ప్రాజెక్ట్‌ల్లో భాగమవుతున్న అదితి చిన్నపిల్లల్ని దత్తత తీసుకోవాలనుందని తన మనసులోని మాటని వెల్లడించింది. 'చిన్న పిల్లలంటే నాకు చాలా ఇష్టం. ఓ ఏడెనిమిది మంది పిల్లల్ని దత్తత తీసుకోవాలనే ఆలోచన గత కొన్ని రోజులుగా నా మదిలో మెదులుతోంది. అయితే ఈ విషయాన్ని ఎవరితోనూ షేర్ చేసుకోలేదు. అవకాశం వచ్చినప్పుడు త్వరలో ఈ పని చేసి తీరుతా. దత్తత తీసుకున్న విషయం మీడియాకి వెల్లడించడం ఇష్టం లేదు. దాన్ని నా మైండ్‌లోనే ఉంచుకుంటా' అని తెలిపింది. ప్రస్తుతం తమిళంలో 'సైకో' చిత్రంలో నటిస్తోంది. అలాగే ధనుష్ దర్శకత్వం వహించబోయే చిత్రంలోనూ అదితి ఎంపికైందట.


'ఎదురీత' చిత్రంలో మాస్టర్ చరణ్‌రామ్, శ్రవణ్ రాఘవేంద్ర

ఆదరణతో థియేటర్లు పెరుగుతున్నాయ్


ప్రియాంత్

ప్రియాంత్, యామిని భాస్కర్ జంటగా రమణ మొగిలి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కొత్తగా మా ప్రయాణం'. ఇటీవల విడుదలైన సినిమాకి మంచి టాక్ వస్తున్న నేపథ్యంలో శుక్రవారం చిత్ర బృందం సక్సెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో ప్రియాంత్ మాట్లాడుతూ, 'మా సినిమా రెండో వారంలోకి అడుగు పెట్టడం చాలా హ్యాపీగా ఉంది. అయితే మొదట థియేటర్స్ దొరకలేదు. 30 థియేటర్లలోనే విడుదల చేశాం. సినిమాకి మంచి టాక్ రావడంతో ఇప్పుడు థియేటర్లు పెరుగుతున్నాయి. శుక్రవారం నుంచి 55 థియేటర్ల వరకు పెంచుతున్నాం. ప్రేక్షకులకి సినిమా బాగా నచ్చింది. కథ, కథనం బాగా వచ్చింది. ప్రధానంగా సినిమాలో కంటెంట్ ఆడియెన్స్‌కి నచ్చుతుంది. ఇది మరింత మందికి రీచ్ కావాలి. అలాగే మా సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'సినిమా సక్సెస్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది. ప్రియాంత్ కొత్తవాడైనా అనుభవం ఉన్న నటుడిగా నటించాడు. ఆదరిస్తున్న ఆడియెన్స్‌కి కృతజ్ఞతలు' అని రామకృష్ణ తెలిపారు. నటుడు రామారావు చెబుతూ, 'టైటిల్ చాలా కొత్తగా ఉంది. ఆడ, మగ కలిసి ఎంజాయ్ చేయడం కాదు. భార్యభర్తలుగా ఉండాలని చెప్పే సందేశం ఆకట్టుకుంటుంది. భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ సినిమా మరింత పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'హీరో మరిన్ని మంచి చిత్రాల్లో నటించాలి' అని దేవేందర్ తెలిపారు.

మానవ సంబంధాల నేపథ్యంలో ఒకటే లైఫ్


జితన్ రమేష్, శృతియుగల్

జితన్ రమేష్ (ఆర్.బి.చౌదరి తనయుడు) హీరోగా ఎం.వెంకట్ దర్శకత్వంలో లార్డ్ వెంకటేశ్వర ఫిల్మ్స్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్న చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అనేది ఉపశీర్షిక. శృతి యుగల్ కథానాయికగా నటిస్తోంది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ, 'టెక్నాలజీ పేరుతో పరిగెడుతున్న నేటి తరం, హ్యూమన్ రిలేషన్స్‌కి, ఎమోషన్స్‌కి ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాం. అమ్రీష్ అందించిన పాటలకి ఆదరణ చాలా బాగుంది. ఆర్.ఆర్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సెన్సార్ వాళ్ళు చూసి మంచి సినిమా తీశారని మమ్మల్ని మెచ్చుకున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని సినిమా అలరిస్తుంది' అని అన్నారు.

'సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'యు/ఏ' సర్టిఫికేట్ పొందింది. దర్శకుడు సినిమాని తెరకెక్కించిన విధానం హైలైట్‌గా నిలుస్తుంది. టీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు మా చిత్ర ట్రైలర్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. పాటలు బాగా వచ్చాయి. ఆర్.బి. చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. డిస్ట్రిబ్యూటర్స్ మంచి రేటుకి అడుగుతున్నారు. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని నిర్మాత నారాయణ్ రామ్ తెలిపారు.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే మలుపులు

త్రిధా చౌదరి, సిద్ధి ఇద్నాని, ధన్య బాలకృష్ణ, కోమలి ప్రసాద్ కథానాయికలుగా ఓ చిత్రం రూపొందుతుంది. బాలు దర్శకత్వంలో బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్ పతాకంపై హిమబిందు వెలగపూడి నిర్మిస్తున్నారు. ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి దర్శకుడు బాలు మాట్లాడుతూ, 'మహానగరంలో నివసించే నలుగురు అమ్మాయిల కథే ఈ సినిమా. స్వతంత్ర భావాలున్న నలుగురి జీవితాల్లో ఏం జరిగిందనేది ఆసక్తికరం. జనవరిలో హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెల రెండో వారంలో గోవాలో మొదలు కానున్న రెండో షెడ్యూల్‌లో రెండు పాటలు, కీలక సన్నివేశాల, యాక్షన్ సీక్వెన్స్‌లని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నెలాఖరుకి గోవా షెడ్యూల్ పూర్తవుతుంది. మార్చిలో హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. మే నెలలో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానుగుణంగా వచ్చే మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శేఖర్ గంగమోని, సంగీతం: రఘు కుంచె, ఎడిటింగ్: నాగేశ్వర్ రెడ్డి.


ధన్య బాలకృష్ణ, సిద్ధి ఇద్నాని, త్రిధా చౌదరి, కోమలి ప్రసాద్

సువర్ణసుందరికి వైవిధ్యమైన ప్రమోషన్


సూర్య ఎం.ఎస్.ఎన్, ఎల్లుమహంతి, సాయికార్తీక్

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రధారులుగా సూర్య ఎమ్.ఎస్.ఎన్ దర్శకత్వంలో ఎస్.టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎమ్.ఎల్.లక్ష్మి నిర్మిస్తున్న చిత్రం 'సువర్ణసుందరి'. సినిమా త్వరలో విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఇటీవల చిత్ర బృందం కార్ల ర్యాలీని ప్రారంభించారు. దర్శకుడు మాట్లాడుతూ, 'సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'చరిత్ర భవిష్యత్‌ని వెంటాడుతోంది' అనే క్యాప్షన్‌తో సినిమాని తెరకెక్కిస్తున్నాం. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా థీమ్ పోస్టర్స్‌తో కార్లని సిద్ధం చేసి ఏపీ, తెలంగాణ అంతటా ట్రావెల్ అయ్యేలా పబ్లిసిటీ చేస్తున్నాం. దీంతోపాటు మరిన్ని వైవిధ్యమైన కాన్సెప్ట్‌లతో సినిమాని ప్రేక్షకులకి చేరువయ్యేలా చేస్తున్నాం. ఈ నెల 5న చిత్ర ట్రైలర్‌ని విడుదల చేయనున్నాం. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటకి మంచి స్పందన లభించింది' అని అన్నారు.

'దర్శకుడు సూర్య అత్యంత ప్రతిష్టాత్మకంగా, క్వాలిటీగా సినిమాని తెరమీదకి తీసుకొస్తున్నారు. దాదాపు 45 నిమిషాల పాటు ఉండే గ్రాఫిక్ వర్క్ ఆకట్టుకుంటుంది. సినిమా ఆలస్యానికి గ్రాఫిక్సే కారణం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా అలరిస్తుంది' అని సంగీత దర్శకుడు సాయి కార్తీక్ తెలిపారు. సినిమాటోగ్రాఫర్ ఎల్లు మహంతి చెబుతూ, 'నేను పనిచేసిన చిత్రాలతో పోల్చితే బెస్ట్ వర్క్ ఈ సినిమాలోనే ఉంది. వందల కోట్ల బడ్జెట్‌కి ఏమాత్రం తగ్గని కంటెంట్, క్వాలిటీ ఉన్న చిత్రమిది' అని చెప్పారు.

యూత్‌కి కనెక్ట్ అయ్యే సరికొత్త కథనం


మోహిని, అరవింద్

అరవింద్, మోహినిలని హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ జో శర్మ, మెక్విన్ గ్రూప్ యుఎస్ఏ సహకారంతో వడ్లపట్ల సినిమాస్ సమర్పణలో మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల నిర్మిస్తున్న చిత్రం 'లవ్ 20-20'. వి.ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'సరికొత్త కథాంశంతో సినిమాని రూపొందిస్తున్నాం. యూత్‌కి కనెక్ట్ అయ్యే విధంగా 'లవ్ 20-20' టైటిల్‌ని ఖరారు చేశాం. 2012 మిస్ టీన్ కెనడా విన్నర్ మోహిని కథానాయికగా నటించడం విశేషం. ప్రస్తుతం సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. బెంగుళూర్, నాగర్హొలే నేషనల్ పార్క్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి(కేరళ), హైదరాబాద్ వంటి తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిపాం. శుక్రవారం నుంచి ఈ నెల 6 వరకు నేవీ ముంబయిలోని ముఖ్య ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్‌తోపాటు ఫైనల్ సాంగ్‌ని చిత్రీకరించనున్నాం. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. త్వరగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్‌లో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అన్నదాత ఆవేదన

పరిహారం, 'గిట్టుబాటు' కోసం ఆందోళన

నవతెలంగాణ-కొండపాక/ హుస్నాబాద్ టౌన్/ ఎల్లారెడ్డిపేట / సంగారెడ్డి టౌన్

భూములకు తగిన పరిహారం, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు ఆందోళన బాటపట్టారు. ప్రాజెక్టుకు ముందుగా సహకరించి భూములిచ్చినందుకు తక్కువ పరిహారంతో తమకు అన్యాయం చేస్తారా అని మల్లన్నసాగర్ నిర్వాసితులు రెండోరోజూ పనులను అడ్డుకున్నారు. 'పరిహారం ఇవ్వకుండానే పనులెలా చేస్తారు? భూములు, ఇండ్లు కోల్పోయి ఆగమైనం' అంటూ గౌరవెల్లి ప్రాజెక్టు పనులనూ రైతులు అడ్డుకున్నారు. కాగా, తమకు ఉన్న కొద్దిపాటి భూమిలోంచి మిషన్ కాకతీయ కాలువ తీస్తే ఏం చేసి బతకాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో రైతులు రాస్తారోకో

చేశారు. అలాగే, పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రాజెక్టుకు ముందుగా సహకరించి భూములిచ్చినందుకు ఎకరాకు రూ.6లక్షలే ఇచ్చారని సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామస్తులు శుక్రవారం కూడా ఆందోళన చేశారు. గురువారం పనులడ్డుకోవడంతో తహసీల్దార్, పోలీసు లు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వినలేదు. కలెక్టరేట్ చేరుకుని వినతిపత్రం అందజేశారు. అయినా, ఎలాంటి హామీ లభించకపోవడం తో రెండో రోజూ ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. తమకు కూడా ఎకరానికి రూ.11.4లక్షలు ఇచ్చే వరకు పనులు చేయొద్దని హెచ్చరించారు. వేములఘాట్ గ్రామంలో మాదిరిగానే తమకూ అన్నీ సమకూర్చాకే పనులు చేసుకోవాలన్నారు. దీనికి తోడు అక్కన్నపేట మండలంలో నిర్మిస్తున్న గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితులూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పనులడ్డగింత

'భూములు పోయినయి. పరిహారం ఇవ్వకుండా అధికారులు నివేదికలతో కాలయాపన చేస్తున్నరు. మాకు న్యాయం చేస్తారా లేదా? మా మీద ఇంత మన్ను పోసి ఇక్కడే బొంద పెట్టుండ్రి. అప్పుడైనా సర్కార్ కనికరిస్తది' అని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం పంపిణీలో అన్యాయం, పునరావాసం జాడ లేకపోవడంతో పాటు నష్టపరిహారం పొందే జాబితాలో తమ పేర్లు లేవని శుక్రవారం సుమారు 150మంది ప్రాజెక్టు పనులడ్డుకున్నారు. కట్ట పనుల వద్ద బైటాయించారు. హుస్నాబాద్ ఆర్డీవో అనంతరెడ్డి కలెక్టర్‌కు సమాచారమందించారు. కలెక్టర్ ఆదేశానుసారం అక్కన్నపేట తహసీల్దార్ నాగజ్యోతి ఎస్ఐ పాపయ్య నాయక్‌తో కలిసి బాధితుల దగ్గరకు వచ్చారు. వారిని చూసిన నిర్వాసితులు 'తక్షణం పరిహారం ఇస్తేనే ఇక్కడకు రావాలి. లేదంటే వెళ్లిపోండి. మాటలతో మభ్యపెట్టొద్దు" అని హెచ్చరించారు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకే వచ్చామనీ, సమస్య చెబితే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామనీ తహసీల్దార్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా కదల్లేదు. చివరకు తహసీల్దార్ సమస్యను కలెక్టర్‌కు వివరించారు. రెండ్రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.

మిషన్ కాకతీయ కాలువల పనులు ఆపాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు కింద చేపడుతున్న మిషన్ కాకతీయ కాలువ పనులు ఆపాలని బాధిత రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ భూముల నుంచి కాలువల నిర్మాణమైతే జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గిద్దెచెరువు కింద భాగం నుంచి కోరుట్లపేట వరకు కాలువ పనులకు అధికారులు చేపట్టిన సర్వేను అడ్డుకున్నామన్నారు. ఈ కాలువ వద్దని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసినా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. తమ పొలాల నుంచి కాలువ తీస్తే భూనష్టం జరగడమే కాకుండా ఆ కాలువ ఆయకట్టు కింద కొన్ని ఎకరాలు మాత్రమే సాగులోకి వస్తాయన్నారు. తమ పొలాల సమీపంలోని పై, కింది ఆయకట్టుల్లో ఉన్న భూములు అన్ని కమర్షియల్ భూములుగా మార్చి ఇంటి స్థలాల కోసం ప్లాట్లు ఏర్పాటు చేసుకుంటున్నామనీ, అందుకే కాలువను నిర్మించొద్దనీ డిమాండ్ చేశారు. అనంతరం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి, ఇన్‌చార్జి కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గొల్ల పల్లి జయరాజు మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధర, రుణాలు, నకిలీ విత్తనాల బెడద, మార్కెట్ సమస్యలు, రుణమాఫీ, రీషెడ్యూల్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. అప్పులు తీర్చేదారిక లేకనే ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సదాశివపేట మండలంలోనే తొమ్మిది మంది రైతులు సంవత్సర కాలంలో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ చేయాలన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన పంటలన్నీ ఎండిపోయాయనీ, నష్టపోయిన రైతులకు భూపేందర్‌సింగ్ హూడా కమిషన్ సిఫార్సుల ప్రకారం ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలన్నారు. చెరుకు రైతులకు



సరైన సమయంలో పర్మిట్లు అందక ఇబ్బందులెదుర్కొంటున్నారని తెలిపారు. కంది రైతులకు కూడా బకాయిలు చెల్లించడం లేదని చెప్పారు. ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షులు బి.నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు మన్నె రామాంజనేయులు, నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎం.కిష్టయ్య, బి.మల్లేశం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

నవతెలంగాణ - కొండాపూర్/ఇల్లంతకుంట



అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకు న్నారు. ఈ ఘటనలు సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో శుక్రవారం జరిగాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామానికి చెందిన రామంతపూర్ మల్లయ్య (62) అదేగ్రామానికి చెందిన అంజిరెడ్డి దగ్గర 15 ఏండ్ల నుంచి ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మల్లయ్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. కుటుంబపో షణకు, కూతుళ్ల పెండ్లికి రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయం చేసి అప్పు తీర్చాలనుకున్నా ప్రతియేటా నష్టం వాటిల్లింది. ఈ సారీ అదే పరిస్థితి తలెత్తింది. పెట్టుబడులకు తీసుకున్న అప్పు, అంతకుముందున్న అప్పు వడ్డీల తో కలిపి రూ.5లక్షలు దాటాయి. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య కౌలుకు తీసుకున్న భూమిలో ఉన్న మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాదవరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన ఎంద్ర కనకయ్య(40) నాలుగేండ్లుగా అదే గ్రామంలో నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తిపంట సాగు చేస్తున్నాడు. రూ.4లక్షల వరకు అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. పంట దిగుబడి రాక అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల విషయంలో భార్య తారతో గురువారం గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కుమారుడు మహేష్, కూతురు సుస్మిత ఉదయాన్నే పాఠశాలకు వెళ్లాక, ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

కూలర్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

- అదుపులోకి రాని మంటలు.. శంషాబాద్‌లో ఘటన



నవతెలంగాణ - శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సాతంరాయి పారిశ్రామికవాడలో ఉన్న కూలర్ గోదాములో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గోదాములో ఉన్న కూలర్లు, పలు రకాల మెటీరియల్ కాలిపోయాయి. ఎస్ఐ ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం.. సాతంరాయి పారిశ్రామికవాడలో సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి కూలర్ల దందా సాగిస్తున్నారు. అక్కడ గోదాం ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం గోదాములో షార్ట్‌సర్క్యూట్‌తో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. సిబ్బంది బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పేందుకు అగ్ని మాపక సిబ్బంది తీవ్రంగా యత్నించారు. రాత్రి 9 గంటల వరకూ మంటలు అదుపులోకి రాలేదు. ఎంత ఆస్తి నష్టం జరిగిందనేది తెలియలేదు.

బడ్జెట్‌లో ఓట్ల బేరం..!

(మొదటిపేజీ తరువాయి)

వారికి పలు వరాలను ప్రకటించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఎన్నికల వేళ వారికి బడ్జెట్ తాయిలాల రూపంలో ఓట్ల బేరం పెట్టిందనే చెప్పాలి. గడిచిన నాలుగేండ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా కార్పొరేట్ సంస్థల లబ్దియే లక్ష్యంగా పని చేసిన మోడీ సర్కారుకు.. ఇప్పుడు హఠాత్తుగా ఎన్నికల వేళ బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు తాయిలాలు ప్రకటించడం ప్రజలను ఆశ్చర్యపరిచింది.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్యం కోసం అమెరికా వెళ్ళిన కారణంగా ఆయన స్థానంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రైతు రుణ మాఫీ, కొత్త సంక్షేమ పథకాలు, పన్ను మినహాయింపులతో ఓటర్లను బుజ్జగించే ప్రయత్నం బడ్జెట్‌లో జరిగింది. బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట సరికొత్త పథకాన్ని ప్రకటించింది. 01-12-2018 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు మోడీ సర్కారు బడ్జెట్‌లో ప్రకటించింది. 01-12-2018వ తేదీ నుంచి ఈ పథకం వర్తించనుంది. దీని ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6000 నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 12కోట్ల సన్న, చిన్నకారు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. తొలి విడతలో భాగంగా 1 డిసెంబరు 2018 నుంచి 31 మార్చి 2019 మధ్యకాలానికి రూ.2వేలు రైతుల ఖాతాలో జమ కానుంది. ఈ పథకం అమలుకై ఏడాదికి రూ.75వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుందని మోడీ సర్కారు తెలిపింది. తొలి విడత మొత్తం 2019 ఎన్నికలకు ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతాయి. రెండు అంతకన్నా తక్కువ హెక్టార్ల (5 ఎకరాలు) భూమిని సాగుచేసుకుని జీవిస్తున్న రైతు కుటుంబాలకు ఆర్థిక అండ అందించేందుకు ఈ పథకం తీసుకొచ్చారు. ఇప్పటికే తెలంగాణలో రైతు బంధు పేరుతోనూ, ఒడిషాలో కలియా పేరుతోనూ అమలవుతున్న పథకాల తరహాలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. తెలంగాణలో ఏడాదికి రూ.8 వేలు, ఒడిషాలో ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆయా ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్నాయి.

మధ్యతరగతికి పన్ను రాయితీల మాయ

"పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గించాలని నేను ప్రతిపాదించాను. సాంప్రదాయం ప్రకారం ముఖ్యమైన పన్ను ప్రతిపాదనలు ప్రధాన బడ్జెట్‌లో ప్రవేశపెడతారు. చిన్న చిన్న పన్నులు చెల్లించేవారు, మధ్యతరగతి, పెన్షనర్లు ఏడాది ప్రారంభంలోనే ఖచ్చితమైన నిర్ణయాన్ని తెలుసుకుంటారు" అని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ అన్నారు. ఇకపై వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందుతారని గోయల్ తెలిపారు. ఏడాదికి రూ.6.5 లక్షల ఆదాయం వున్నవారు ఎటువంటి ఆదాయం పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని, సెక్షన్ 80 సి కింద మినహాయింపు పొందవచ్చునని తెలిపారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40 వేల నుండి రూ. 50 వేలకు పెంచినట్లు గోయల్ తెలిపారు. 3 కోట్ల మంది వేతన జీవులు, పెన్షనర్లు రూ.4 వేల కోట్ల వరకు అదనంగా పన్ను ప్రయోజనం పొందనున్నారని గోయల్ తెలిపారు. అంటే దాదాపు రూ.18,500 కోట్లు విలువైన పన్ను వసూళ్ళు మాఫీ చేసినట్టు తెలిపారు.

మెప్పించుకొనేందుకు మెగా పెన్షన్ పథకం

"అసంఘటిత రంగంలోని పలు పరిశ్రమలలో దాదాపు42 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి సమగ్ర సామాజిక భద్రతను కల్పిస్తున్నాం" అని గోయల్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఇతర పథకాల ద్వారా కల్పిస్తున్న ఆరోగ్య రక్షణకు అదనంగా ప్రభుత్వం మెగా పెన్షన్ పథకాన్ని ప్రకటించింది. దీని "ప్రధాన మంత్రి శ్రమ యోగి యోజన"అని పేరు పెట్టింది. నెలకు రూ.15 వేలు ఆదాయం పొందుతున్న అసంఘటిత రంగ కార్మికులకు కొత్త పథకాన్ని వర్తింస్తుంది. ఈ పథకం కింద కార్మికులు 60 ఏళ్లు నిండిన అనంతరం నెలకు రూ.3 వేలు పెన్షన్ పొందుతారు. అయితే వీరు 60 ఏళ్ళ వయస్సు వచ్చే వరకు నెలకు రూ.100లు చెల్లించాలి. దీనివల్ల అసంఘటిత రంగంలో ఉన్న 10 కోట్ల మంది కార్మికులకు లబ్ది చేకూరనున్నదని గోయల్ తెలిపారు. రైతులు ప్రకృతి విపత్తుల ప్రభావానికి లోనైనప్పుడు ఇచ్చే రుణ సహాయంపై 2 శాతం వడ్డీ, సకాలంలో చెల్లించిన వారికి 3 శాతం వడ్డీ మినహాయింపు రాయితీలు ఇవ్వనున్నాం" అని ఆయన తెలిపారు.

పెరుగనున్న ద్రవ్య లోటు

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటును 10 బేసిస్ పాయింట్లు తక్కువకు అంటే 3.4 శాతంగా గోయల్ సూచించారు. ఇప్పటికే మార్కెట్లు దీనికి అనుగుణంగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. అయితే ఊహించిన విధంగా 3.3 శాతం పరిమితికి కట్టుబడి ఉండలేకపోయామని తెలిపారు. 3.5 లేదా 3.6 శాతంగా ఉండవచ్చునని విశ్లేషకులు పేర్కొన్నారు.రైతు ఆదాయ మద్దతు పథకం ప్రవేశపెట్టినందున 3.3 శాతం ద్రవ్య లోటు లక్ష్యాన్ని చేరుకోలేమని గోయల్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. జీఎస్టీ అంశాన్ని ఆయన ప్రస్తావించకపోయినప్పటికీ, దాని వసూళ్ళు కూడా సరిగా లేవు. అవి సరిగా వసూలయి ఉంటే ద్రవ్య లోటు అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఉండేదని పరోక్షంగా తెలిపారు..

పెరిగిన పన్ను రిటర్నులు

ఆదాయం పన్నుకు సంబంధించి రిటర్న్లు దాఖలు 80 శాతం పెరిగాయని గోయల్ తెలిపారు. "వారి విరాళాలను పేదలకు సేవ చేసేందుకు వినియోగిస్తాం. ఆదాయపన్ను శాఖను కంప్యూటరీకరించాం. రిటర్న్లు, ఎస్సెస్‌మెంట్స్, ఫండ్స్ అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. గత ఏడాది ఆన్‌లైన్‌లో 99.54 శాతం రిటర్న్లు దాఖలయ్యాయి" అని గోయల్ తెలిపారు. ప్రత్యక్ష పన్నులు, ఆదాయపు పన్ను విషయాల్లో గతంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. నగదు రహిత ఆదాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఊహించిన పన్ను రేటు 8 శాతం నుండి 6 శాతానికి తగ్గింది. ఆదాయం పన్ను ఊరటకు సంబంధించి గోయల్ పేర్కొన్న విషయాలన్నీ గతానికి సంబంధించినవి. గృహ కొనుగోలు దారులకు ప్రభుత్వం జీఎస్టీని తగ్గించనున్నట్లు తెలిపారు. అయితే దానిని ఇప్పుడు ప్రకటించలేదు.

జూమ్‌లో పౌర విమానయానం

మౌలిక వసతుల అభివృద్ధి దేశానికి వెన్నెముక వంటిదని గోయల్ తెలిపారు. "పరిణామాత్మక విజయాలు సాధించడానికి వృద్ధిని దాటి వెళ్ళాం. ఉడాన్ యోజన పథకం వల్ల ఎవరైనా విమానంలో ప్రయాణించవచ్చు. విమానాశ్రయాల సంఖ్య త్వరలోనే 100కు చేరుకోనున్నది. గత ఐదేళ్ళ కాలంలో దేశీయ విమాన యానం రెట్టింపు అయింది" అని ఆయన అన్నారు.

ఈశాన్య రాష్ట్రాలపై ప్రేమ

"ఈశాన్య రాష్ట్రాల ప్రజలు మౌలిక సదుపాయాల ప్రయోజనాలు పొందనున్నారు. మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాలు తొలిసారిగా దేశ రైల్వేల మ్యాప్‌లో స్థానం సంపాదించుకోనున్నాయి" అని గోయల్ తెలిపారు.ఈశాన్య రాష్ట్రాలకు 2020 ఆర్థిక సంవత్సరంలో 20 శాతం పైగా బడ్జెట్‌ను పెంచనున్నట్లు తెలిపారు. అంటే దాదాపు రూ.58,166 కోట్లు కేటాయించనున్నట్లు ఆయన చెప్పారు.

మూడు లక్షల కోట్ల రక్షణ బడ్జెట్

రక్షణ శాఖకు తొలిసారిగా 2020 ఆర్థిక సంవత్సరం కేటాయింపులు రూ.3 లక్షల కోట్లు దాటనున్నట్లు గోయల్ తెలిపారు. గత ఏడాది ఈ బడ్జెట్ రూ.2.95 లక్షలకోట్లు మాత్రమే ఉన్నదన్న విషయాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు.

పాడి పరిశ్రమ-ఆవులు

రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకానికి ఈ ఏడాది రూ.750 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు గోయల్ తెలిపారు. 'గోకుల్ మిషన్' పేరుతో అమల్లోకి రానున్న ఈ ప్రత్యేక పథకానికి రూ.750కోట్లు కేటాయించారు. గో ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన ఉత్తమజాతి ఆవుల ఉత్పత్తికి కృషి చేయనున్నారు. ఆవుల సంక్షేమాన్ని కూడా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ పర్యవేక్షించనుంది.

25 కోట్ల మంది ప్రజలను ఆకర్షించేలా..

ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మోడీ సర్కారు అన్నదాతలను బుట్టలో వేసుకొనేలా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకం , ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్‌తో పాటు ఆదాయపు పన్ను పరమితి పెంపు వంటి ప్రధాన ప్రజాకర్షక ప్రకటనలతో దాదాపు 25 కోట్ల మంది ప్రజలను తమ బుట్టలో వేసుకొనే ప్రయత్నం చేసింది. బడ్జెట్‌లో 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్' నిధి పేరుతో రైతుబంధు వంటి పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద ఏకంగా 12 కోట్ల మంది రైతులకు ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తామని ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టినా అమలు మాత్రం గత ఏడాది డిసెంబర్ నుంచి పరిగణనలోకి తీసుకొంటామని తెలిపింది. అంటే, 2019 మార్చి నాటికి రైతుల ఖాతాల్లో రూ.2వేల నగదు పడుతుందన్నమాట. అంటే ఎన్నికల ముందు సరిగ్గా రైతుల్లో బీజేపీ పట్ల ఒక సానుకూల దృక్పథాన్ని ఏర్పరుచుకోనే యత్నం మోడీ సర్కారు చేసిందని చెప్పొచ్చు. ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పథకం. 60 ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వచ్చే విధంగా దీన్ని రూపొందించారు. నెలసరి ఆదాయం రూ.15వేల లోపు ఉండే వారు నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60ఏళ్ల తర్వాత రూ.3వేల పింఛన్ అందుతుంది. ఈ నిర్ణయంతో వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది ప్రయోజనం పొందుతారని వీరి ఓట్లు తమకే పడతాయన్న ఆలోచనతో సర్కారు దీనిని అందుబాటులోకి తెచ్చింది. దీనికి తోడు తీవ్ర అసంతృప్తితో ఉన్న మధ్య తరగతి, ఉద్యోగులు, విద్యావంతుల ఆకర్షణకు ఆదాయపు పన్ను పరిమితి పెంపు రూపంలో ఆకర్షించే ప్రయత్నం చేసింది. రూ.5లక్షల వరకు ఆదాయంపై పన్నును పూర్తిగా తొలగించింది. ఇప్పటి వరకు మినహాయింపు పరిధిని కొద్దికొద్దిగా పెంచుతూ వచ్చిన ప్రభుత్వం ఒక్కసారిగా ఇంత మొత్తంలో పెంచడం విశేషం. దీనికి తోడు గ్రాట్యూటీ, స్టాండర్డ్ డిడక్షన్, గహ రుణ చెల్లింపులు, చెల్లించిన అద్దెకు పన్ను మినహాయింపులు వంటి వాటిని ప్రకటించింది. దీంతో దాదాపు 3 కోట్ల మందికి పైగా లబ్ధి కలుగుతుందని తద్వారా వీరిని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేసింది.

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సరికొత్త రికార్డు

- రవాణా, రైల్వే ర్యాకుల లోడింగులోనూ..

హైదరాబాద్ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పదినెలలో(జనవరి వరకు) గతేడాది ఇదే కాలంతో పోల్చితే.. బొగ్గు ఉత్పత్తి, రవాణా, రైల్వే ర్యాకుల లోడింగులో మెరుగైన వృద్ధిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం(2017-18) జనవరి వరకు 483 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి 519లక్షల టన్నులను ఉత్పత్తి చేసి గతేడాది కంటే ఏడు శాతం అధిక వృద్ధిని నమోదు చేసింది. గత జనవరి ముగింపునాటికి 528 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపగా, ఈ ఏడాది జనవరి నాటికి 554లక్షల టన్నులను రవాణా చేసి గతేడాది కంటే 5శాతం వృద్ధి సాధించినట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని(552లక్షల టన్నులు)ను సాధించినట్టయింది. జనవరి నెలలో అత్యధికంగా 1243రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా జరిపి ఆల్ టైం రికార్డు నెలకొల్పింది. గతేడాది జనవరి ముగింపునాటితోపోల్చితే రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణాలో 2.62శాతం వృద్ధిని కనబర్చింది. అలాగే మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండో యూనిట్ జనవరి నెలలో 100శాతం పిఎల్ఎఫ్ సాధించగా, ఒకటో యూనిట్ 96.47శాతం పిఎల్ఎఫ్ సాధించింది.

క్యాస్టింగ్ కౌచ్‌పై మీ వైఖరేంటి ?

- సర్కారుకు హైకోర్టు ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమలో మహిళా కళాకారులపై లైంగిక వేధింపులు, దోపిడీలపై విచారణ, నివారణకు, వారి సంక్షేమం కోసం తీసుకునే చర్యల నిమిత్తం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు అంశంపై స్పందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి క్యాస్టింగ్ కౌచ్‌పై విచారణకు చర్యలు తీసుకునే అంశంపై ప్రభుత్వం, తన స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని నోటీసులు ఇచ్చింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. తెలుగు సినీ మహిళా కళాకారులపై లైంగిక దోపిడీ ఘటనలపై విచారణ, వారి సంక్షేమం కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సామాజిక ఉద్యమకారిణి సంధ్యారాణి, మహిళా హక్కులపై పోరాడే ఆయా రంగాలకు చెందిన మహిళా ఉద్యమకారులతోపాటు మరో ఆరుగురు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలను శుక్రవారం ధర్మాసనం మరోసారి విచారించింది. మొత్తం వ్యవహారాలపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని, ఒత్తిడిని నివారించేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉండేలా చేసేందుకు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేయించాలని పిటిషనర్ న్యాయవాది వసుధా నాగరాజ్ వాదించారు. మహిళ, కార్మిక, హోంశాఖ అధికారులతోపాటు మహిళా హక్కుల ఉద్యమ నేతలు, పేరెన్నికగన్న మహిళా న్యాయవాదులు, తెలుగు సినీ పరిశ్రమలోని మహిళా కళాకారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఇలాంటి కేసుల విషయంలో దర్యాప్తునకు ఎలాంటి కమిటీ ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) గత ఏడాది ఒక కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి అందజేసిందని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదన్నారు. దీనిపై ప్రభుత్వం వివరాలతో కౌంటర్ వేస్తామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్ కుమార్ చెప్పారు. వాదనల అనంతరం విచారణ 12కి వాయిదా పడింది.

వీడీసీ మరో దుశ్చర్య

- వారితో మాట్లాడితే రూ.50 వేల జరిమానా
- నిత్యావసరాలు ఇవ్వకుండా నిషేధాజ్ఞలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నవతెలంగాణ- భీమ్‌గల్

నిజామాబాద్ జిల్లాలో వీడీసీల దుశ్చర్య మరొకటి వెలుగులోకొచ్చింది. నందిపేట్ మండలం మారంపల్లిలో దళిత కుటుంబాలను బహిష్కరించిన ఘటన మరవకముందే శుక్రవారం మరో ఘటన బయటపడింది. గొర్లు, మేకల ఎరువు ఇవ్వనందుకు భీంగల్ మండలం పల్లికొండ వీడీసీ గొల్లకుర్మలపై గ్రామ బహిష్కరణ విధించింది. గ్రామంలో వీరితో ఎవరూ మాట్లాడొద్దనీ, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను, కిరాణా దుకాణాల్లో నిత్యావసరాలు ఇవ్వొద్దనీ హుకూం జారీ చేసింది. ఎవరైనా దీన్ని అతిక్రమిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. బాధితులు శుక్రవారం భీంగల్ సీఐ, ఎస్ఐకి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గతంలోనూ వీడీసీకి మేకలు ఇచ్చే విషయమై గొల్లకుర్మలను బహిష్కరించారు.

ఆర్మూర్ డివిజన్‌లోని భీంగల్ మండలం పల్లికొండ గ్రామంలో 42 గొల్లకుర్మ కుటుంబాలున్నాయి. వీరిలో 17 కుటుంబాలకు గొర్లు, మేకలున్నాయి. కాగా, ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మంద నిలిచినప్పటి ఎరువు(పేడ) వీడీసీకి ఇవ్వాలని నిర్ణయించారు. అలా వచ్చిన ఎరువును అమ్మాలని తీర్మానించారు. కానీ, పొలాల్లో వేసుకునేందుకు ఎరువు తమకే కావాలని గొల్లకుర్మలు అన్నారు. దాంతో తమ నిర్ణయాన్నే ధిక్కరిస్తారా? అని గ్రామాభివృద్ధి కమిటీ గొల్లకుర్మలను బహిష్కరించింది. దాంతో గ్రామంలో వారికి నిత్యావసర సరుకులు ఎవరూ అమ్మడం లేదు. కనీసం పాలు కూడా పోయట్లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలాల్లో పనులకు ట్రాక్టర్లను రానివ్వడం లేదని వాపోయారు. తమ నిర్ణయాన్ని అతిక్రమించిన వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తామని వీడీసీ హెచ్చరించడంతో తమతో ఎవరూ మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఐ, ఎస్ఐకి వినతిపత్రం ఇచ్చారు.

గతంలోనూ బహిష్కరణ

గ్రామంలో గొర్లు, మేకలు పెంచుకుంటున్నందుకు కాపరులంతా కలిసి వీడీసీ యేడాదికి 8 మేకలు ఇచ్చేవారు. అవి సరిపోవట్లేదన్న భావనతో ఒక్కో గొర్రె, మేకకు రూ.100 ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు గొల్లకుర్మలు నిరాకరించడంతో గతంలో సైతం వీరిని బహిష్కరించారు. పోలీసులు వచ్చి రాజీ కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది. కాగా ఈ ఏడాది వీడీసీ కమిటీ మారింది. కొత్త కమిటీ కూడా గొల్లకుర్మలను వేధింపులకు గురిచేస్తోంది.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

తొలిరోజు 46,566 మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం 386 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయని తెలిపారు. 46,566 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాల్లో ప్రాక్టికల్ పరీక్షలను జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఉన్నత స్థాయి కమిటీ, పరిశీలకులు పర్యవేక్షించారని తెలిపారు. ఈ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

వెనిజులాలో అమెరికా జోక్యం తగదు

- అంతర్జాతీయ న్యాయసూత్రాలకు ట్రంప్ తిలోదకాలు
- అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం సదస్సులో సురవరం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనిజులాలో అంతరంగిక సంక్షోభం పేరుతో అక్కడ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వ వ్యవహారంలో అమెరికా జోక్యం చేసుకోవడం తగదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మదురో ప్రభుత్వాన్ని కూలదోసి గుమ్‌డో తానే అధ్యక్షునిగా ప్రకటించుకుంటే ఆయనకు అమెరికా మద్దతు పలికి అమెరికా అధ్యక్షులు ట్రంప్ అంతర్జాతీయ న్యాయసూత్రాలకు తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. అఖిల భారత శాంతి-సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజబహదూర్‌గౌర్ హాల్‌లో కేవీయల్ అధ్యక్షతన సదస్సు శుక్రవారం జరిగింది. సురవరం మాట్లాడుతూ..వెనిజులా ప్రభుత్వ వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుని తన సామ్రాజ్యవాద వైఖరిని చాటుకున్నదని, తద్వారా ప్రపంచ శాంతికి విఘాతం కలిగే చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ప్రపంచంలో కార్పొరేట్ కంపెనీలు ఆయా ప్రాంతాల్లోని ప్రగతిశీల ప్రభుత్వాలను కూలదోసి తమ కనుసన్నల్లో నడిపే పాలకులను అధికారంలోకి తీసుకొచ్చే చర్యలను ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు ఖండించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..వెనిజులాలోని ఆయిల్ నిక్షేపాలపై పట్టు కోసం అమెరికా ఈ కుట్రలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఏఐపీఎస్ఓ జాతీయ అధ్యక్షులు కె.యాదవరెడ్డి మాట్లాడుతూ..వెనిజులా విషయంలో అలీనదేశాల నాయకునిగా మోడీ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జి.రఘుపాల్ మాట్లాడుతూ ప్రపంచశాంతి, ప్రజాస్వామ్యం కోసం ఉద్యమించాలన్నారు. ఏఐపీఎస్ఓ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ..అన్నిదేశాలను తన గుప్పిట్లో పెట్టుకోవాలని అమెరికా చూస్తోందని, దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, ఉమామల్లేష్, కాచం సత్యనారాయణ, శ్రీశైలం, వెంకటేష్‌గౌడ్, పి.రవికిషోర్, కృష్ణకుమారి, రామనారాయణ, కమలాదేవి, కరుణ, రాపోలు సుదర్శన్, పి.వీరస్వామి, వహీద్, జ్యోలియస్ సీజర్, పల్లె నరసింహ, బి.నాగభూషణం, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచేలా శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ టూర్స్

- మలేషియా, సింగపూర్ పర్యటనలు విజయవంతం

హైదరాబాద్ : విద్యార్థులను అన్ని విధాలా సమర్థులుగా తీర్చి దిద్దేందుకు శ్రీచైతన్య మరో ముందడుగు వేసింది. వినోదం, వికాసం, విజ్ఞానంతోపాటు ప్రపంచ అవగాహన పెంచేలా శ్రీచైతన్య ఎనిమిదిరోజులపాటు మలేషియా, సింగపూర్‌లలో విజయవంతంగా విజ్ఞాన పర్యటనలు చేసింది. ఈ పర్యటనలో 105 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో మలేషియా పురాతన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడంతోపాటు, మలేషియా, సింగపూర్‌ల అభివృద్ధి కారకాలను విద్యార్థులు అధ్యయనం చేశారు. జూబ్లీ హిల్స్ శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులకు ప్రపంచాన్ని పరిచయం చేసే ఇలాంటి దేశ విదేశ పర్యటనలు.. వారు గ్లోబల్ సిటిజన్స్‌గా మారడానికి దోహదపడతాయని శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బిఎస్ రావు తెలిపారు. వచ్చే జూన్‌లో అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో జరిగే అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశాలకు విద్యార్థులను సమాయత్తం చేస్తున్నట్టు శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▲212	నిఫ్టీ ▲62	డాలరుకు రూపాయి విలువ	బంగారం (10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)			
36,469	10,893	71.08	రూ. 33,282	రూ. 40,657	హైదరాబాద్	418	విజయవాడ	423
					ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
					వరంగల్	420	ముంబయి	473

ఐటీ పరిమితి పెంపులోనూ కిటుకు ఉంది!



న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం చెబుతున్న ఆదాయపు (ఐటీ) పన్ను ఊరట ప్రకటన వెనుక కిటుకు ఉన్నట్టుగా ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెరుగుదల' లో ఉన్న అసలు నిజాన్ని గమనించాలన్న వాదన వినిపిస్తున్నారు. శుక్రవారం నాడు ఆర్థిక మంత్రి గోయల్ చేసిన పన్ను మినహాయింపు ప్రకటన ప్రకారం రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నపుడు మాత్రమే పూర్తిగా పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ ఈ పరిమితి రూ. 5 లక్షలను దాటిన పక్షంలో పన్నుకు అర్హమైన ఆదాయాన్ని.. ప్రస్తుత స్లాబ్ రేట్లను అనుసరించి టాక్స్ వసూలు చేస్తారు. అంటే ఉదాహరణకు ఒక వ్యక్తి వార్షికాదాయం మినహాయింపులు పోను రూ. 6 లక్షలు అనుకుందాం. అలాంటి తరుణంలో పై లక్ష రూపాయలు మాత్రమే పన్నుకు అర్హమైన ఆదాయం అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న స్లాబ్ రేట్ల ప్రకారం... రూ. 2.5 లక్షలు– రూ.5 లక్షల వరకు ఆదాయం ఉన్నట్లయితే దానిపై 5 శాతం పన్ను విధిస్తారు. అంటే 12,500 రూపాయలు అన్నమాట. ఒకవేళ రూ. 5 లక్షలకు పైబడి ఒక్కరూపాయి ఉన్నాసరే మిగిలిన లక్ష రూపాయల మొత్తానికి 20 శాతం అంటే రూ. 20 వేలు కట్టాల్సి ఉంటుంది. అంటే 12,500 రూపాయలకు అదనంగా మరో 20 వేలు మొత్తంగా 32,500 రూపాయలు పన్ను రూపంలో సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇందులో వేతన జీవులు అంతగా సంతోషించదగ్గ విషయం ఏమీ లేదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌బీఐ ఫలితాలు అదుర్స్




ముంబయి: దేశంలో అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బాకీలు తగ్గడంతో గత ఏడు సంవత్సరాల్లో ఏ త్రైమాసికంలోనూ లేని విధంగా 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.3,954.81 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.2,416.34 కోట్ల నష్టాలు చవి చూసింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ.3,200 కోట్ల లాభాలు నమోదు చెయ్యొచ్చని తొలుత మార్కెట్ విశ్లేషకులు అంచనా వేశారు. దీనికి భిన్నంగా అంచనాలు మించి మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో బ్యాంకు మొండి బాకీల కోసం కేటాయింపులు 68 శాతం తగ్గి రూ.6,006.22 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 8.71 శాతానికి తగ్గాయి. 2017 డిసెంబర్ ముగింపు నాటికి జీఎన్‌పీఏ 10.35 శాతంగా నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం క్యూ3లో రూ.4,532 కోట్ల కొత్త మొండి బాకీలు నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకు నికర వడ్డీపై ఆదాయం (ఎన్ఐఐ) 19.28 శాతం పెరిగి రూ.22,290.99 కోట్లకు చేరింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.18,687.52 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది.

పక్కాగా అమ్మేస్తాం..!

పీఎస్‌యుల్లో డిజిన్వెస్ట్‌మెంట్‌పై ముందుకే..

- **80వేల కోట్ల వాటాల విక్రయమే లక్ష్యంగా ముందుకు: బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్**



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కంపెనీల్లో వాటాల విక్రయ లక్ష్యాన్ని తప్పకుండా చేరుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిజిన్వెస్ట్‌మెంట్‌పై మాట్లాడుతూ 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్ల వాటాలను విక్రయిస్తామన్నారు. పిఎస్‌యులను పారదర్శకంగా తయారు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 57 కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీలు (సీపీఎస్ఈ) స్టాక్ మార్కెట్‌లో లిస్టెడ్ అయి ఉన్నాయని తెలిపారు. వీటి మార్కెట్ కాపిటలైజేషన్ రూ.13 లక్షల కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మార్చితో ముగియనున్న ఏడాదిలో రూ.80,000 కోట్ల వాటాలను ఉపసంహరించుకోనున్నామని వెల్లడించారు. 2018-19లో ఇప్పటి వరకూ ఇందులో రూ.35,100 కోట్ల వాటాలను విక్రయించామన్నారు. ఈ సమయంలో ఆర్ఐటిఇఎస్, ఐఆర్‌కాన్ ఇంటర్నేషనల్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్‌ను ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు తీసుకురావడం ద్వారా రూ.17,000 కోట్లు సమీకరించామని వివరించారు. భారత్22 ఈటీఎఫ్‌లో ఫర్‌ధర్ ఫండ్ ఆఫర్ (ఎఫ్ఎఫ్ఓ) ద్వారా రూ.8,300 కోట్ల ఈక్విటీలను విక్రయించామన్నారు. అదే విధంగా భెల్, కొచ్చిన్ షిప్‌యార్డ్, నాల్కో, ఎన్ఎల్‌సీ ఇండియా, కియోసిఎల్ తదితర కంపెనీల్లో బైబ్యాక్ షేర్ ఆఫర్లను చేపట్టామని వెల్లడించారు. 2017-18లో తమ ప్రభుత్వం పిఎస్‌యుల్లో రూ.1 లక్ష కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించిందన్నారు.

ప్రపంచంలోనే మన దగ్గరే డేటా చార్జీలు తక్కువ

గత ఐదేళ్లలో మొబైల్ డేటా వినియోగం 50 రెట్లు పెరిగిందని పియూష్ గోయల్ తెలిపారు. డిజిటల్ రంగంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రపంచంలోనే డేటా, ఫోన్ ఛార్జీలు భారత్‌లో తక్కువగా ఉన్నాయన్నారు. 2019-20లో టెలికం రంగం రెవెన్యూ రూ.41,519.76 కోట్లకు చేరనుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9,416.42 కోట్లు తగ్గి రూ.39,245 కోట్లుగా నమోదు కావొచ్చు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.48,661.42 కోట్ల రెవెన్యూ నమోదయ్యింది.

ఎయిరిండియాకు రూ.1300 కోట్లు

ఎయిరిండియా రుణాల కోసం రూ.1300 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఎయిరిండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్‌కు చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ కింద ఈ మొత్తాన్ని అందించనున్నట్లు తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీన్ని రెట్టింపు చేసి రూ.2,600 కోట్ల కేటాయింపులకు చేర్చనున్నట్లు వెల్లడించింది. వచ్చే 2030 నాటికి దేశ రవాణ రంగంలో విద్యుత్ వాహనాలు కీలకంగా మారనున్నాయని పియూష్ పేర్కొన్నారు. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి 10 రెట్లు పెరిగిందన్నారు.

చిన్న పరిశ్రమలకు మొండి చెయ్యి..

దేశ ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి అత్యంత కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్ఎంఈ)లకు మోడీ సర్కార్ తన బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెద్దగా ఈ రంగాల ఊసే ఎత్తలేదు. 2016 నవంబర్‌లో చేపట్టిన రూ.500, రూ.1000 నోట్ల రద్దు, 2017 జులై నుంచి అమలు చేస్తున్న జీఎస్టీ వల్ల ఎస్ఎంఇలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఎస్ఎంఇలకు 59 నిమిషాల్లోనే కోటి రూపాయల రుణం, వడ్డీలో రెండు శాతం రాయితీ అని మధ్యంతర బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ.. ఇది గతేడాది దీపావళి సమయంలో ప్రకటించిన పథకమే. 72,000 ఎంఎస్ఎంఇలకు ఈ రుణాలు అందేలా చూస్తామని ఆ సమయంలో మోడీ హామీ ఇచ్చారు. కాని మధ్యంతర బడ్జెట్‌లో ఎన్ని సంస్థలకు ఈ రుణాలిచ్చారో గోయల్ వెల్లడించలేదు. 2017-18 ఆర్థిక సర్వే ప్రకారం మొత్తం పారిశ్రామిక రుణాల్లో 82.6 శాతం లేదా రూ.26,04,100 కోట్లు కార్పొరేట్లకు ఇచ్చారు. కాగా ఎంఎస్ఎంఈ రంగానికి 17.4 శాతం లేదా రూ.4,500 కోట్ల మేర రుణాలు మాత్రమే ఇచ్చారు. ఈ మధ్య కాలంలో ఎన్‌బిఎఫ్‌సిల్లో చోటు చేసుకుంటున్న సంక్షోభాలు చిన్న పరిశ్రమలపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి.

మిశ్రమ స్పందన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కార్పొరేట్, పారిశ్రామిక వర్గాల్లో మిశ్రమ స్పందన కనిపించింది. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు మద్దతు చేస్తుందని పేర్కొన్నారు. రైతులకు, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చేలా ఉందని అన్నారు. అయితే చిన్న పరిశ్రమలను పట్టించుకోలేదన్న ఆవేదనను వ్యక్తం చేశారు.

రుణ సమాచారం లేదు : ఎఫ్ఐఎస్ఎంఈ

59 నిమిషాల్లో కోటి రూపాయల రుణం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇది వరకూ, తాజాగా బడ్జెట్‌లోనూ పేర్కొందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎఫ్ఐఎస్ఎంఈ) సెక్రటరీ జనరల్ అనీల్ భరద్వాజ్ పేర్కొన్నారు. అయితే ఈ పథకంలో ఇప్పటి వరకు ఎంత మందికి, ఎంత మొత్తం అప్పులిచ్చారో సమాచారం లేదన్నారు. ఈ రంగానికి ఆర్థిక ప్రోత్సాహం అవసరమన్నారు.

వృద్ధికి దోహదం: సీఐఐ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వృద్ధి రేటుకు మద్దతు చేయనుందని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అభిప్రాయపడ్డారు. బలమైన వినిమయం అవసరం. రైతులు, మధ్యతరగతి కోసం చాలా ప్రకటించారన్నారు.

15 కోట్ల మందికి లబ్ధి : ఫిక్కీ

మధ్యంతర బడ్జెట్ వల్ల 15 కోట్ల మంది లబ్ధి పొందనున్నారని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని పేర్కొన్నారు. ఇందులో 12 కోట్ల మంది రైతులు, 3 కోట్ల మంది వేతనాలు జీవులు ఉన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న 95 శాతం మంది కార్మికులకు లబ్ధి పొందనున్నారన్నారు.

కొనుగోలు శక్తి పెరగనుంది : ఎస్‌బీఐ

ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు చేర్చడం సంతోషకరమని, దీని వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరగనుందని ఎస్‌బిఐ ఛైర్‌పర్సన్ రజ్నీష్ కుమార్ పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక మద్దతును అందించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డిపాజిట్లపై టిడిఎస్ పరిమితిని పెంచడం వల్ల కొత్త డిపాజిట్లు పెరగనున్నాయన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మద్దతు: కేపీఎంజీ

ప్రస్తుత బడ్జెట్ వల్ల గ్రామీణ ప్రాంత రంగాలు నిలదొక్కుకోనున్నాయని కెపిఎం జి ఇండియా ఛైర్మన్ అరుణ్ ఎం కుమార్ పేర్కొన్నారు.అదే విధంగా మధ్య తరగతిపై భారం తగ్గనుంది. ఆర్థిక వ్యవస్థ విస్తరించడానికి దోహదం చేయనుంది.

అవకాశాన్ని జారవిడువం: అపోలో హాస్పిటల్స్

కేంద్ర ప్రభుత్వం అందించాలనుకున్న అందరికీ ఉచిత వైద్యం అంకితభావంతో కూడిందని అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తామూ జారవిడుచుకోబోమని తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ లాభాల్లో 45% వృద్ధి



నవతెలంగాణ, వాణిజ్య విభాగం

ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ 2018 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 45 శాతం వృద్ధితో రూ.485.20 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.334.4 కోట్ల లాభాలను నమోదు చేసింది. డాక్టర్ రెడ్డీస్ శుక్రవారం 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఫలితాలను వెల్లడించింది. ఈత్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 1 శాతం పెరిగి రూ.3,850 కోట్లకు చేరింది. తమ కంపెనీ మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను నమోదు చేసిందని డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ సీఈవో, కో ఛైర్మెన్ జీవీ ప్రసాద్ పేర్కొన్నారు. కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, నిర్వహణ విధానంలో మెరుగుదల లాభదాయకతకు దోహదం చేశాయన్నారు.


ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటమి తప్పదు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నరేంద్ర మోడీ సర్కారు ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌తో ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్లాది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న సీపీఎస్ గురించి స్పందించని ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు నెలకు రూ.300 పింఛన్ ఇస్తామని చెప్పటం ఒక బూటకమని పేర్కొన్నారు. నాలుగున్నరేండ్లుగా రైతులు, కార్మికుల పట్ల శత్రుపూరితంగా వ్యవహరించిన కేంద్రం ఎన్నికల ముందు వారి బాధలు గుర్తుకు రావడం ప్రభుత్వ కపట బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. ఈపీఎస్ కింద కార్మికులకు రూ.6000 కనీస పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే కేంద్రం మొక్కుబడిగా కేవలం రూ. 1000 ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతన అంశం ప్రస్తావనకే రాలేదని వాపోయారు. పెట్టుబడిదారులు కోట్లాది రూపాయలు లాభాలు గడుస్తున్నా సీలింగ్ పెట్టని కేంద్రం..కార్మికుల పీఎఫ్, బోనస్, గ్రాట్యూటీ, ఈఎస్ఐలపై ఎందుకు సీలింగ్ పెడుతున్నదని ప్రశ్నించారు. ఐదెకరాలలోపు భూములున్న రైతులకు ఏడాది రూ.6 వేలు ఇస్తామని చెప్పటడం అంటే రోజుకు రూ.15 ఇచ్చి బతకమని చెప్పడమేనని వివరించారు. రూ.15తో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఎమ్ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కార్మిక, కర్షకలకు పిలుపునిచ్చారు.

ఐఐటీ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- స్నేహితుడికి సూసైడ్ నోట్ మెయిల్



నవతెలంగాణ–కంది

ఐఐటీ విద్యార్థి క్యాంపస్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితునికి సూసైడ్ నోట్ మెయిల్ చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బోయిన్‌పల్లిలో స్థిరపడిన ఎం.అనిరుధ్య(22) తల్లిదండ్రుల స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. అనిరుధ్య కంది ఐఐటిలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతూ క్యాంపస్‌లో ఉంటున్నాడు. అర్ధరాత్రి వరకు హాస్టల్‌లోనే ఉన్న అనిరుధ్య 12గంటల45 నిమిషాలకు క్యాంపస్‌లోని ఏడో అంతస్తు డిబ్లాక్ నుంచి కిందకు దూకాడు. వెంటనే గమనించిన సిబ్బంది అతనికి క్యాంపస్‌లో అత్యవసర చికిత్స అందజేసి అనంతరం సంగారెడ్డిలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందాడు. అయితే, ముందుగా ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయాడని కళాశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు భావించారు. కానీ ఆత్మహత్యకు ముందు 12గంటలకు అదే కళాశాలకు చెందిన కన్నిక్‌రెడ్డికి మెయిల్ చేసిన సూసైడ్‌నోట్ బయటపడింది. సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పార్లమెంటు ఎన్నికలపై ఫోకస్

మందకృష్ణకు కాంగ్రెస్ ఆఫర్..!

- వరంగల్ బరిలో దించేందుకు పావులు
- ఎంపీ నందిఎల్లయ్య స్థానంలో సతీష్ మాదిగ
- తెరపైకి పలువురు నేతల పేర్లు






నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలపై ఏఐసీసీ ఫోకస్ చేసింది. రెండు, మూడు రోజుల్లో పార్లమెంటు అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ చేయనుంది. రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొనేందుకు వ్యూహారచన చేయబోతున్నది. రాబోవు ఎన్నికలను రాష్ట్ర నాయకులపై వదిలేయకుండా అధిష్టానమే నేరుగా కసరత్తు ప్రారంభించనున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. అధికార పార్టీని అన్ని విధాలుగా ఎదుర్కొనే నాయకులను ఎంపిక చేయాలని భావిస్తోంది. ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను హస్తం గుర్తుపై పోటీ చేయాలని ఆఫర్ ఇచ్చినట్టు పార్టీలు తెలిపాయి. వరంగల్ పార్లమెంటు నుంచి పోటీ చేయాలని కూడా అడిగినట్టు తెలిసింది. గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పార్టీ నుంచి సస్పెండ్ కావడంతో పార్టీ ఈ దిశగా ఆలోచన చేస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. దీనిపై మందకృష్ణ ఇంకా తన నిర్ణయాన్ని చెప్పలేదని తెలిసింది. నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉన్న నంది ఎల్లయ్య వయసు అయిపోవడం ఆయన పోటీ చేసే అవకాశం లేదని పార్టీ వర్గాలు చెప్పాయి. ఆయన స్థానంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీష్ మాదిగకు అవకాశం కల్పిస్తారని పార్టీ నేతల్లో చర్చ మొదలైంది. ఆయనకు రేవంత్‌రెడ్డి, డికె అరుణ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. పెద్దపల్లి నుంచి అద్దంకి దయాకర్, సత్యనారాయణ పేర్లు పరిశీనలో ఉన్నాయి. అద్దంకి దయాకర్ ఇప్పటికే లోక్‌సభకు పోటీ చేయబోతున్నట్టు ప్రకటించారు. పైగా తక్కువ ఓట్లతో ఓడిపోయారనే సానుభూతి కూడా ఆయనకు కలిసొచ్చే అవకాశం ఉంది, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో గెలుస్తామనే భరోసా లేదు కానీ ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలపై దృష్టి సారించాలని భావిస్తున్నది. ఈ జిల్లాల్లో అభ్యర్థుల విషయంలోనూ అత్యంత జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ నేతలు అంటున్నారు. ముఖ్యంగా ఖమ్మం నుంచి కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి పేరు వినిపిస్తున్నది. టీడీపీతో పొత్తు ఉంటే మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుకే దక్కనుంది. మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎస్టీ రిజర్వుడ్ సీట్లు కావడంతో ఒకటి కోయ, మరొకటి లంబాడకు ఇచ్చే అవకాశం ఉన్నది. అందులో బలరాంనాయక్, రవీంద్రనాయక్,బెల్లయ్యానాయక్, రమేష్ రాథోడ్, నరేష్ జాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నల్లగొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి, భువనగిరి నుంచి మధుయాష్కీగౌడ్, గూడూరునారాయణరెడ్డి, కత్తి వెంకటస్వామి లేదా రాజగోపాల్‌రెడ్డి సూచన మేరకు మరెవరికైనా ఇచ్చేఅవకాశం ఉందన్న చర్చ జరుగుతున్నది. మహబూబ్‌నగర్ నుంచి రేవంత్‌రెడ్డి, డికె అరుణ పేర్లు తెరపైకి వస్తున్నాయి. అక్కడ కాకపోతే రేవంత్‌కు మల్కాజిగిరి బరిలోకి దిగే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కరీంనగర్ నుంచి మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, నెరేళ్ల శారద, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వరరెడ్డి, జహీరాబాద్ నుంచి సురేష్‌షట్కర్‌లకు దక్కే అవకాశం ఉన్నది. సికింద్రాబాద్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, అంజన్‌కుమార్, హైదరాబాద్ నుంచి ఫిరోజ్‌ఖాన్, ఎండీ గౌస్ పేర్లు తెరపైకి వస్తున్నాయి. నిజామాబాద్ నుంచి మధుయాష్కీ భువనగిరికి మారితే అక్కడి నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఓటుకు నోటు కేసులో కదలిక

- వేం నరేందర్‌రెడ్డికి ఈడీ నోటీసులు
- వారం రోజుల్లో తమ ముందు హాజరుకావాలని ఆదేశం



నవ తెలంగాణ– ప్రత్యేక ప్రతినిధి

ఓటుకు నోటు కేసులో మరోసారి కదలిక వచ్చింది. ఈ కేసులో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డిని విచారణ కోసం తమ ముందు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో ధీర్ఘకాలంగా స్థబ్ధంగా ఉన్న ఈకేసులో తిరిగి చలనం వచ్చినట్టయ్యింది. దాదాపు నాలుగేండ్ల క్రితం టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన వేం నరేందర్‌రెడ్డి గెలుపు కోసం టీఆర్ఎస్ నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఓటు కోసం రూ. 50 లక్షలు ఇస్తూ అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం పూర్తిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలిసే జరిగిందని, అందుకు ఆయన స్టీఫెన్‌సన్‌తో మాట్లాడిన ఆడియో టేప్‌ను టీఆర్ఎస్ నాయకులు బయటపెట్టడంతో ఆ సమయంలో సంచలనం రేపింది. అంతేగాక రేవంత్‌తో పాటు మరో టీడీపి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మరో ఐదుగురిని కూడా ఏసీబీ నిందితుల జాబితాలో చేర్చింది. అయితే ఈ కేసులో తాను నిర్దోషినంటూ జెరూసలెం మత్తయ్య హైకోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకోగా, దానిపై ఏసీబీ సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో అక్కడ ఈ అంశం విచారణలో ఉంది. మరో వైపు ఏపీ ముఖ్యమంత్రిని కూడా ఈ కేసులో విచారించాలని కోరుతూ ఏపీలో వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యంపైనా విచారణ సాగుతున్నది. ఈ నేపథ్యంలోనే స్టీఫెన్‌సన్ ఓటును ఖరీదు చేయడానికి ఇవ్వజూపిన దాదాపు నాలుగు కోట్లలో రూ. 50 లక్షలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు డబ్బును సమకూర్చారు, ఎక్కడి నుంచి ఆ డబ్బు తెచ్చారనే కోణంలో ఏసీబీ దర్యాప్తు సాగింది. సుదీర్ఘంగా సాగిన ఈ దర్యాప్తులో చివరికి ఈ డబ్బు హవాలా రూపంలో విదేశాల నుంచి టీడీపీ నాయకులు సమకూర్చారని ఏసీబీకి కొంత ఆధారాలు చిక్కినట్టు సమాచారం. దీంతో ఈ దిశగా ఈ కేసును దర్యాప్తు జరపాలని కోరుతూ రాష్ట్ర ఏసీబీ కేంద్ర హోంశాఖకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు లేఖ రాసింది. దీంతో ఈడీ అధికారులు ఈ దిశగా రంగంలోకి దిగి ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న రేవంత్‌రెడ్డికి గతంలో నోటీసులు జారీ చేసి విచారించారు. తాజాగా టీడీపి నాయకుడు వేం నరేందర్‌రెడ్డికి కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. వారం రోజులలోపు తమ ముందు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నట్టు తెలిసింది. స్టీఫెన్‌సన్ కోసం సమాకూర్చిన రూ.50 లక్షలు ఎక్కడి నుంచి వచ్చాయని, వాటిని ఎవరు సమకూర్చారని, హవాలా రూపంలో వచ్చిన సమాచారంలో నిజా నిజాల గురించి వేం నరేందర్‌రెడ్డిని ఈడీ విచారించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఒక పక్క పార్లమెంటుతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికల నగారా త్వరలో మోగనున్న నేపథ్యంలో ఈడీ తన దూకుడును పెంచడంతోఈ కేసు ఎటు తిరిగి ఎటు దారి తీస్తుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

స్వదేశీ నినాదంతో విదేశాలకు తాకట్టు

ప్రజల దృష్టి మరల్చేందుకు దాడులు

- వామపక్షాలు ఐక్యపోరాటాలు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర రెండో మహాసభలో సౌహార్ద్ర సందేశం



మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ– కామారెడ్డి

స్వదేశీ నినాదంతో కేంద్రంలో గద్దెనెక్కిన ప్రధాని నరేంద్ర మోడీ.. ప్రభుత్వ సంస్థలన్నింటినీ విదేశీ మల్టీనేషనల్ కంపెనీలకు తాకట్టు పెట్టే కుట్రలు పన్నుతున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నించకుండా వారి దృష్టిని మరల్చేందుకు కులాలు, మతాల పేరుతో విడదీస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తరగతులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకునేందుకు వామపక్షాలు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర రెండో మహాసభలు రెండో రోజు శుక్రవారం వామపక్ష పార్టీల ప్రతినిధులు సౌహార్ద్ర సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తమ్మినేని ప్రసంగించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకునేలా ఇప్పటి నుంచే ఐక్య పోరాటాలు చేయాలన్నారు. వామపక్ష పార్టీలు అన్నీ ఒక్కటిగా ప్రజాస్వామ్య రక్షణకు పాటుపడాలని అన్నారు. ఈ రోజు అమెరికా ప్రపంచానికి పెద్దన్న పాత్ర కోల్పోతోందన్నారు. ఒకటో స్థాయికి ఎదుగుతున్న చైనాను ఆదర్శంగా తీసుకొని భారత దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా అడుగు వేయాల్సిన అవసరముందని చెప్పారు. ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి ఎమ్‌డీ గౌస్ మాట్లాడుతూ.. దేశ సార్వభౌమ విధానాలు కాపాడుకునేందుకు, శ్రమ జీవుల హక్కుల సాధన కోసం వారిని ఏకం చేసేందుకు తమ పార్టీ జాతీయ స్థాయిలో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు మద్దికాయ అశోక్, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, సాంబయ్య, వరికుప్పల వెంకన్న, రవి, మట్టయ్య, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు మల్లేశ్, ఐక్య ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కర్ణం వెంకన్న తదితర నాయకులు పాల్గొన్నారు.



స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగే కొద్దీ ఇంటర్నెట్ వినియోగం కూడా విపరీతంగా పెరుగుతున్నది. ఈ సంగతి అందరికీ తెలిసిందే. దీనికి తోడు ఎన్నో అవసరాలను ఇంటర్నెట్ తీరుస్తున్నది. అయితే మన ఫోన్‌లో మనకు తెలియకుండానే కొంత ఇంటర్నెట్ వినియోగం జరిగిపోతుంటుంది. దీని వల్ల డేటా త్వరగా అయిపోతుంది. అయితే సెర్చ్ చేసేటప్పుడు మనకు ఏది అవసరమో దానినే సెర్చ్ చేస్తే డేటా వినియోగం తగ్గుతుంది. మన మొబైల్‌లో ఇంటర్నెట్ డేటా త్వరగా అయిపోకుండా ఉండాలంటే ఏం చేయాలి... బ్రౌజర్‌ని ఉపయోగిస్తున్న సమయంలో ఏ విధమైన సూచనలు పాటించాలో చూద్దాం.

డేటా సేవ్ చేసుకుందాం

స్మార్ట్‌ఫోన్స్ ఉపయోగించే వారందరికీ మొబైల్ డేటాపై అవగాహన ఉంటుంది. ఇంటర్నెట్ కావాలంటే రీచార్జ్ చేసుకోవడం ద్వారా డేటా లభిస్తుంది. వచ్చిన డేటాను లిమిట్ వరకు వినియోగించుకునే వీలుంది.

4జీ డేటా:

ఇటీవల మార్కెట్లో అనేక సంస్థలు 4జీ డేటాను ప్రవేశపెట్టాయి. 4జీ డేటాను తీసుకోవడం వల్ల మనం ఉపయోగించే ఇంటర్నెట్ వేగంగా పని చేస్తుంది. అందువల్ల డేటా మొత్తం ఖర్చయ్యే అవకాశాలున్నాయి. అయితే దీన్ని కంట్రోల్ చేసుకోవచ్చు.



వై-ఫై ద్వారా డౌన్‌లోడ్:

ఈ-మెయిల్ ద్వారా వచ్చే ఎటాచ్‌మెంట్స్‌ను వై-ఫై ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిది. ఈ మెయిల్స్ ద్వారా పలు అటాచ్‌మెంట్స్ వస్తుంటాయి. వీటిని ఈ మెయిల్ చూసిన వెంటనే ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్ అయ్యే విధంగా ఉంచకూడదు. ఈ మెయిల్స్‌ను చెక్ చేసుకున్న తర్వాత ఎటాచ్‌మెంట్స్ ఉంటే వీటిని వై-ఫై అందుబాటులో ఉన్న చోట డౌన్‌లోడ్ చేసుకోండి.

ముఖ్యమైన వీడియోలను:

ప్రస్తుతం ప్రతి ఆఫీసులోనూ వై-ఫై సౌకర్యం అందుబాటులో ఉంది. దీన్ని ఉపయోగించుకోవడం వల్ల మీ మొబైల్‌లోని డేటా సేవ్ చేసినట్టే. ముఖ్యమైన వీడియోలను వైఫై ద్వారా చూసుకోవడం మంచిది.

ఓపెరా, క్రోమ్ వంటి బ్రౌజర్స్‌లో:

ఓపెరా, క్రోమ్ వంటి బ్రౌజర్స్‌లో డేటా, డేటా కంప్రెషన్ యుటిలిటీ బిల్ట్‌ఇన్‌గా వస్తుంది. దీనివల్ల కొంత డేటా యూసేజ్ సేవ్ అవుతుంది. స్మార్ట్‌ఫోన్‌లో ఆటోమేటిక్ అప్‌డేట్స్‌ను ఆన్‌లో ఉంచకూడదు. దీనివల్ల అనేక యాప్స్ నిరంతరం అప్‌డేట్ అవుతూనే ఉంటాయి.

వైఫై పాస్‌వర్డ్‌ను:

ప్రస్తుతం నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వై-ఫై సౌకర్యం అందుబాటులో ఉంది. వైఫై పాస్‌వర్డ్‌ను తెలుసుకోవడం ద్వారా మీ మొబైల్ నుంచే నెట్‌ని వినియోగిస్తూ పనులు పూర్తి చేసుకునే వీలుంది.





సెక్యూరిటీ లేకుండా వైఫై:

కొన్ని చోట్ల సెక్యూరిటీ లేకుండా వైఫై ఉంటుంది. ఇటువంటి వైఫై సౌకర్యాన్ని వినియోగించుకోవడం చాలా ఇబ్బంది కరమైన విషయమైనా నెట్‌ను ఇతరులు సులువుగా ఉపయోగిస్తారు. దీని వలన తెలియకుండానే మన ఇంటర్నెట్ డేటా ఖర్చవుతుంది. అందువల్ల మీరు తీసుకున్న నెట్‌కు రూటర్ ద్వారా వైఫై ఉంచినప్పటికీ తప్పకుండా పాస్‌వర్డ్ ప్రొటెక్షన్ ఉంచుకోవాలి. పాస్‌వర్డు ప్రొటెక్షన్ లేకపోవడం వల్ల ఇతరులు సులువుగా మన నెట్ ఉపయోగిస్తారు.

సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు:

ఇంటర్నెట్‌ను సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు ఉపయోగించడం ద్వారా మనకే ఇబ్బంది వస్తుంది. మనం వినియోగిస్తున్న ఐపీ రికార్డు అవుతుంది. కాబట్టి సమస్యలు తలెత్తకుండా వైఫైను జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

గెలాక్సీ M10 & M 20



శామ్సంగ్ గతవారంలో గెలాక్సీ M10 & M20 లను విడుదల చేసింది. ఈ స్మార్ట్ ఫోన్లు ఫిబ్రవరి 5న మార్కెట్లోకి రానున్నాయి. అయితే దాని కంటే ముందుగానే ఒక కొత్త సాఫ్ట్ వేర్ అప్డేట్ అందుకుంటున్నాయి. ఈ గెలాక్సీ M 10 90% స్క్రీన్ టూ బాడీ రేషియాతో వస్తుంది. ఈ ఫోన్, 2GB + 16GB స్టోరేజీ, 3GB + 32GB వంటి రెండు వేరియంట్లలో లభిస్తుంది. మెమొరీ కార్డ్ ద్వారా 512GB వరకు స్టోరేజ్‌ని పెంచుకునే వీలును కూడా కలిగి ఉంటుంది. ఇది డ్యూయల్ VoLTE సిమ్ ఫిచరుతో వస్తుంది. ఇక కెమేరా వెనుకభాగంలో f/1.9 అపర్చరు గల13MP సెన్సారుకు జతగా 120 డిగ్రీల 5MP అల్ట్రా - వైడ్ యాంగిల్ సెన్సరుతో అనుసంధానించిన డ్యూయల్ కెమేరా సేటప్పుతో వస్తుంది. ముందు, f/2.0 అపర్చరు గల 5 MP కెమేరాతో వస్తుంది. ముందు ఇన్ డిస్ప్లే ఫ్లాష్‌తో వస్తుంది. 3400 mAh బ్యాటరీని అందించారు. ఇది ఓషియన్ బ్లూ, చార్ కోల్ బ్లాక్ వంటి రెండు రంగులలో లభిస్తుంది.

గెలాక్సీ M 20

గెలాక్సీ M 20.. 2340 X 1080 రిజల్యూషనుతో, 19.5 : 9 యాస్పెక్ట్ రేషియో గల కొంచెం పెద్దదైన 6.3 – అంగుళాల FHD + డిస్ప్లేతో వస్తుంది. 90% స్క్రీన్ టూ బాడీ రేషియాతో వస్తుంది. ఈ ఫోన్, 3GB + 32GB స్టోరేజీ, 4GB + 64GB వంటి రెండు వేరియంట్లలో లభిస్తుంది. మెమొరీ కార్డ్ ద్వారా 512GB వరకు స్టోరేజిని పెంచుకునే వీలును కూడా ఉంది. కెమేరా వెనుకభాగంలో f /1.9 అపర్చరు గల13 MP సెన్సారుకు జతగా 120 డిగ్రీల 5 MP అల్ట్రా - వైడ్ యాంగిల్ సెన్సరుతో అనుసంధానించిన డ్యూయల్ కెమేరా సేటప్పుతో వస్తుంది. ముందు f /2.0 అపర్చరు 8 MP కెమేరాతో వస్తుంది. ముందు ఇన్ డిస్ప్లే ఫ్లాష్‌తో వస్తుంది. ఇందులో 5000 mAh బ్యాటరీ ఉంటుంది. ఇది ఓషియన్ బ్లూ, చార్ కోల్ బ్లాక్ వంటి రెండు రంగులలో లభిస్తుంది. అదనంగా Dolby Atmos సౌండ్ ఫిచరుతో వీడియో, ఆడియోని మరింతగా ఎంజాయ్ చేయవచ్చు.

ఒకే పేజీలో ప్రింట్ తీసుకోవడం ఎలా..?



అనుకోకుండా విహార యాత్రను ప్లాన్ చేసుకున్నారు. అక్కడ చూడవల్సిన ప్రదేశాలు చాలానే ఉన్నాయి. ఏ మాత్రం ముందస్తు అవగాహన లేకుండా ఆ ప్రదేశాలను తిలకించటం కాస్తంత ఇబ్బందికరంగానే ఉంటుంది. అయితే మీరు సందర్శించాలనుకుంటున్న ప్రాంతాలకు సంబంధించిన ఫొటోలను ఒకే పేజీలో ప్రింట్ తీసుకోవటం ద్వారా విహారయాత్రను ఏ మాత్రం మిస్ కాకుండా పూర్తి స్థాయిలో ఆస్వాదించగలరు. అదెలాగే తెలుసుకుందాం.

విండోస్ పీసీ లేదా ల్యాప్‌టాప్ ద్వారా మీ వద్ద ఉన్న ఫొటోలను ఏ విధమైన థర్డ్ పార్టీ ఫొటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించకుండా డిజిటల్ క్యామ్ లేదా ఇంటర్నెట్ ద్వారా మీరు సేకరించిన ఫొటోలను ఒకే పేజీలో ప్రింట్ తీసుకోవచ్చు.

ముందుగా ఫోల్డర్‌లో మీకు కావల్సిన ఫొటోలను సెలక్ట్ చేసుకోండి. ఆ తరువాత సెలక్ట్ చేసుకున్న ఫొటోల పై రైట్ క్లిక్ చేసినట్లయితే అనేక ఆప్షన్‌లు కనిపిస్తాయి. వాటిలో ప్రింట్ ఆప్షన్ పై క్లిక్ చేయండి. ఇప్పుడు ప్రింట్ మెనూ ఓపెన్ అవుతుంది. ప్రింటర్, పేపేర్ సైజ్, క్వాలిటీ అనే ఆప్షన్‌లు కనిపిస్తాయి. ప్రింటర్ కాలమ్‌లో మీ పీసీ లేదా ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ అయి ఉన్న ప్రింటర్‌ను సెలక్ట్ చేసుకోవల్సి ఉంటుంది.

అలానే పేపర్ సైజ్ మెనూలో మీకు నచ్చిన పేపర్ సైజ్‌ను సెట్ చేసుకోవచ్చు. ప్రింట్ మెనూ కుడి వైపు భాగంలో స్లైడర్ మాదిరి లేవట్ బార్ మీకు కనిపిస్తుంది. ఈ లేవుట్ స్లైడర్‌లో వివిధ సైజులతో కూడిన ప్రివ్యూలను మీరు చూడొచ్చు.. ఒక పేజీలో ఒక ఫొటోనే కావాలా లేక రెండు ఫొటోలు కావాలా లేకుంటే 4 లేదా 9 ఫొటోలు కావాలా ఇలా రకరకాల ప్రివ్యూ ఆప్షన్‌లు మీకు కనిపిస్తాయి. వాటిలో మీకు నచ్చిన ప్రివ్యూను సెట్ చేసుకుని ప్రింట్ బటన్ పై క్లిక్ చేసినట్లయితే ఒకే పేజీలో మీరు ఎంపిక చేసుకున్న ఫొటోలను ప్రింట్ రూపంలో పొందవచ్చు.

కంప్యూటర్ కాల్...



టెక్నాలజీ దూసుకుపోతున్న నేపథ్యంలో కంప్యూటర్లు, మొబైల్స్ మనల్ని శాసిస్తున్నాయి. అవి లేనిదే పనిగడవటం లేదు. ముఖ్యంగా కంప్యూటర్‌లో పని చేస్తుంటే కాల్స్ ఎత్తాలన్నా తీరిక ఉండదు. ఈ నేపథ్యంలోనే చాలా ముఖ్యమైన కాల్స్ మనం ఒక్కోసారి అందుకోలేకపోతుంటాం. అయితే ఇప్పుడు అలాంటి బెంగ లేకుండా మీరు ఫోన్ కాల్స్ కూడా కంప్యూటర్ నుంచే రిసీవ్ చేసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం థర్ట్‌పార్టీ సాఫ్ట్‌వేర్స్ ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్నాయి. ఈ టూల్స్ ఉపయోగించుకుని ఆండ్రాయిడ్ ఫోన్‌కు వచ్చే కాల్స్‌ను నేరుగా మీ కంప్యూటర్ నుంచి రిసీవ్ చేసుకోవచ్చు. కంప్యూటర్‌తో పాటు ఓ మంచి హెడ్ ఫోన్ మైక్ ఉంటే చాలు. మరి ప్రాసెస్ ఎలాగో చూద్దాం.

ముందుగా మీ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లో రిమోట్ ఫోన్ కాల్ అనే కూల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తరువాత మీ కంప్యూటర్‌లో కూడా కాల్‌సెంటర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇది పూర్తయిన తరువాత లాంచ్ చేయాలి.

ఐపీ అడ్రస్, పాస్‌వర్డ్: మీ మొబైల్ ఫోన్‌లోని రిమోట్ కాల్ యాప్ లాంచ్ అయిన వెంటనే డివైస్ ఐపీ అడ్రస్, పాస్‌వర్డ్ కనిపిస్తాయి.

యాడ్ వై -ఫై డివైస్: ఇప్పుడు కంప్యూటర్‌లోని కాల్ సెంటర్ యాప్‌లోకి వెళ్లి యాడ్ వై -ఫై డివైస్ ఆప్షన్ క్లిక్ చేసి ఐపీ అడ్రస్ ఎంటర్ చేయాలి. నెట్ వర్కుకు సంబంధించిన పాస్ వర్డును ఎంటర్ చేయాలి.

ప్రాసెస్ విజయవంతమైన వెంటనే: ఈ సింకింగ్ ప్రాసెస్ విజయవంతమైన వెంటనే మీ నెట్‌వర్క్‌కు సంబంధించిన నాలుగు అంకెల ఓటీపీ వస్తుంది. ఈ కోడ్‌ను విండోస్ టూల్‌లో ఎంటర్ చేస్తే మీ ఫోన్ పీసీకి కనెక్ట్ అయిపోతుంది.

సెటప్ చేసుకోవటం ద్వారా: మీ విండోస్ పీసీ కాల్ సెంటర్‌ను సెటప్ చేసుకోవటం ద్వారా నేరుగా మీ కంప్యూటర్ నుంచి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లను సెండ్ చేసుకునే వీలుంది. ఈ ఇంటిగ్రేషన్ ద్వారా మీ ఫోన్ కాల్ లాగ్స్ పీసీలో సింక్ అయిపోతాయి.

అన్ని కాంటాక్ట్స్ కంప్యూటర్‌లో: ఈ యాప్‌తో ఫోన్‌లోని అన్ని కాంటాక్ట్స్ కంప్యూటర్‌లో కనిపిస్తాయి. కాల్ లాగ్ సింక్ అవుతుంది. కాల్స్ చేసుకోవచ్చు, రిసీవ్ చేసుకోవచ్చు, ఎస్ఎంఎస్‌లను చదవొచ్చు , పంపొచ్చు, కావాల్సిన కాంటక్ట్స్‌ను సెర్చ్ చేసుకోవచ్చు.

ఆడియో సెట్టింగ్స్: ఆడియో సెట్టింగ్స్‌ను మేనేజ్ చేసుకోవచ్చు. ఇన్‌కమింగ్ కాల్స్ ఇంకా మేసేజ్‌లకు సంబంధించి పాపప్స్ వస్తాయి.

క్లిప్ బోర్డ్ నుంచే: క్లిప్ బోర్డ్ నుంచే డయలింగ్ నెంబర్స్ పొందేందుకు ప్రత్యేకమైన హట్ కీని ఏర్పాటు చేసుకోవచ్చు. ఇదే సమయంలో ఇన్‌కమింగ్ కాల్స్‌ను యాక్సెప్ట్ చేసేందుకు హట్‌కీని సెటప్ చేసుకోవచ్చు.


డియర్ రీడర్స్..

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి.

మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.

tech+@ navatelangana.com

శాస్త్రీయత ఎంత?



నమ్మకాలు నిజాలు

ప్రశ్న: చండీయాగం తదితర యాగాలు, యజ్ఞాలు చేస్తే లోకకల్యాణం జరుగుతుందా? యాగాలు, యజ్ఞాల వల్ల శాస్త్రీయ ప్రయోజనం ఉందా?

- ఎ.ఎన్.శాస్త్రి, హైదరాబాద్

జవాబు: యాగాలు, యజ్ఞాలు తదితర క్రతువుల వల్ల ధనం, కాలం వృధా కావడంతో పాటు ప్రజలను తిరోగమన భావజాలంలోకి నెట్టడం తప్ప మరో ప్రయోజనం ఇసుమంత కూడా లేదు. ప్రాచీనకాలంలో ప్రజల మధ్య వర్ణవ్యవస్థను పదిలం చేసే ప్రయత్నంలో అల్ప వర్గాల ప్రజా సమూహాల్ని సమ్మోహనం చేసేందుకు, వారిని భ్రమల్లో ఉంచడానికి, సమస్యలకు కారణాల్ని నిజ సమాజంలో కాకుండా, పాలకుల పాలనా విధానాలతో కాకుండా, వారి పాలసీలతో పద్ధతులతో కాకుండా మిధ్యలవైపు మళ్లించి ప్రజల్ని ఏమార్చి దోచుకోవడానికి వీలుగా ఇలాంటి యజ్ఞాలు, యాగాలు, తంతులు రూపొందించారు.

ఈ విశాల విశ్వంలో ఏ సంఘటన జరిగినా, జరగాలన్నా అది కేవలం నాలుగే విధాల బలాల ప్రమేయంతో జరుగుతుంది. వాటి పేర్లు 1. బలమైన కేంద్రక బలాలు (Strong nuclear forces) 2. బలహీనమైన కేంద్రక బలాలు (Weak nuclear forces) 3. గురుత్వాకర్షక బలాలు (Gravitational forces) 4. విద్యుదయస్కాంత బలాలు (Electromagnotic forces). ఇందులో మొదటి రెండు బలాలు పరమాణు కేంద్రకంలో తప్ప అవి మన నిజ జీవితంలో బాహాటంగా కనిపించవు. రోజువారీ సంఘటనలలో అవి ద్యోతకం కావు. మిగిలిన రెండు బలాల కన్న అవి చాలా బలోపేతమైనవే అయినా వాటి పరిధి పరమాణు కేంద్రకం వరకే! 'నీటిలోని మొసలి నిగిడి ఏనుగు బట్టు, బయట కుక్క చేత భంగపడును, స్థాన బలిమి కాని తన బలిమి కాదయా, విశ్వదాభిరామ వినురవేమ' అని వేమన శతకంలో చెప్పినట్లు బలమైన కేంద్రక బలాల బలం కేవలం మిల్లిమీటరులో 100 కోట్ల వంతు స్థలంలో ఉన్న కేంద్రకాన్ని మించి బయట పడదు. మనకు రోజువారి తటస్థపడే సకల కార్యకలాపాలకు, పరిశీలనలకు, దృగ్విషయాలకు, సంఘటనలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తుట్టతుదకు గురుత్వ బలాలు లేదా విద్యుదయస్కాంత బలాలే కారణం. ఇంతకు మించి మరే బలాలు లేవు. యాగబలం, గ్రహబలం, తపోబలం, మనోబలం, ధనబలం, అధికారబలం- ఇలాంటి వన్నీ సామాజిక, సాంప్రదాయక భావనలు తప్ప శాస్త్రీయతపై ఆధారపడ్డ కొలమానీయ బలాలు కావు.

లోక కల్యాణార్ధం అంటూ తమ చేతకాని తనాన్ని కప్పి పుచ్చుకోవడానికి యజ్ఞాలు, యాగాలు చేయడం పరిపాటి అయింది. చండీయాగం ఎలా చేయాలో తెలుసుకోవాలంటే గూగుల్‌లో మీరు Chandi yagam అని టైప్ చేస్తే పదుల కొద్దీ లింకులు వస్తాయి. అందులో దేనిలోనూ చండీయాగం చేస్తే ఏమి కలుగుతుందో శాస్త్రీయంగా వివరించరు. కేవలం తలాతోక లేని పదాల్ని, వాక్యాల్ని వల్లె వేస్తారు. ఒకదానితో మరోదానికి పొంతన లేని వ్యాఖ్యానాలు ఉంటాయి. ఓ వైపు ఆదిపరాశక్తి అంటూ చండీమాతను పోలుస్తారు. ఆదిశక్తి (first energy), పరాశక్తి (last energy) రెండూ ఆమే అంటారు. ఆమె లేనిచోటు ఉండదంటారు. ఆమెను బ్రహ్మరుద్రాదులు పూజిస్తారు అంటారు. బ్రహ్మ సృష్టికర్త అంటారు. ఆమెను అనుగ్రహం చేసుకోవడానికి ఋషులు చండీయాగాన్ని రూపొందించారంటారు. ఆమెను సంతుష్టి చేయడానికి క్రతువు చేయాలంటారు. ఆదిపరాశక్తి సకల చరాచర జగత్తులో ఆమే ఉండగా, ఆమెకు ఏమి తక్కువయిందని మనం ఆమెను సంతుష్టి చేయాలో చెప్పరు. ఆమె అనుగ్రహం పొందడానికి అంతటి మహాశక్తి శాలికి లంచంగానో, కానుకగానో యాగాలు ఎందుకు చేయాలో వివరించరు. ప్రజలకున్న భయాలు, అశక్తులు, కష్టాలు, నష్టాలు, అసంతృప్తులు, వేదనలు, అనారోగ్యాలు, ఆందోళనలు, అగచాట్లు అయోమయాలు వాస్తవాలు. ఆ వాస్తవాల వెనుక నిజ సమాజ ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక, పాలక విషయాలున్నాయి. ప్రజలు, ప్రజల ఈతిబాధలు వర్తమాన జాగృత సత్యాలు. తన కుమార్తె వివాహానికి 3000 కోట్ల రూపాయలు వెచ్చించే ధనవంతుడు, నెలకు 3000 రూపాయలు కూడా కుటుంబ నిర్వహణకు వాడుకోని పేదవాడు ఒకే నేలపై నివసిస్తున్న ప్రపంచంలో వనరుల మొత్తంలో దాదాపు 80 శాతం ప్రపంచంలో ఒకటి రెండు శాతానికి మించని కొద్దిమంది చేతిలో ఉంటే మిగిలిన 99 శాతం మందికి 20 శాతమే ఉండగా ఆదిపరాశక్తి నిమ్మకు నీరెత్తినట్టు ఉంటుంది. ప్రపంచంలోని సగం మంది ప్రజలకు దినసరి వేతనం గడ్డుస్థితిలో ఉన్నా ఆ మహా మాతకు తన బిడ్డల మీద కరుణ రావడంలేదు. కోట్లాది తన సంతతిలో వందలలోనే ఉన్నవారు అన్నీ అనుభవిస్తుండగా, కోట్లాది మంది తన పిల్లలు పలు కష్టాలతో వ్యధ చెందుతుంటే ఆ తల్లికి పట్టు వస్త్రాలు, నెయ్యి, కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన యజ్ఞాలు చేస్తేగానీ లోక కల్యాణం జరగదని అంటున్నారు. అలాగని లోక కల్యాణార్ధం ఎంతమంది ఇప్పటివరకు చండీయాగాలు చేయడం లేదు? వేలాదిగా చేస్తూనే ఉన్నారు. మరి లోక కల్యాణం ఎందుకు జరగడం లేదు.


లోక కల్యాణార్ధ క త చండీయాగ పూర్వం, లోక కల్యాణార్ధ కృత చండీయాగానంతరం ప్రపంచగతిలో, ప్రజల జీవన ప్రయాణాల్లో మార్పులు ఏవన్నా వస్తున్నాయా? వ్యక్తుల నమ్మకాలకు మాత్రమే చండీయాగం పరిమితమయితే దానికి లోక కల్యాణం అని పేరు పెట్టడంలో ఔచిత్యం ఎక్కడిది.

శాస్త్రీయ దృక్పథం, మానవతా దృష్టి, తార్కిక బుద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రశ్నించే ధైర్యం ఉండడం భారత పౌరుల ప్రాథమిక కర్తవ్యం అన్న విధంగా వున్న రాజ్యాంగం మీద ఒట్టు పెట్టుకొని గద్దె లెక్కిన మహనీయులు ప్రజలకు ఆదర్శ ప్రాయంగా ఉండాలి. మత ప్రసక్తిలేని లౌకిక రాజ్యం మన భారతదేశం అంటూ దేశపు అస్తిత్వ స్వభావాన్ని రాజ్యాంగం కొనియాడుతోంది. ఆ పదాలు గొప్ప పదాలు. ఆ పదాల అర్ధాలకు తూట్లు పొడిచే నాయకులు, అటు శాస్త్రానికి, ఇటు చట్టానికి పరోక్షంగా హాని చేస్తున్నారు.



ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

సింగిల్స్‌లో చుక్కెదురు



- 2-0తో ఇటలీ జోరు
- నేడు కీలక డబుల్స్ పోరు
- డెవిస్ కప్ క్వాలిఫయర్

కోల్‌కత

డెవిస్ కప్ క్వాలిఫయర్ తొలి రోజు ఆతిథ్య భారత్‌కు నిరాశే ఎదురైంది. సొంతగడ్డపై గడ్డి కోర్టును ఎంచుకున్న టీమ్ ఇండియా, తొలి రోజు ఆకట్టుకోవటంలో విఫలమైంది. రెండు సింగిల్స్‌లోనూ విఫలమై, 0-2తో వెనుకంజ వేసింది. ఎన్నో అంచనాల నడుమ బరిలోకి దిగిన ప్రగ్నేశ్ గున్నేశ్వరణ్, రామ్‌కుమార్ రామనాథన్‌లు అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. ఇటలీ స్టార్ ఆటగాడు మైదానంలో అడుగుపెట్టకపోయినా, ఆ జట్టు క్వాలిఫయర్‌లో భారత్‌పై పట్టు బిగించింది. రామ్‌కుమార్ రామనాథన్ 4-6, 2-6తో ఓటమి పాలవగా, 4-6, 3-6తో ప్రగ్నేశ్ గున్నేశ్వరణ్ విఫలమయ్యాడు. 0-2తో వెనుకంజ వేసిన దశలో నేడు జరిగే డబుల్స్ కీలకం కానున్నది. రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జోడీ విజయంపైనే భారత్ డెవిస్ కప్ వరల్డ్ ప్లేఆఫ్స్ ఆశలు ఆధారపడి ఉన్నాయి. లేదంటే రివర్స్ సింగిల్స్ రబ్బర్‌తో నిమిత్తం లేకుండా ఇటలీ ముందంజ వేయనున్నది. నిరుడు ఆసియా ఓసియాన గ్రూప్ -1 రబ్బర్‌లోనూ తొలి రోజు భారత్ 0-2తో వెనుకంజ వేసింది. కానీ తర్వాత వరుసగా డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లో గెలుపొంది 3-2తో సత్తా చాటింది. ఆ మ్యాచ్ నుంచి స్ఫూర్తి పొంది నేడు బరిలోకి దిగుతామని నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి అన్నాడు. ' ఇటలీ ఆటగాళ్లు ఎంతో అనుభవజ్ఞులు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉంటే బాగుండేది. జాతీయ జట్టుకు ఆడుతున్నప్పుడు ఉండే ఒత్తిడిని అర్థం చేసుకున్నాం. కొన్ని సార్లు ఊహికందని ఫలితాలు ఎదురవుతాయి. చైనాలోనూ ఇదే జరిగింది. చైనాతో పోల్చితే ఇటలీ ఎంతో బలమైన జట్టని తెలుసు. కానీ భారత్ పోరాడుతుంది' అని మహేశ్ భూపతి పేర్కొన్నాడు.

వరల్డ్ నం.19 మార్కోను కాదని యువ ఆటగాడు బెర్రాటిని ఎంచుకున్న ఇటలీ నమ్మకాన్ని ఆ కుర్రాడు నిలుపుకున్నాడు. నిరుడు వింబుల్డన్‌లో రెండో రౌండ్‌కు చేరిన బెర్రాటిని తొలి మ్యాచ్‌లో ప్రగ్నేశ్‌ను ఓడించాడు. ఆరంభంలో ప్రగ్నేశ్ గొప్పగా కనిపించాడు. మ్యాచ్ సాగుతున్న కొద్దీ ప్రగ్నేశ్ సర్వ్‌లు మెరుగయ్యాయి. ఇద్దరూ తమ సర్వ్‌లు నిలుపుకోవటంతో మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. కానీ బెర్రాటిని పదో గేమ్‌లో ఆధిక్యం సాధించి, వరుస పాయింట్లతో తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. బలమైన గ్రౌండ్ స్ట్రోక్స్ కొట్టిన బెర్రాటిని పదేపదే ప్రగ్నేశ్‌ను ఇబ్బందికి గురిచేశాడు. రెండో సెట్‌లోనూ మెరుగవని ప్రగ్నేశ్ 3-5తో అవకాశాలను అందిపుచ్చుకోలేదు. స్థానిక ప్రేక్షకుల మద్దతు లభించినా, ప్రగ్నేశ్ పుంజుకోలేదు. మరో మ్యాచ్‌లో ఆండ్రియస్ సెప్పీ వరుస సెట్లలో రామ్‌కుమార్ రామనాథన్‌పై గెలుపొందాడు. స్టేడియం రామనాథన్‌కు మద్దతుగా 'రామ్ రామ్' అంటూ ఉత్తేజపరిచినా, ఫలితం లేకపోయింది. ఎనిమిది ఏస్‌లతో చెలరేగి, సర్వ్‌లతో సత్తా చాటినా రిటర్న్‌లతో రామనాథన్ తేలిపోయాడు. దీంతో 71 నిమిషాల్లోనే సెప్పీకి మ్యాచ్‌ను కోల్పోయాడు.



బీసీసీఐకి ఫ్యామిలీ బెడద!

- ఏర్పాట్లలో విపరీత ఇబ్బందులు



ముంబయి : విదేశీ పర్యటనల్లో క్రికెటర్ల భార్యలు, పిల్లలు, ఇతర కుటుంబికులను అనుమతించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి తాజా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలో పలు విపరీత ఇబ్బందులు ఎదురయ్యాయి. సుదీర్ఘ పర్యటనల్లో భార్యలను తోడుగా తీసుకెళ్లేందుకు అనుమతించాలని ఇటీవల కెప్టెన్ కోహ్లి చేసిన సూచన మేరకు బీసీసీఐ ఏర్పాట్లు చేసింది. పర్యటన మొదలైన పది రోజుల తర్వాత భార్యలు క్రికెటర్లతో ఉండేందుకు బోర్డు అనుమతించింది. దీంతో ఆస్ట్రేలియా పర్యటనలో దాదాపు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ప్రయాణ ఖర్చులు, బస ఏర్పాట్లకు కుటుంబికుల ఖర్చును క్రికెటర్లే భరిస్తున్నారు. ఇతర ఖర్చుల విషయంలో బీసీసీఐకి పెద్దగా సమస్య లేదు. కానీ చాలా మంది ఆటగాళ్లు ఒకే సమయంలో జట్టుతో ఉండటంతో భారత బృందం సంఖ్య 40 వరకూ చేరుతుంది. వీరికి రవాణా కోసం రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా, కొన్ని సార్లు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హోటల్ గదుల బుకింగ్‌లోనూ బోర్డు అనవసర సమస్యలు చవిచూస్తోంది. 2019 ప్రపంచకప్ సందర్భంగా ఇంగ్లాండ్‌లోనూ ఇదే సమస్యలు తలెత్తితే బోర్డుకు మరిన్ని తలనొప్పులు ఖాయమని ఓ బీసీసీఐ అధికారి అన్నాడు. ' క్రికెటర్ల భార్యలు అందరూ ఒకేసారి రావటంతో ఏర్పాట్ల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. క్రికెటర్ల కుటుంబాలకు మ్యాచ్ టికెట్లను అందించటంలోనూ ఇబ్బంది ఎదురవుతోంది. ఇది డబ్బుకు సంబంధించిన సమస్య కాదు. భార్యలను అనుమతించవద్దని అనట్లేదు కానీ, దీని కాస్త క్రమబద్ధీకరించాలి. కొందరు క్రికెటర్లు అయితే పిల్లలను చూసుకునేందుకు ఆయాలను సైతం ఆస్ట్రేలియాకు తీసుకొచ్చారు. ఇది మరింత ఇబ్బందికరం' అని సదరు బీసీసీఐ అధికారి అన్నాడు.

భారతే ఫేవరెట్

- 2019 ప్రపంచకప్‌పై ద్రవిడ్
- రాహుల్ ఫామ్‌పై ఆందోళన అక్కర్లేదు



తిరువనంతపురం : 2019 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ఫేవరేట్‌గా ఆరంభించనున్నదని భారత మాజీ కెప్టెన్, భారత్-ఏ కోచ్ రాహుల్ ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ లయన్స్‌తో భారత్-ఏ సిరీస్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ద్రవిడ్ భారత అవకాశాలు మెండుగా ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. ' 1999 ప్రపంచకప్‌తో పోల్చితే 2019 వరల్డ్‌కప్ పిచ్‌లు ఫ్లాట్‌గా ఉండబోతున్నాయి. ఈ ప్రపంచకప్ భారీ స్కోర్లను చూడబోతుందని చెప్పగలను. అప్పుడు డ్యూక్ బాల్, ఇప్పుడు కొకొబుర్రా బంతి. దీనికి తోడు రెండు కొత్త బంతులు, ఫీల్డింగ్ నిబంధనలు పరిగణనలోకి తీసుకుంటే 1999, 2019 ప్రపంచకప్‌లను అసలు పోల్చలేం. కానీ భారత్ ఎంతో మెరుగైన క్రికెట్ ఆడుతోంది. కచ్చితంగా కోహ్లిసేన ఫేవరెట్లలో ఒకటి. రానున్న నెలల్లో భారత్ మరింత మెరుగైన క్రికెట్ ఆడగలదు' అని ద్రవిడ్ అన్నాడు. భారత్-ఏ తరఫున నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడనున్న కెఎల్ రాహుల్ ఫామ్‌పై ఆందోళన అక్కర్లేదని ద్రవిడ్ అన్నాడు. ' రాహుల్ క్రికెట్ నాణ్యత, సామర్థ్యతపై ఎటువంటి సందేహం లేదు. అంతర్జాతీయ స్థాయిలో మూడు ఫార్మాట్లలో నిలదొక్కుకున్న క్రికెటర్ అతడు. టీ20, వన్డేలు, టెస్టుల్లో శతకాలు సాధించిన కొద్ది మంది ఆటగాళ్లతో రాహుల్ ఒకడు. అతడి ఫామ్ గురించి ఎటువంటి ఆందోళన అవసరం లేదు' అని రాహుల్ తెలిపాడు.

కివీ అమ్మాయిలకు ఊరట

- చివరి వన్డేలో 8 వికెట్లతో విజయం
- 2-1తో సిరీస్ భారత్ సొంతం

హామిల్టన్ : అమ్మాయిలూ అబ్బాయిల దారిలోనే నడుస్తున్నారు!. కివీస్ పర్యటనలో మెన్స్ జట్టు గెలుపొందిన మరునాడే, మరిపించే విజయాలు సాధించిన మిథాలీసేన.. వారు విఫలమైన చోట వీళ్లు విఫలమయ్యారు. కెప్టెన్ రోహిత్ శర్మ 200వ వన్డేలో భారత్ ఓటమిపాలవగా, తాజాగా మహిళల జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ కెరీర్ 200వ వన్డేలోనూ అమ్మాయిల జట్టు ఓడింది. న్యూజిలాండ్ పేసర్ లీ తహుహు (3/26), 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అనా పీటర్సన్ (4/28) మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 149 పరుగులకే కుప్పకూలింది. టాప్ ఆర్డర్‌లో దీప్తి శర్మ (52, 90 బంతుల్లో 4 ఫోర్లు) అర్ధ సెంచరీతో పోరాడినా, మరో ఎండ్‌లో సహకారం కొరవడింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు రొడ్రిగస్ (12), స్మృతీ మంధాన (1) సహా మిథాలీ రాజ్ (9) స్వల్ప స్కోర్లకే అవుటయ్యారు. సిరీస్‌లో తొలిసారి బ్యాటింగ్ చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ (24, 40 బంతుల్లో 2 ఫోర్లు) క్రీజులో నిలిచినా, ఎటువంటి అద్భుతం చేయలేకపోయింది. డి హేమలత (13), తానియా భాటియా (0), శిఖా పాండే (8) విఫలమయ్యారు. కివీస్ పేసర్ల విజృంభణతో 29.2 ఓవర్లలోనే భారత్ కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో స్టార్ బ్యాటర్ సుజీ బేట్స్ (57, 64 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ ఆమీ సాతర్‌వేట్ (66 నాటౌట్, 74 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు న్యూజిలాండ్‌కు 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాయి. లారెన్ డౌన్ (10) విఫలమవగా, సోఫీ డివేన్ (17) మెరిసింది. మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచుల్లో ఘన విజయం సాధించిన భారత్ 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకున్నది. ఓ సెంచరీ, మరో అర్ధ సెంచరీతో చెలరేగిన స్మృతీ మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' గా నిలిచింది. న్యూజిలాండ్‌తో మూడు మ్యాచుల టీ20 సిరీస్ మెన్స్ జట్టుతో సమాంతరంగా ఫిబ్రవరి 6న వెల్లింగ్టన్‌లో తొలి టీ20తో ఆరంభం కానున్నది.

200 సంఖ్య మాత్రమే : మహిళల క్రికెట్‌లో 200వ వన్డే ఆడిన తొలి క్రికెటర్‌గా 36 ఏండ్ల భారత కెప్టెన్ మిథాలీ రాజ్ రికార్డు సృష్టించింది. హామిల్టన్‌లో కివీస్‌తో మూడో వన్డేతో మిథాలీ ఈ ఘనత సొంతం చేసుకున్నది. ' నా వరకూ 200వ వన్డే కేవలం సంఖ్య మాత్రమే. కానీ డబుల్ శతక మ్యాచ్ ఆడటం సంతోషంగా ఉంది. కెరీర్ ఆరంభంలో ఇది ఏ మాత్రం ఊహించనిది. నా లక్ష్యం భారత జట్టుకు ఆడాలనేది మాత్రమే. ఇంత సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడతానని ఏనాడూ ఊహించలేదు' అని మిథాలీ తెలిపింది. 200వ వన్డేకు గుర్తుగా మ్యాచ్‌కు ముందు జట్టు సభ్యుల నడుమ మిథాలీ కేక్ కట్ చేసింది. భారత్ 263 వన్డేలు ఆడగా, అందులో 200 వన్డేల్లో మిథాలీ రాజ్ ప్రాతినిథ్యం వహించటం విశేషం. 1999 జనవరిలో ఇంగ్లాండ్‌పై మిథాలీ కెరీర్ తొలి మ్యాచ్ ఆడింది. 200 మ్యాచుల్లో మిథాలీ 6622 పరుగులతో మహిళల క్రికెట్ పరుగుల జాబితాలోనూ అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

పంచాయతీ అభ్యర్థుల ఖర్చు @ రూ. 500 కోట్లు?

ఏరులై పారిన డబ్బు.. మద్యం

- అసెంబ్లీ ఎన్నికలను తలపించిన పోరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతంలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలు ఈ ఎన్నికల్లో డబ్బులు వెదజల్లాయి. గెలుపే లక్ష్యంగా బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో సుమారు రూ.500 కోట్లకు పైగా ఖర్చు అయినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12, 739 పంచాయతీలకు గత నెల ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. 12,732 గ్రామాలకు నోటిఫికేషన్ ఇస్తే ఇతరత్రా కారణాల వల్ల 11,549 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా 34,537 మంది సర్పంచి అభ్యర్థులు బరిలో నిలిచారు.వార్డులకు 200790 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. కనీసం ఒకే ఒక్క ఓటుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు చెల్లించినట్టుగా వార్తలొచ్చాయి.. ఇక హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాల్లో ఓటుకు రూ.10వేల నగదుతో పాటు మహిళలకు చీరలు, బంగారు ఆభరణాలు పంపిణీ చేశారు. ఇంచుమించు ప్రతి గ్రామంలో పోలింగ్ ముందు రోజు వరకు టెంట్లు వేసి గ్రామస్థులందరికీ మటన్, చికెన్‌లతో కూడిన విందు భోజనాలు పెట్టారు.

రాజన్న సిరిసిల్లలో రూ.105 కోట్లు

ఎన్నికల సందర్భంగా ఒక్కో పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థులు కనీసం రూ.50 కోట్ల నుంచి రూ. 70 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో రికార్డు స్థాయిలో రూ.105 కోట్లు ఖర్చు చేసినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. కొత్తగా జిల్లా కావడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీగా పుంజుకోవడం, రాజకీయాల్లో చెలామణి కావలనుకుంటే పంచాయతీ ఎన్నికలను తొలి మెట్టుగా భావించి అభ్యర్థులు భారీగా ఖర్చు పెట్టినట్టు తెలిసింది. ఎన్నికల్లో డబ్బు పంపిణీని కట్టడి చేయకపోవడం వల్లనే వందల కోట్లు వ్యయంచ్ చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

ఏకగ్రీవం కోసం..

పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు కొందరు అభ్యర్థులు కోట్లు విలువ చేసే వ్యవసాయ పొలాలను అమ్ముకుని (బరిలో నిలిచిన ప్రత్యర్థులను కొన్నట్టు సమాచారం. కోట్ల రూపాయాలు ఖర్చు చేసి ఓటమి పాలవుతే నష్టమని భావించిన అభ్యర్థులు ఇలా ఏకంగా ప్రత్యర్థులను కొనేసినట్టు తెలిసింది. బలమైన ప్రత్యర్థికి రూ.25 లక్షలు, పెద్దగా పలుకుబడి లేని వారికి రూ.10 లక్షల చొప్పున చెల్లించి పంచాయతీలను ఏకగ్రీవంతో గెలిచినట్టు ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. హైదరాబాద్ సమీపంలోని పంచాయతీల్లో ఒక్కో అభ్యర్థి రూ.50 కోట్ల నుంచి రూ. 70 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు తెలిసింది.

ఒకటే ఉంటుందా..?

రెండూ కొనసాగుతాయా...?

- రైతుబంధు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌పై చర్చోపచర్చలు
- కేంద్ర పథకం కింద రాష్ట్రానికి ఏటా రూ.2,824 వేల కోట్లు
- మొత్తం 47 లక్షల మంది రైతులకు లబ్ధి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ రాష్ట్రంలోని రైతుబంధు పథకంపై ప్రభావం చూపుతుందా..? అంటే ఆర్థికశాఖ వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తున్నది. ఈ రెండు పథకాలూ రైతులకు నగదును నేరుగా అందించేందుకు ఉద్దేశింపబడినవే కావటంతో రాష్ట్రంలో రెండూ కొనసాగుతాయా..? లేక ఏదేనీ ఒకటే ఉంటుందా...? అనే అంశంపై ఇప్పుడు చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం మొన్నటి శాసనసభ ఎన్నికల్లోనూ, నిన్నటి పంచాయతీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చిందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. భూమి ఎంతుదనే దానితో సంబంధం లేకుండా ఎకరానికి రూ.4 వేల చొప్పున నేరుగా రైతు అకౌంట్‌లోనే డబ్బులు వేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ వేసిన ఈ ఎత్తుగడ బాగా వర్కవుటయ్యింది. అయితే తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్... రైతుబంధుపై ప్రభావం చూపే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా పేద రైతులకు ఏడాదికి రూ. 6 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఐదెకరాల్లోపు భూమి ఉండే ప్రతి రైతుకు మూడు వాయిదాల్లో ఈ మొత్తం చెల్లించనున్నారు. నేరుగా వారి ఖాతాల్లోకే ఈ సొమ్మును బదిలీ చేయనున్నట్టు గోయల్ ప్రకటించారు. ఈ పథకంతో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వ ఖజానాపై రూ. 75వేల కోట్ల అదనపు భారం పడనుందని తెలిపారు.

కేంద్ర పథకం తీరు తెన్నులు అలా ఉంటే.. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుబంధు కింద ఎకరాకు రూ.4 వేల చొప్పున రైతులకు అందజేస్తున్నారు. రెండోసారి టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ.5 వేలకు పెంచుతామంటూ కేసీఆర్ ప్రకటించారు. ఇప్పుడు ఆయన రెండోసారి సీఎం అయ్యారు కాబట్టి.. రూ.5 వేల చొప్పున కచ్చితంగా ఇవ్వాల్సిందే. ఈ క్రమంలో ఇప్పుడు కేంద్రం కూడా రైతుబంధులాంటి స్కీమ్‌నే అమలు చేస్తామని ప్రకటించింది. కాకపోతే ఐదెకరాల లోపున్న వారికే ఇది వర్తిస్తుంది. ఈ పథకం కింద తెలంగాణకు ఏడాదికి సుమారుగా రూ.2,824 కోట్లు వస్తాయని ఆర్థికశాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ సర్కారు తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర పథకాలను రెండింటినీ అమలు చేస్తుందా..? లేక ఒక్కదానికే పరిమితమవుతుందా...? అన్నది వేచి చూడాలి. మరోవైపు కేంద్ర పథకం సొమ్మును టీఆర్ఎస్ సర్కారు.. రైతుబంధుకు మళ్లించే అవకాశాలు కూడా లేకపోలేదని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అలాగాకపోతే రైతుబంధును పూర్తిగా ఎత్తేసి కేంద్ర పథకాన్నే అమలు చేస్తారా? అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఏదేమైనా ఇలాంటి విషయాలన్నీ సీఎం కేసీఆర్ నిర్ణయంపైన్నే ఆధారపడి ఉంటాయని సదరు అధికారి వివరించారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్- తెలంగాణలో తీరు తెన్నులు...

ఎకరాలు	రైతుల సంఖ్య (లక్షల్లో)	మొత్తం (రూ.కోట్లలో)
0-1	14.86	891.49
1-2	13.37	802.40
2-3	8.96	537.69
3-4	5.75	345.06
4-5	4.13	247.94
మొత్తం	47.08	2,824.59



క్రీడలకు 200 కోట్లు పెంపు

2019 తాత్కాలిక బడ్జెట్

న్యూఢిల్లీ : 2019 తాత్కాలిక బడ్జెట్‌లో క్రీడా రంగానికి నిధులు స్వల్పంగా పెరిగాయి. కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో క్రీడలకు రూ. 214.20 కోట్లు పెంపుదల లభించింది. గత ఏడాది 2002.72 కోట్లు కాగా, 2019-2020కి 2216.92 కోట్లు కేటాయించారు. జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్), జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఎఫ్)లకు నిధులు పెంచారు. జాతీయ శిక్షణ శిబిరాలు సహా క్రీడా రంగాన్ని చూస్తోన్న సాయ్ నిధులు రూ. 395 నుంచి రూ.450 కోట్లకు పెరిగింది. ఎన్ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పెరిగింది. క్రీడాకారుల ప్రోత్సాహనికి ఉద్దేశించిన ప్రోత్సాహక నిధిని రూ. 63 కోట్ల నుంచి రూ. 89 కోట్లకు పెంపుదల చేశారు. ఖేలో ఇండియా కార్యక్రమ నిధులు సైతం రూ. 50.31 కోట్లు పెంచారు. ఖేలో ఇండియాకు గతంలో రూ. 550.69 కోట్లు కేటాయించగా, తాజాగా రూ.601 కోట్లు ఇవ్వనున్నారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే నిధుల్లో స్వల్ప కోత పడింది. ఈ నిధులు రూ. 245.13 కోట్ల నుంచి రూ. 245 కోట్లకు తగ్గింది. ఓవరాల్‌గా గత బడ్జెట్‌ల మాదిరిగానే కేవలం నిర్వహణ వ్యయం కోసమే నిధులు కేటాయింపు జరిగింది.

తెలుగు విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ భేటీ సందర్భంగా అమెరికాలో సంక్షోభంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల సమస్యలను కేటీఆర్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వారికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యార్థుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ- అమెరికా మధ్యగల వ్యాపార వాణిజ్య సంబంధాల గురించి ప్రత్యేకంగా చర్చించినట్టు కేథరిన్ తెలిపారు.

ద.మ.రైల్వేకు రూ.5,924కోట్లు కేటాయింపులు

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

2019-20 సంవత్సర కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,924కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో డబ్లింగ్ ప్రాజెక్టులు, కొత్త లైన్లకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను ద.మ.రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ శుక్రవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో మీడియాకు వెల్లడించారు. డబ్లింగ్ పనులకు రూ.1905కోట్లు, కొత్త లైన్లకు రూ.834కోట్లు, ప్రయాణికుల సౌకర్యాలకు రూ.229 కోట్లు, రైల్వే బ్రిడ్జిలకు రూ.397కోట్లు కేటాయించారు.

ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు...

మనోహరాబాద్-కొత్తపల్లి (కొత్తలైను) రూ.200 కోట్లు, మునీరాబాద్ - మహబూబ్‌నగర్ (కొత్తలైను) రూ.275 కోట్లు,భద్రాచలం - సత్తుపల్లి (కొత్తలైను) రూ.405కోట్లు,ఖాజీపేట - విజయవాడ మూడోలైను రూ.110 కోట్లు, ఘట్‌కేసర్ - యాదాద్రి లైనుకు రూ.20 కోట్లు, అక్కన్నపేట - మెదక్ లైనుకు రూ.10 కోట్లు,చర్లపల్లి వద్ద శాటిలైట్ టర్మినల్ అభివృద్ధికి రూ.5 కోట్లు,కాజీపేట వద్ద పీరియాడిక్ ఓవర్ వర్క్‌షాప్ నిర్మాణానికి రూ.10 కోట్లు, మౌలాలీ వద్ద రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సంస్థ ఏర్పాటుకు రూ.1.5 కోట్లు, ఖాజీపేట - బల్లార్ష మూడోలైను రూ. 265 కోట్లు, విజయబాడ,ఖాజీపేట,రేణిగుంట, వాడి స్టేషన్లకు బైపాస్ లైన్ల నిర్మాణానికి రూ.143 కోట్లు, తిరుపతి రైల్వే స్టేషన్ రెండో ప్రవేశద్వారం అభివృద్ధికి రూ.12.45 కోట్లు, తిరుచానూరు స్టేషన్ అభివృద్ధికి రూ.6కోట్లు నిధులు కేటాయించారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.